అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 15-6-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 114 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

రక్తదానం మరొకరికి ప్రాణదానం



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

రక్తదానం మరొకరికి ప్రాణదానం అని ఐటి మాస్టర్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వేముల శంకర్ అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకొని మిరాకిల్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిఖరం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ప్రజలు, యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని 210 యూ నిట వరకు రక్తదానం చేసి తమవంతు భాద్యతను నిర్వహించినందుకు అభినందనలు తెలియజేశారు. అలాగే గత 15 సంవత్సరాల నుండి ఇప్పటి వరకు 5800 యానిట్ల రక్తాన్ని వరంగల్ ఎంజీఎం వారికి అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో సంగి, సురేందర్, వేములకుమార్. ప్రవీణ్ కుమార్, మహేందర్, వైద్యులు కళ్యాణి , వైద్య సిబ్బంది యువతి యువకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
వరంగల్, హనుమకొండ, జనగామ
మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి
గురువారం 15 జూన్ 2023

జిల్లా ఎస్పీని కలిసిన 'శ్రీనివాసులు'



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ఇటీవల అదనపు ఎస్పీ నుంచి ఎస్పీగా పదోన్నతి పొందిన వి. శ్రీనివాసులు, బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ జె. సురేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ సురేందర్ రెడ్డి పదోన్నతి పొందిన శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్పి గా పదోన్నతి పొందిన శ్రీనివాసులు కు జిల్లా పరిధిలోని డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్సై లు, కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉమ్మడి వరంగల్ విద్యాశాఖలో... 2,325 పోస్టులు ఖాళీ..!

9 ఏండ్లుగా నియామకాలు నిల్..

నవతెలంగాణ- వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించాయి. తెలంగాణ సాధించుకున్నాక నియామకాలు జరుగుతాయని ఉపాధ్యాయులు, నిరుద్యోగులు ఆశించారు. ఇందుకు భిన్నంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రెండు మార్లు వరుసగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డ ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టకపోవడం విస్మయాన్ని కలిగిస్తుంది. నియామకాల నినాదంతో రాష్ట్ర సాధనకు నడుంబిగించిన ఉపాధ్యాయులు, వారి సంఘాలు ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో వున్నాయి. ఉపాధ్యాయులకు పదోన్నతులు సైతం కరువయ్యాయి. ఇందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,325 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడమే నిదర్శనం.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధికంగా వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా వున్నాయి. వరంగల్ జిల్లాలో 500, జనగామలో 474, మహబూబాబాద్‌లో 409, ములుగులో 307, హన్మకొండలో 271 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వరంగల్ జిల్లాలో 645 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 3,040 మంది ఉపాధ్యాయులు పనిచేయాల్సి వుండా, ప్రస్తుతం 2,540 మంది ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారు. హన్మకొండ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 149, ఎస్జీటీలు 122 మొత్తంగా 271 పోస్టులు ఖాళీగా వున్నాయి. ఇవి కాకుండా



హన్మకొండ జిల్లాలో నాల్గవ తరగతి ఉద్యోగులు, రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 34 ఖాళీగా వున్నాయి. ములుగు జిల్లాలో 307 పోస్టులు ఖాళీగా వున్నాయి. జిల్లాలో 353 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. స్కూల్ అసిస్టెంట్లు 493కు 346 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 147 ఖాళీలున్నాయి. ఎస్జీటీలు 863 పోస్టులకు 730 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 130 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీజీహెచ్ఎం పోస్టులు 22, ఎంఇవో పోస్టులు 8 ఖాళీగా వున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 178, ఎస్జీటీలు 186, పీజీహెచ్ఎంలు 45 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవి కాకుండా నాల్గవ తరగతి, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్ పోస్టులు 51ఖాళీగా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లాలో 364 పోస్టులు ఖాళీగా వున్నాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్లు 178, ఎస్జీటీలు 186 పోస్టులు ఖాళీగా వున్నాయి. జనగామ జిల్లాలో 508 పాఠశాలలున్నాయి. ఇందులో 35 వేల 965 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలో 2,570 టీచర్ పోస్టులకుగాను 2,146 మంది టీచర్లు పనిచేస్తున్నారు. 474 పోస్టులు ఖాళీగా వున్నాయి. పీజీహెచ్ఎం పోస్టులు 99కి గాను 50 పోస్టులు ఖాళీగా వుండడం గమనార్హం. టీచర్ పోస్టులే కాకుండా నాల్గవ తరగతి ఉద్యోగులు, రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు సైతం నేటికీ ఖాళీగానే వున్నాయి. దీంతో పాఠశాలల్లో పనిభారం పెరిగింది. టీచర్లే రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ల పనులు చేసుకుంటున్నారు.

చర్యలు తీసుకున్న దాఖలాల్లేవ్..

రాష్ట్రం ఏర్పడి 9 ఏండ్లు పూర్తయినా సీఎం కేసీఆర్ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయకపోవడం గమనార్హం. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వం అనేకమార్లు ప్రకటించినా క్షేత్రస్థాయిలో ఆ దిశగా చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు. కనీసం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన దాఖలాలు లేవు. బిఇడి, డిఇడి విద్యనభ్యసించిన అభ్యర్థులు 9 ఏండ్లుగా నియామకాలు లేక ప్రైవేటు పాఠశాలల్లోనే చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికీ ఉపాధ్యాయుల భర్తీపై గంపెడాశతో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఇకనైనా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



వైద్యరంగం పట్ల కేంద్రం నిర్లక్ష్యం

ఆరోగ్యకర తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యం
తెలంగాణలో వైద్య రంగానికి ప్రాధాన్యత
రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ-పాలకుర్తి

తెలంగాణలో వైద్యరంగం అభివద్ధి పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం గదిని మంత్రి ఎర్రబెల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళశాల కూడా ఇవ్వలేదని, తెలంగాణ రాష్ట్రం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఆరోగ్య తెలంగాణలో భాగంగా సీఎం కే.సి.ఆర్ అన్ని జిల్లాలకు మెడికల్ కళశాలలు మంజూరీ చేసి పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిని అదనముగా రెండు వేల పడకలకు పెంచడంతోపాటు హైదరాబాద్ నగరం చుట్టూ 4 వేల 200 పడకల తో నాలుగు మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం చేపట్టడం జరుగుతున్నదని వివరించారు. వరంగల్‌లో 24 అంతస్తులతో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం 11 వందల కోట్ల ఖర్చుతో నిర్మించడం జరుగుతున్నదని అన్నారు. నూతనంగా ఏర్పడిన జనగాం జిల్లాలో మెడికల్ కళశాల మంజూరీ చేసి రూ. 18 కోట్ల 70 లక్షలతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని. పాలకుర్తి ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ కు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న 30 పడకల తొర్రూర్ ఆసుపత్రి ని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ కు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని. తొర్రూర్‌లో రూ.16 లక్షలతో మార్చురీ భవన నిర్మాణం చేసి ప్రారంభించుకున్నామన్నారు. పాలకుర్తి లో 33 లక్షల ఖర్చుతో మార్చురీ భవనము ప్రారంభించుకోవడం ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి కళ్ల అద్దాలు పంపిణీ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టరేట్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌డీఓ రాంరెడ్డి, జిల్లా వైద్యాధికారి ప్రశాంత్, డాక్టర్లు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.



నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ బిక్షం

నవతెలంగాణ-జనగామ

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై వెంటనే చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ విద్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్లో డిఇఓ రాముకు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యులు ధర్మబిక్షం, నాగరాజు, యునస్ మాట్లాడుతూ జనగామ పట్టణాల్లోనూ పలు ప్రైవేట్ పాఠాలల్లో జీవోనెంబర్ 1 కి విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారు అన్నారు. జీవో 42 ప్రకారం ఫీజు రెగ్యులేశన్ కమిటీ అనుమతి తో ఫీజులు పెంచాలని అన్నారు. అలాగే నంబర్ 91 ప్రకారం అడ్మిషన్ ఫీజు 500 మాత్రమే తీసుకోవాలని అన్నారు. కానీ రూ. 5 వేల నుండి 10 వేలు వసూలు చేస్తున్నారని అన్నారు. అదే విధంగా సెక్షన్ 8(1) ప్రకారం ఐఐటి టెక్నో ఈ టెక్నో, ఒలంఫియడ్ అని పొట్టి పొట్టి పేర్లు ఉండకూడదని ఉన్న జనగామలోనీ ఆర్యభట్ట వడ్లకొండలోని గ్రీన్ వుడ్ పాఠశాల లు గ్రామీణ ప్రాంతలో నిరుపేద ప్రజలకు మోసం చేస్తూ అక్రమ ఫీజులు వసూలు చేస్తున్నారు అని అన్నారు. జనగామ జిల్లా విద్యశాఖాధికారి ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు నోట్ బుక్స్ యూనిఫారాలు అమ్మకూడదని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆదేశాలను పాటించడం లేదన్నారు. సూచన ఇచ్చిన జనగామలోనీ శ్రీ అరబిందో ప్రైవేట్ పాఠశాల బహిరంగంగా పుస్తకాలు అమ్ముతం అని ప్రకటన చేస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2008 జీవో నంబర్ 90,91,92 పకడ్బందీగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం చూపని ఎడల ఉద్యమ కార్యాచరణ ఏర్పాటు చేసి ఉద్యమాలు నిర్వహిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

57 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు
కంటి వెలుగు దేశానికి ఆదర్శం
మహిళ ప్రతి వాళ్లకు అధిక ప్రాధాన్యత
మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నామని మహిళల సుఖప్రసవాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ 57 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని కంటి వెలుగు దేశానికి ఆదర్శమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎంపీ, భారాస జిల్లా అధ్యక్షులు మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జెడ్పి చెర్‌పర్సన్ అంగోత్ బిందు, జిల్లా కలెక్టర్ శశాంకతో పాల్గొని మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడారు. సీఎం కెసిఆర్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం పేద ప్రజలకు నిరంతరం దేశంలో ఏ రాష్ట్రంలో లేని వైద్య సేవలను అందిస్తున్న గొప్ప రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. కంటి వెలుగు అద్భుతమైన కార్యక్రమం అన్నారు. గ్రామాల్లో రోగుల సేవల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిరంతరం పని చేస్తే, బస్తి దావాఖనలు పట్టణంలో సేవలు అందిస్తున్నాయి అన్నారు. 57 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు టీ డయాగ్నస్టిక్ ద్వారా పేద ప్రజలకు ఉచితముగా పరీక్షలు చేస్తున్నామన్నారు. ఇదే ప్రైవేట్ లో చేస్తే వేలు ఖర్చు అవుతాయి అని అన్నారు మహబూబాబాద్ నియోజకవర్గంలో గిరిజన గుడాలు తండాలు



ఎక్కువ,మారుమూల ప్రాంతాలకు అంబులెన్స్ లు వెళ్లి రోగులను త్వరగా దవాఖనకు చేరుస్తూ ప్రజలకు నమ్మకం పెంచారన్నారు. ప్రభుత్వ దావాఖనల్లో డెలివరి ల సంఖ్య పెరిగింది.దీంతో మహబూబాబాద్ జిల్లాలో కొన్ని ప్రైవేట్ హాస్పటల్లు మూత పడే స్థాయికి వచ్చాయి అన్నారుసీఎం కెసిఆర్ పాలనలో ప్రభుత్వ దావాఖనలపై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. రూ.500 కోట్లతో నర్సింగ్,మెడికల్,ప్రభుత్వ దావాఖన 40ఎకరాల్లో నిర్మించామన్నారు. ఇక్కడ అందరూ కూర్చున్నారు అంటే దాని వెనుక నా శ్రమ ఎంత ఉందో ఆలోచించాలి అన్నారు. కెసిఆర్ కిట్, అమ్మ వడి, 12వేల ఆర్థిక సహాయం, ఉచిత పరీక్షలు, న్యూట్రీషియన్ కిట్స్, కంటి అద్దాల పంపిణీ, రోగులకు పౌష్టికాహార డైట్ చార్జీల పెంపు, ఉద్యోగుల వేతనాల పెంపు, సిబ్బంది పెంపు, ఇలా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాం.కిడ్నీ రోగులకు డయలసిస్ ఉచితంగా చేస్తున్నాం.ఆరోగ్య శ్రీ ద్వారా ఎన్నో రకాలుగా సేవలు అందిస్తున్నది ఈ సీఎం కెసిఆర్ ప్రభుత్వం,సీఎం రిలీఫ్ ఫండ్ కొన్ని లక్షల మందికి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా. రామ్మోహన్ రెడ్డి, డాక్టర్ సీతా మహాలక్ష్మి, వైస్ చైర్మన్ ఎండి ఫరీద్, మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్లు, భారాస నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



అమ్మిన సొమ్ము రాక రైతుల అవస్థలు..

వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్

నవతెలంగాణ-గణపురం

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన తెలంగాణ ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాలోకి డబ్బులు చెల్లించాలని వైఎస్ఆర్‌టీపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు అప్పం కిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు సొక్కమ్ సదయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషన్ మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్న ఇంకా రబీ సీజన్ ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం డబ్బులు పూర్తిస్థాయిలో రైతులకు చెల్లించ లేదన్నారు. సుమారు రెండు నెలల నుండి రైతులకు ధాన్యం డబ్బులు ఇప్పిస్తామంటూ అధికారులు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షం వల్ల రైతులు పంట నష్టపోతే పరిహారం, పంట ఇన్సూరెన్స్ డబ్బులు కూడా ప్రభుత్వం ఇవ్వలేదని రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. న్యాయంగా మాట్లాడిన రైతులకు బేడీలు వేసి జైల్లో పెడుతున్నారని దుయ్యపట్టారు. అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడులకు వడ్డీ భారం నడ్డి విరుస్తుందని విద్యా సంస్థలలో పిల్లలకి ఫీజులు కట్టలేని పరిస్థితిలో ఉన్నట్లు ఆయన తెలిపారు కొనుగోలు కేంద్రంలో ధాన్యం భద్రపరచడానికి సరైన వసతులు కలిగించక తరుగు పేరుతో రైతులను దగా చేస్తున్న మిల్లర్లు ఆగడాలను అడ్డుకట్ట వేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. రైతుల కష్టాలు నష్టాలు అంచనా వేసి ప్రభుత్వంతో నష్టపరిహారం ఇప్పించాల్సిన అధికారులు అధికార పార్టీ ఉత్సవాలకు సమావేశాలకు జనాన్ని తరలిస్తూ బానిసలుగా బ్రతకడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. పుట్టెడు కష్టాల్లో అన్నదాతలు ఉంటే ఆదుకోవాల్సింది పోయి ఉత్సవంలో పాల్గొనడం అత్యంత అమానవీయ చర్య అన్నారు. వెంటనే కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించి రైతులు ఖాతాలో డబ్బు జమ చేయాలని తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తిస్థాయిలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ప్రభుత్వము డబ్బులు చెల్లించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రభాకర్, భీష్మాచారి, మల్లయ్య సురేందర్ రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.



కొట్టుకపోయిన అంగన్‌వాడీ కేంద్రం పైకప్పు

రూ.1.50 లక్షల ప్రజాసొమ్ము దుర్వినియోగం

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని పెద్దతూండ్ల గ్రామంలో అంగన్ వాడి కేంద్రము-1 పైకప్పు రేకులు ఇటీవల విచిన తేలికపాటి గాలి దుమారం బీభత్సవాన్ని కొట్టికపోయాయి. అయితే గతంలో ప్రాథమిక పాటశాలగా కొనసాగిన పాత గోడలపై పైకపుతోపాటి పలు మరమ్మతులు చేయడానికి ఇటీవల జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.2.50లక్షలు అధికారులు మంజూరు చేశారు.పనులు నిర్వహించిన గుత్తేదారు నాణ్యమైన పనులు చేయకపోవడం ఇందుకు తోడుగా సంబంధించిన పంచాయతీ రాజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత లోపించి తేలికపాటి గాలిదుమారానికి భవనం పైకెప్పుగా వేసిన రేకులు కొట్టుకపోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా పరిషత్ నుంచి మంజూరైన రూ.2.50 లక్షల నిధుల్లో గుత్తేదారు 1.50 లక్షల పనులు మాత్రమే అవికూడా నాణ్యత పాటించకపోవడంతో రూ.1.50 లక్షల ప్రజాసొమ్ము దుర్వినియోగానికి గురైనట్లుగా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైన సంబంధించిన ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి నాణ్యత ప్రమాణాలు పాటించని గుత్తేదారుపై చర్యలు తీసుకొని అంగన్ వాడి కేంద్రానికి నాణ్యమైన పనులు చేపట్టేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు మండలంలో మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటన

నవతెలంగాణ-గోవిందరావుపేట

నేడు మండలంలోని బుసాపురం గ్రామంలో పల్లె ప్రగతి దినోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొంటారని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 గంటలకు ప్రాథమికొన్నత పాఠశాల బుస్సాపూర్, గోవిందరావుపేట మండలం నందు గౌరవ గిరిజన సంక్షేమ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవ కార్యక్రమానికి, మన ఊరు మన బడి పనులు పూర్తయినందున ప్రారంభించుటకు విచ్చేయుచున్నారని తెలిపారు.

విద్యుద్ఘాతంతో దుక్కిటెద్దు మృతి



నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రమాదవశాత్తు విద్యుత్ఘాతంతో చాట్లపల్లి రాజబాబుకు చెందిన రూ.70 వేలు విలువ గల దుక్కిటెద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని మల్లారం బుధవారం చోటుచేసుకుంది.బాధిత రైతు పూర్తి కథనం ప్రకారం ఉదయం మేతకు విడిసిన ఎద్దు మేసుకుంటు ఊరి చివరలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ సపోర్ట్ కరెంట్ తిగకు తగలడం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ రావడంతో ఎద్దు అక్కడికక్కడే మతిచెందినట్లుగా కన్నీరుమున్నీరయ్యాడు. ఆర్థికంగా రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్పొరేట్ వైద్యం అందించడమే కేసీఆర్ లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-చిట్యాల

ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యాన్ని అందించడం కోసమే కెసిఆర్ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి మండలానికి ప్రభుత్వ దవాఖానాలు స్థాపించి మెరుగైన వైద్యాన్ని అందించడం కోసం కషి చేస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రిలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకల్లో భాగంగా వైద్య ఆరోగ్య ఉత్సవాల కార్యక్రమాలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, జిల్లా కలెక్టర్ భావేశ్ మిశ్రా, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డేవిడ్ రాజ్, పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రాంభించి మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హెల్త్ సబ్ సెంటర్స్,పల్లె దవాఖాన,బస్తీ దవాఖాన ఏర్పాటు చేసి మంచి నైపుణ్యం కలిగిన వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి,తెలంగాణ డయాగ్నస్టిక్స్ హబ్ ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. భూపాలపల్లి జిల్లాలో వైద్య కళాశాల మంజూరు చేసి నేటి విద్యా సంవత్సరం నుండి తరగతులు ప్రారంభించుకోబోతున్నట్టు చెప్పారు. ఆయుష్ హాస్పిటల్, వైద్య కళాశాల తో పాటు 500 పడకల ఆసుపత్రి నిర్మించుకోబోతున్నామని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో వైద్య సేవలకు



కావాల్సిన ప్రతి విషయంలో వెంటనే స్పందించి మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావుకి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. మెరుగైన వైద్య సేవలు అందించే క్రమంలో వరంగల్ పట్టణంలో ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు 15 అంతస్తుల్లో 2000 బెడ్స్ తో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం అవుతుందన్నారు. ప్రతి పేదవాడు ప్రభుత్వం అందించే ప్రభుత్వ దావాఖానాలను సద్వినియం చేసుకోవాలని ప్రజల్ని కోరారు. అలాగే మహిళల అభ్యున్నతికి, పేదింటి ఆడబిడ్డలకు అండగా అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారన్నారు. వైద్య ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న పల్లె దవాఖాన డాక్టర్లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ డాక్టర్లని ప్రత్యేకంగా సన్మానించి ప్రశంసపత్రాలు అందజేశారు. మండలానికి సంబంధించిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావు వినోద వీర రెడ్డి, జెడ్పిటిసి గొర్రె సాగర్ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోలిస్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

నవతెలంగాణ- హనుమకొండ

ఎస్ఐ, కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగాలకు తుది రాత పరీక్షల్లో అర్హత సాధించి న అభ్యర్థులకు సంబంధించిన ధ్రువ ప్రతాల పరిశీలన వరంగల్ పోలీస్ కమిష నరేట్ కార్యాలయంలో బుధవారం ప్రారంభమైంది. వరంగల్ కమిషనరేట్ కార్యా లయంలోని రుద్రమదేవి ప్రాంగణంలో బుధవారం నుండి ఈ నెల 26 వ తేది వరకు వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాలకు చెందిన అభ్యర్థుల ఈ ధ్రువ పత్రాల పరిశీలిస్తారు. అభ్యర్థులకు కేటాయించిన తేదీల్లో అభ్యర్థులు అధికారులు సూచించిన ఒరిజినల్ ధ్రువపత్రాలతో కావాల్సి ఉంటుంది. వరంగల్ పోలీస్ కమి షనరేట్ పరిధిలో మొత్తం 7706మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించను న్నారు. ఇందుకోసం మొత్తం 15 కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ పరిశీలనలో భాగంగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో దరఖాస్తు ఫారంలో తెలిపి న విధంగా అభ్యర్థుల సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలను అధికారులు పరిశీ లిస్తారు. అలాగే దరఖాస్తు చేసుకోనే ఏదైనా తప్పులు నమోదు చేసినట్లయితే వాట ని తిరిగి సరిద్దిదుకునేందుకుగాను తెలంగాణ పోలీస్ నియమాకాల బోర్డు అభ్య ర్థులకు అవకాశం కల్పించారు. ఈ తప్పులను సరిదిద్దుకొనేందుకు నియామక బోర్డు సూచించిన మొత్తం రుసుం చెల్లించాల్సి ఉంటుందని, తొలిరోజున ఆరు వందల మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తారని సంబంధిత ఇన్‌చార్జి



పోలీస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పోలిస్ అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌక్యరానికి గురికాకుండా అలాగే ధ్రువపత్రాల పరిశీలన ప్రప్రక్రియ వేగంగా నిర్వహించేందుకుగాను అదనపు పరిశీలన కౌంటర్ల చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ డిసిపి మురళీధర్, ట్రైనీ ఐపిఎస్ అంకిత్, క్రైమ్ ఏసిపి డేవిడ్ రాజుతో పాటు సిపిఓఏఓ రామకష్ణ స్వామితో పాటు పరిపాలన విభాగం అధికారులు, సిబ్బంది, పోలీస్, ఆర్‌టిఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఎనకపల్లి గ్రామంలో కార్డన్ సెర్చ్

నవతెలంగాణ-మహాదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం ఎనకపల్లి గ్రామంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మావోయిస్టులు సమాచారం మేరకు గ్రామంలో సోదాలు చేసి ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఎస్సై రాజ్‌కుమార్



మాట్లాడారు. అభివద్ధి నిరోధకులైన మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించడం జరిగింది. గ్రామంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించడం జరిగింది. అలాగే గ్రామంలో మత్తు పదార్థాలైన గంజాయి, గుట్కా, సారా వంటివి విక్రయించవద్దని.. ఒక వేళ ఎవరైనా నిబంధ నలు అతిక్రమి ంచి విక్రయాలు చేప డితే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే తమ దష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ పోలిస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



హేమాచలంలో తైబజార్ !

నవతెలంగాణ-మంగపేట

శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో సందర్శకులు భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక తైబజార్(అంగడి)ని ఏర్పాటు చేసినట్లు దేవాదాయ ధర్మదాయశాఖ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రవణం సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హేమాచలంలో బ్రహ్మోత్సవాల అనంతరం షాపుల ఏర్పాటుకు వేలం పాటలు నిర్వహించి దుకాణాలు ఏర్పాటు చేసే ఆనవాయితీ ఉండేదని ఈ క్రమంలో గిరిజన సంఘాలు తమకే కేటాయించాలంటూ కోర్టులో కేసు వేయడంతో కొన్ని సంవత్సరాలుగా షాపుల ఏర్పాటు బ్రహ్మోత్సవాల నెల రోజులకే పరిమితమైందని అన్నారు. ఈ క్రమంలో ఆలయానికి వచ్చే ఆదాయం తగ్గడంతో పాటు సందర్శకులు భక్తులకు ఇబ్బందులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి మల్లూరు గ్రామంలోని ప్రజలతో బుధవారం సమావేశమై సామాజిక వర్గాల వారిగా షాపులు నడుపుకునేలా చర్చలు జరిపి తాత్కాలిక తైబజారు(అంగడి) మాదిరిగా నడిపించుకునేలా అంగీకారానికి వచ్చినట్లు తెలిపారు. కొబ్బరికాయల షాపులు రెండు ఒకటి నల్లెబోయిన లక్ష్మణరావు(గిరిజన), మరోకటి ముంద్రాతి విజయ్(గిరిజనేతర) ఒక్కొక్కరు నెలకు 7 వేల 5 వందలు ఆలయానికి చెల్లించి రశీదు పొందాలి. ఫ్యాన్సీ బొమ్మల షాపులు కుర్సం నర్సింహారావు(గిరిజన), యంపల్లి శ్రీను (గిరిజనేతర) ఒక్కొక్కరు నెలకు 3 వేలు ఆలయానికి చెల్లించాలి, హెూటల్ మంకిడి శ్రావణ్ కుమార్ (గిరిజన), మేడిశెట్టి నర్సింహారావు(గిరిజనేతర) ఒక్కొక్కరు 3 వేలు ఆలయానికి చెల్లించాలని గ్రామస్తులు నిర్ణయం తీసుకుని తీర్మానించినట్లు తెలిపారు. కోర్టు తీర్పు అనంతరం యదావిధిగా వేలం జరిపించి అన్న రకాల షాపులకు ఏర్పాటు చేయనున్నట్లు ఈవో తెలిపారు. తైబజారులో ఏర్పాటు చేసే షాపులు సైతం దేవాదాయ దర్మదాయశాఖ నిర్ణయాలకు లోబడి ఉంటాయని తెలిపారు.

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 15-6-2023

సంపుటి : 9 | సంచిక : 114 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

ఢిల్లీకి పాలు, నీళ్లు నిలిపేస్తాం

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

- ఖాప్ పంచాయతీల డిమాండ్
- 18న భారత్ బంద్‌కు పిలుపు



న్యూఢిల్లీ : రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేసిన హర్యానాలోని ఖాప్ పంచాయితీలు బుధవారం బంద్ నిర్వహించాయి. ఢిల్లీ-హర్యానా జాతీయ రహదారిని ...5లో

ఉన్నతంగా వైద్యం

అదే మా లక్ష్యం : సీఎం కేసీఆర్

- నిమ్స్‌లో దశాబ్ది బ్లాక్ భవనానికి శంకుస్థాపన
- కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ ప్రారంభం



"2014 లో వైద్యరంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు రూ.2,100 కోట్లు. కాగా, 2023-24లో కేటాయింపులు రూ. 12,367 కోట్లకి పెంచాం. అన్నం ఉడికిందా అని కుండంతా పిసికి చూడాల్సిన అవసరం లేదు. దీన్నే బట్టే మనకు తెలంగాణ పురోగమనం అర్థం అవుతుంది. వైద్యారోగ్య శాఖను చాలా అనూహ్యంగా విస్తరిస్తున్నాం. 17 వేల పడకల నుంచి 50 వేల పడకలకు విస్తరించాం, వందో రెండొందలో ఉన్న ఆక్సిజన్ బెడ్లను 50 వేలకు పెంచుకున్నాం, కేంద్రాన్ని ప్రాధేయపడకుండా సొంతంగా 550 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్నాం" - కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశానికి ఆదర్శంగా నిలిచిన రాష్ట్ర వైద్యారోగ్య రంగాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేంత వరకు రాష్ట్ర ప్రభుత్వ పట్టుదల తపన కొనసాగుతూనే ఉంటుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యాచరణ మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందనీ, కరోనావంటి కష్టకాలంలో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది, ఉన్నతాధికారులు ప్రదర్శించిన పనితీరు గొప్పదని సీఎం కొనియాడారు. ఎంతచేసినా వైద్యశాఖకు పలు దిక్కుల నుంచి విమర్శలు వస్తుంటాయని తెలిపారు. ఈ విషయాన్ని గమనంలో ఉంచుకుని ప్రజావైద్యం దిశగా ఈ శాఖ చేస్తున్న కృషిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. అందుకోసం ప్రజా సంబంధాల వ్యవస్థను మరింతగా మెరుగుపరుచుకుని ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు.

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాడు జరిగిన వైద్యారోగ్య దినోత్సవం సందర్భంగా ...ప్రముఖ ప్రభుత్వ దవాఖాన నిమ్స్ విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఇది పూర్తయితే ఈ 'దశాబ్ది వైద్య భవనాల్లో' నూతనంగా 2,000 ఆక్సిజన్ పడకలు అందుబాటులోకి రానున్నాయి. అత్యంత అధునాతన ఆపరేషన్ థియేటర్లు సహా వర్తమాన వైద్య రంగంలో ప్రజల వైద్యసేవలకు అవసరమయ్యే పలు రకాల వైద్య సేవలు అందనున్నాయి.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ మానవ జీవితానికి, ...6లో



నిమ్స్ కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచండి

- ఇతరత్రా సమస్యలు పరిష్కరించండి
- సీఎం కేసీఆర్‌కు సీఐటీయూ వినతి పత్రం అందజేత

వివరాలు 2లో

రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణాలకు అంతర్జాతీయ అవార్డులు

- సీఎం కేసీఆర్ హర్షం


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన, పునరుద్ధరించిన 5 నిర్మాణాలు అంతర్జాతీయ అవార్డులను దక్కించుకోవడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు హర్షం వ్యక్తం ...5లో

తమిళనాడు మంత్రి అరెస్టు

సెంథిల్‌బాలాజీ అరెస్టులో నాటకీయ పరిణామాలు

- ఛాతిలో నొప్పితో ఆస్పత్రిలో చేరిన మంత్రి
- ఇది ప్రతీకార రాజకీయ చర్య ..ఫెడరల్ స్ఫూర్తిపై దాడి : సీఎం స్టాలిన్
- ఇలాంటి చర్యలకు భయపడం : కాంగ్రెస్



ఆస్పత్రిలో మంత్రిని పరామర్శిస్తున్న సీఎం

చెన్నై : మనీలాండరింగ్ కేసులో తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి, డీఎంకే నేత వి. సెంథిల్ బాలాజీ అరెస్టయ్యారు. మంత్రి కార్యాలయంలో మంగళవారం నుంచి సోదాలు జరిపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దాదాపు 18 గంటల పాటు విచారించారు. అనంతరం అర్ధరాత్రి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. మంత్రి అరెస్టుతో తమిళనాడు రాజకీయాల్లో హీట్ పెరిగింది. డీఎంకే, కాంగ్రెస్, వాటి మిత్రపక్షాలు కేంద్రంలోని మోడీ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశాయి.

సెంథిల్ బాలాజీ తన సహాయకులు సిఫారసు చేసిన అభ్యర్థులను నియమించేందుకు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ అధికారులతో కలిసి కుట్ర పన్నారనే ఆరోపణలపై కేసు నమోదైంది. ఉద్యోగాల కోసం కోట్లాది రూపాయలు లంచం తీసుకున్నారని ఈడీ ఆరోపించింది. సెంథిల్ బాలాజీ రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2014 నుంచి 2015 మధ్య కాలంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఆ సమయంలో ఆయన ఏఐఏడీఎంకే నాయకుడిగా ఉన్నారు. ఆ తర్వాత 2018లో ఆయన డీఎంకేలో చేరారు.

ఈనెల 13న ఈడీ రాష్ట్ర సెక్రెటేరియట్‌లోని సెంథిల్‌బాలాజీ ఛాంబర్‌లు, చెన్నైలోని ఆయన బంగ్లా, కరూర్, కోయంబత్తూర్ నగరాల్లో అతనికి సంబంధించిన ఇతర ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. అయితే, బుధవారం తెల్లవారుజామున ఈడీ అధికారులు మంత్రిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆ సమయంలో ఆయన ఏడ్చినట్టు వీడియోలో కనబడింది.

మంత్రి అరెస్టు తర్వాత కరూర్ బస్టాండులో అధికారులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అయితే అరెస్టు తర్వాత ఛాతిలో అసౌకర్యంగా ఉన్నదని సెంథిల్‌బాలాజీ ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనను వైద్య పరీక్షల కోసం చెన్నైలోని మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ అడ్మిట్ అయ్యారు. అనంతరం మంత్రికి కరోనరీ యాంజియోగ్రామ్ చేయించామనీ, అందులో ఆయన ట్రిపుల్ వెసెల్ డిసీజ్‌తో బాధపడుతున్నారని తేలిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆయనకు వీలైనంత త్వరగా కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్ సర్జరీ చేయాలని సూచించినట్టు వెల్లడించాయి. కాగా ఆస్పత్రిలో చేరిన సెంథిల్‌బాలాజీని కలవడానికి ఉదయనిధి స్టాలిన్, ఎం సుబ్రమణియన్, ఈవీ వేలు, ఎస్ రేగుపతి సహా పలువురు తమిళనాడు మంత్రులు వెళ్లినా వారిని అనుమతించలేదని సమాచారం.

సెంథిల్‌బాలాజీని తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్ పరామర్శించారు. బీజేపీపై ఆయన విమర్శలు గుప్పించారు. రాష్ట్ర సచివాలయంలోని సెంథిల్‌బాలాజీ ఛాంబర్‌లో ఈడీ సోదాలు నిర్వహించటాన్ని ఆయన ...5లో

సీబీఐకి నో ఎంట్రీ

- తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం

వివరాలు 2లో

మణిపూర్‌లో ఆగని హింస

మరో తొమ్మిది మంది మృతి



ఇంఫాల్ : మణిపూర్‌లో జాతుల మధ్య హింసాకాండ కొనసాగుతూనే ఉంది. మంగళవారం రాత్రి జరిగిన హింసాత్మక సంఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని కాంగ్‌కోపీ జిల్లా ఐజిజంగ్ గ్రామంలో కాల్పులు, గృహదహనాలు వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. కుకీల జనాభా అధికంగా ఉన్న ఈ గ్రామంలో రాత్రి 10.30 గంటలకు హింస చెలరేగింది. చనిపోయిన వారందరూ మైతీ తెగ వారే. వీరంతా స్థానిక వాలంటీర్లని పోలీసులు తెలిపారు. కాంగ్‌కోపీ, తూర్పు ఇంఫాల్ జిల్లాల సరిహద్దులో ఈ గ్రామం ఉంది. గత వారం రోజులుగా ఈ ప్రాంతంలో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. అక్కడ తమ వారు నివసిస్తున్న ప్రదేశాలను కాపాడుకునేందుకు సమీప ప్రాంతాలకు చెందిన మైతీలు అక్కడికి చేరుకున్నారు. దీంతో రెండు తెగల మధ్య ఘర్షణలు జరిగాయి. గాయపడిన పది మందిని ఆస్పత్రిలో చేర్పగా వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం కుకీ తెగకు చెందిన వారు మంగళవారం రాత్రి ...5లో

హస్తం వైపు రాజగోపాల్‌రెడ్డి చూపు

ఇప్పటికే క్యాడర్‌కు సంకేతాలు..బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అన్న భావన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ విసిరిన వలలో చిక్కుకున్న మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇప్పుడు పునరాలోచనలో పడ్డారని తెలుస్తున్నది. హస్తం గూటికి చేరేందుకు పావులు కదుపుతున్నట్టు, ఢిల్లీ నుంచి దిగ్విజయ్ సింగ్ రంగంలోకి దిగి ఆయనతో చర్చలు జరిపినట్టు, తిరిగి పార్టీలో చేరేందుకు రాజగోపాల్‌రెడ్డి సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. దానికి తగ్గట్టుగానే తన క్యాడర్‌కు రాజగోపాల్‌రెడ్డి సంకేతాలు పంపుతున్నారు. తన వెంటే నడిచి వచ్చేలా సన్నద్ధం చేస్తున్నారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు జిల్లాలో రాజగోపాల్‌రెడ్డి భువనగిరి పార్లమెంటరీ స్థానం పరిధిలో రాజకీయ చక్రం తిప్పేవారు. అందుకు తగ్గట్టుగానే ఆయా నియోజకవర్గాల్లో తనకంటూ సొంత క్యాడర్‌ను తయారుచేసుకున్నారు.

బీజేపీ ఆడిన నాటకం

కాంట్రాక్టులు, పెండింగ్ బిల్లులను అడ్డంపెట్టుకుని బీజేపీ ఆడిన నాటకం... ఇదే క్రమంలో రేవంత్‌రెడ్డి పార్టీ అధ్యక్షుడు కావడాన్ని జీర్ణించుకోలేకపోయిన ఆయన చివరకు కాంగ్రెస్‌ను వీడారు. ఆ సందర్భంలో సోదరులైన రాజగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి మధ్య అంతర్గతంగా చిన్నపాటి యుద్ధమే సాగిందనే ప్రచారముంది. అన్న చెప్పినా ఆయన వినలేదు. హస్తం గుర్తుపై గెలిచిన ఆయన ఆ తర్వాత ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.





సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రాజగోపాల్‌రెడ్డి ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ఓడిపోయారు. ఉప ఎన్నికల్లో బొక్కబోర్లా పడ్డ తర్వాత, ఇప్పుడు బీజేపీలో నేతలు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారు ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటుండటంతో ఆ పోరు భరించలేనన్న నిర్ణయానికి వచ్చి రాజగోపాల్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. 'మీకు ఫోన్ ఎప్పుడైనా రావచ్చు. నాతో కలిసి వచ్చేందుకు సిద్ధంగా ఉండండి. మీతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుందాం. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే. రెండు పార్టీల నేతలు పైకి విమర్శలు చేసుకున్నా...లోపల అంతా కలిసే ఉంటున్నారు. అందుకే లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టు కాలేదు. దీనికి బీజేపీ సహకారం పూర్తిగా ఉంది' అంటూ తన అనుయాయులతో ...5లో

ముంచుకొస్తోంది..

- సౌరాష్ట్ర, కచ్ జిల్లాలకు రెడ్ అలెర్ట్
- బిపోర్‌జాయ్ తుపానుతో 8 రాష్ట్రాల్లో వర్షాలు

న్యూఢిల్లీ : బిపోర్‌జాయ్ తుపాను అంతకంతకూ తీవ్రమవుతూ గుజరాత్‌పై విరుచుకుపడుతోందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బుధవారం తెలిపింది. గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. జునాగఢ్, ద్వారక తీర ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు అధికారులు తెలిపారు. ద్వారకా జిల్లాలో సుమారు 400కు పైగా రక్షణ శిబిరాలను ఏర్పాటుచేశామని అన్నారు. భుజ్‌లోని జఖౌ ఓడరేవులో పెద్ద సంఖ్యలో పడవలు చేరుకున్నాయి. రాజ్‌కోట్‌లోని రిలే టవర్‌ను కూల్చివేసినట్టు అధికారులు తెలిపారు. తుఫాను ధాటికి కూలిపోయే ప్రమాదం ఉన్నందున టవర్‌ను తొలగించామనీ, త్వరలో కొత్త టవర్‌ను నిర్మిస్తామని ఆకాశవాణి రాజ్‌కోట్ డైరెక్టర్ రమేష్ చంద్ర వివరించారు. ప్రధాని సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందని, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సహాయక బృందాలను మోహరించామని కేంద్రమంత్రి ...5లో

ధరణి జీవన్మరణ సమస్య

దివాళా తీసిన కంపెనీకి ధరణి బాధ్యత ఎలా అప్పగిస్తారు?

- విదేశీ కంపెనీ చేతుల్లోకి తెలంగాణ డేటా
- ధరణి లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ జరగాలి
- కేసీఆర్‌ను అసెంబ్లీలో చెట్టుకు ఉరి తీసినా తప్పులేదు : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రజలకు ధరణి పోర్టల్ జీవన్మరణ సమస్యగా మారిందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేస్తామని పునరుద్ఘాటించారు. దివాళా తీసిన కంపెనీకి ధరణి పోర్టల్ బాధ్యతను ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. విదేశీ కంపెనీలకు అప్పగించడం ద్వారా తెలంగాణకు సంబంధించిన సమాచారం విదేశీయుల్లో చేతుల్లోకి పోయిందని చెప్పారు. ధరణి పోర్టల్ లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ జరగాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీలో చెట్టుకు ఉరి తీసినా, గల్ఫ్ దేశాల్లో మాదిరిగా రాళ్లతో కొట్టినా ...5లో



కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నేతలు నోముల, శ్రీహరిరావు

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్

5లో..

లండన్‌లో హైదరాబాద్ యువతి హత్య

మరో యువతికి తీవ్రగాయాలు



(ఫైల్)

నవతెలంగాణ-తుర్కయాంజల్

లండన్‌లో హైదరాబాద్‌కు చెందిన యువతి దారుణ హత్యకు గురైంది. బ్రెజిల్‌కు చెందిన యువకుడు ఆమెపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ సంఘటన యువతి కుటుంబసభ్యులకు తీవ్ర మనోవేదనను మిగిల్చింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపాల్టీ బ్రహ్మణపల్లికి చెందిన కొంతం శ్రీనివాస్ రెడ్డి, రమాదేవి దంపతులకు కూతురు తేజస్విని (23), కుమారుడు పవన్ కుమార్ రెడ్డి ఉన్నారు. శ్రీనివాస్‌రెడ్డి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ పిల్లలను చదివిస్తున్నాడు. కుమారుడు ఆస్ట్రేలియాలో ప్రయివేటు ఉద్యోగం చేస్తుండగా కూతురు తేజస్విని రెడ్డి ఎంఎస్ చేయడానికి రెండున్నర సంవత్సరాల క్రితం లండన్ వెళ్లింది. లండన్‌లోని గ్రీన్ విచ్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేసింది. ఇటీవలే స్వదేశానికి తిరిగి రావాల్సి ఉండగా కొన్ని కారణాల దృష్ట్యా ఆమె రాలేకపోయింది. అయితే ...5లో

సంపాదకీయం

అవి తాయిలాలు కాకూడదు...

మనం చేస్తున్న పని మంచిదా..? చెడ్డదా..? అన్నప్పుడు 'దాని వల్ల అత్యధిక మందికి మేలు, లాభం జరిగితే అది మంచిదని భావించొచ్చు...' అని మన పెద్దలు చెబుతుంటారు. ఇది వ్యక్తుల దగ్గర్నుంచి వ్యవస్థల వరకూ.. పంచాయతీ దగ్గర్నుంచి పార్లమెంటు వరకూ అందరికీ వర్తించే

తెలంగాణలోని దళిత, బడుగు, బలహీనవర్గాల వారు, మైనారిటీలు దశాబ్దాల తరబడి... 'కూడుకేడ్చారు.. గూడుకేడ్చారు..ఒంటినిండా కప్పుకోను బట్టకేడ్చారు...' ఈ క్రమంలో స్వయం పాలన, సర్వతోముఖాభివృద్ధి కోసమంటూ కొట్లాడి తెలంగాణను తెచ్చుకున్నాం. మళ్లీ ఇప్పుడు గతంలో మాదిరిగా కూడు కోసం, గూడు కోసం, ఆర్థిక సాయాలు, ఆసరాల కోసం ఏడ్చే పరిస్థితి రాకూడదు. అది రాకుండా ఉండాలంటే పాలకులు, పార్టీలు గుప్పించే హామీలు 'ఎన్నికల తాయిలాలు' కాకూడదు. అవన్నీ అమలు కావాలని ఆశిద్దాం.

సూత్రం. మనం ఇప్పుడు ప్రజాస్వామ్య భారతంలో ఉన్నాం కాబట్టి... పాలకులు ఈ విషయాన్ని మరింతగా గుర్తు పెట్టుకోవాలి. భారతావనికి స్వాతంత్య్రం సిద్ధించి 76 ఏండ్లు పూర్తవుతున్న క్రమంలో... తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్న ప్రస్తుత తరుణంలో ఇది మరింత సందర్భోచితం.

రానున్న ఐదారు నెలల కాలం తెలంగాణకు, ఇక్కడి ప్రజలకు అత్యంత కీలక సమయం. ఎందుకంటే రాష్ట్ర శాసనసభకు డిసెంబరు నాటికి ఎన్నికలు జరుగుతాయి కాబట్టి. ఈ క్రమంలో ఈ ఐదారు నెల్ల కాలం ఇటు అధికార పార్టీకి, అటు ప్రతిపక్ష పార్టీలకు కూడా అంతే కీలకం. అందుకే బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీలు పోటా పోటీగా జనంపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తామంటూ హంగామా సృష్టిస్తున్నాయి. ఈ వాగ్దానాల వానను కురిపించటంలో అధికారంలో ఉన్న గులాబీ పార్టీ సహజంగానే ముందు వరుసలో ఉంది. వికలాంగులకు పింఛన్ పెంపు, బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం వంటివి ఈ కోవలోనివే. వీటిలో



బీసీలకు ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ఈ అప్లికేషన్ సమర్పించేందుకు అవసరమైన ఆదాయ ధృవీకరణ పత్రం కోసం జనాలు తహశీల్దార్ కార్యాలయాల ముందు క్యూ కడుతున్నారు. మీ సేవా సెంటర్లు దరఖాస్తుదారులతో కిక్కిరిసి పోతున్నాయి. దాంతో వాటి పంట పండుతోంది.

ఇంత వరకూ పరిస్థితి బాగానే ఉంది. కానీ ఇక్కడే ఒక లాజిక్కు దాగుంది. దరఖాస్తులు సమర్పించిన బీసీలందరికీ ఆర్థిక సాయం వస్తుందా..? అనేది పెద్ద శేష ప్రశ్న. ఇప్పటి బీఆర్‌ఎస్‌తో పాటు గతంలో రాష్ట్రాన్ని పాలించిన పలు పార్టీలు ఎన్నికలప్పుడు ప్రకటించిన అనేక పథకాలు, కార్యక్రమాలు లబ్దిదారులందరి దరి చేరకపోవటమే దీనికి కారణం. ఎప్పటిదాకో ఎందుకు..తెలంగాణ ఆవిర్భవించిన నాటి నుంచి నేటి దాకా పదేండ్ల కాలాన్ని పరిశీలించినా ఈ సత్యం బోధపడుతుంది. 2014 జూన్‌లో రాష్ట్ర శాసనసభ ఎన్నికల సమయంలో... దళితులకు మూడెకరాల భూ పంపిణీ, కేజీ టూ పీజీ ఉచిత విద్య, డబుల్ బెడ్ రూం ఇండ్లు తదితర ప్రతిష్టాత్మక పథకాలను ఆనాటి టీఆర్‌ఎస్ (నేటి బీఆర్‌ఎస్) ప్రకటించింది. ప్రస్తుతం ఆయా హామీల పరిస్థితేంటో మనందరికీ తెలిసిందే. 2014లో ఇచ్చిన 'దళితులకు మూడెకరాల' హామీ గురించి... 2018 ముందస్తు ఎన్నికల సందర్భంగా ఏలికలను అడిగితే... 'వాగ్దానాలన్నీ ఐదేండ్లలోనే అమలు కావు... మూడెకరాల పంపిణీ అనేది ఒక నిరంతర ప్రక్రియ, అందువల్ల అది కొనసాగుతూనే ఉంటుంది...' అనే సమాధానం విని విస్తుపోవాల్సి వచ్చింది. ఇక 2018లో ఇచ్చిన నిరుద్యోగ భృతికి ఇప్పటి వరకూ అతీగతీ లేదు. దీని గురించి నాలుగేండ్ల క్రితమే అడిగితే... 'రాష్ట్రంలో ఎంతమంది నిరుద్యోగులున్నారో వివరాలు తీస్తున్నాం... విధి విధానాలు రూపొందిస్తాం...' అని చెప్పారు తప్పితే అటు మంత్రుల నుంచి గానీ, ఇటు అధికారుల నుంచి గానీ స్పష్టమైన సమాధానం రాకపోవటం గమనార్హం. హుజూరాబాద్ ఉప ఎన్నిక సందర్భంలో కూడా సర్కారు వారు ఆర్భాటంగా దళిత బంధును ప్రకటించారు. ఆ పథకం కింద ఇప్పటి వరకూ ఒక్కో ఊరిలో ఎంత మందికి లబ్ది చేకూరిందనేది లెక్కలు తీస్తే... అసలు విషయం ఇట్టే బోధపడుతుంది. బర్రెలు, గొర్రెల పంపిణీ సంగతి సరేసరి.

ఈ రకంగా 'ఏ పథకాన్ని, ఏ కార్యక్రమాన్ని చూసినా... ఏమున్నది గర్వకారణం... అవన్నీ ఎన్నికల మాయాజాలం...' అన్నట్టుగా పరిస్థితి తయారైంది. తెలంగాణలోని దళిత, బడుగు, బలహీనవర్గాల వారు, మైనారిటీలు దశాబ్దాల తరబడి... 'కూడుకేడ్చారు.. గూడుకేడ్చారు... ఒంటినిండా కప్పుకోను బట్టకేడ్చారు...' ఈ క్రమంలో స్వయం పాలన, సర్వతోముఖాభివృద్ధి కోసమంటూ కొట్లాడి తెలంగాణను తెచ్చుకున్నాం. మళ్లీ ఇప్పుడు గతంలో మాదిరిగా కూడు కోసం, గూడు కోసం, ఆర్థిక సాయాలు, ఆసరాల కోసం ఏడ్చే పరిస్థితి రాకూడదు. అది రాకుండా ఉండాలంటే పాలకులు, పార్టీలు గుప్పించే హామీలు 'ఎన్నికల తాయిలాలు' కాకూడదు. అవన్నీ అమలు కావాలని ఆశిద్దాం.

ప్రభుత్వ విద్య ప్రజల ఆకాంక్షలవైపు అడుగేసేనా?



పి. మాణిక్ రెడ్డి

మానవమేధస్సు అమోఘమైనది. ఆ మేధస్సు పరిణితి, ఆలోచనల ఘర్షణల మూలమే మనం చూస్తున్న అనేక ఆవిష్కరణలు. ఆ విధమైన నూతన ఆవిష్కరణలకు, శాస్త్ర సాంకేతిక పురోగమనాకి విద్య చుక్కానిలాంటిది. ఒక దేశం అభివృద్ధి, పౌరుల క్రియాశీల ఆలోచనా ప్రవంతిని ఆదేశ విద్యావిధానం నిర్దేశిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈనాడు అనేక దేశాల అభివృద్ధి లేదా వెనుకబాటుతనాన్ని పరిశీలించినప్పుడు ఈ వ్యత్యాసం మనకు స్పష్టంగా గోచరిస్తున్నది. అలాంటి విద్య అందరికీ అందుబాటులో ఉండాలి. అందరికీ సమానమైనదిగా నాణ్యమై నదిగా ఉండాలి. స్వాతంత్య్రం సాధించి 75ఏండ్లు గడిచినా అక్షరాస్యతలో ఇంకా 75శాతానికి చేరువలోనే ఉన్నాం. మహిళా అక్షరాస్యత 65శాతం వద్దే ఉన్నది. దళిత, ఆదివాసి వెనుకబడిన వర్గాల్లో, కొన్ని ప్రాంతాల్లో 50శాతం వద్దే ఆగిపోయింది. ఇదంతా అందరికీ విద్యనందించటంలో పాలకవర్గం నిర్లక్ష్యం ఉదాసీనతయే కారణం. విద్యార్థుల ప్రమాణాలకు సంబంధించి తరచుగా మనకు వినపడే నాణ్యతా విషయాన్ని పరిశీలిస్తే మనం తరచూ "అంద రికీ సమాన విద్య" అంటున్న మాటల్లో సమానమైన, నాణ్యమైన ఆనేది సమపాళ్ళలో విద్య అందుతుందా? అనేది సంశయమే. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు దశాబ్ది ఉత్సవాలు ప్రారంభించుకున్న తరుణంలో రాష్ట్రంలోని విద్యారంగ

రాష్ట్ర వ్యాప్తంగా 5వేల ప్రొఫెసర్లు ఇతర సిబ్బంది ఖాళీలున్నాయంటే ఉన్నత విద్యలో ఉన్నతాన్నేమని అర్థం చేసుకోగలం. నియామకాల నోటిఫికేషన్‌లకు ఆటంకాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. ఆ ఆటంకాల వెనుకున్న సూత్రధారుల ఆటలు కట్టించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి. దానికేమాత్రం వెరవరాదు. విద్యారంగంతోపాటు ప్రభుత్వం నిర్మాణాత్మక విమర్శగా స్వీకరించి పరిష్కార కార్యాచరణను ప్రకటించాలి. అందుకోసం మరో ఉద్యమానికి సైతం పూనుకోవాలి. కావలసిందల్లా విద్యా రంగంపట్ల, పేదప్రజల చదువులపట్ల చిత్తశుద్ధి.

స్థితిగతులను పరిశీలిస్తే అనేక విషయాలు వెల్లడయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాల విషయాన్ని చూసినప్పుడు అనేక కారణాలు మనకు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. విద్యార్థి సమగ్ర మూర్తిమత్వ ఎదుగుదలకు తోడ్పడే విద్యనందించాల్సిన ప్రభుత్వ పాఠశాలవిద్య అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది. 'ఐఏఎస్ కొడుకైనా, అటెండర్ కొడుకైనా' ఒకే విధమైన పాఠశాలలో చదువుకునే విధంగా 'కేజీ టు పీజీ' విద్యనందిస్తామన్న వాగ్దానాలను, దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీసు సమస్యల పరిష్కారంపై 'అర పేజీలో రాసు కుందాం' అంటూ ఇచ్చిన హామీల నినాదాలను విద్యా భిమానులేమీ మరువలేదు.

ఉపాధ్యాయుల ఖాళీలు

రాష్ట్రంలోనున్న ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్ ఆధ్వర్యంలోని 26,074 పాఠశాలల్లో దాదాపు 20వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఏడేండ్లుగా పదోన్నతులు లేనందున 11వేల పోస్టులు భర్తీకి నోచుకోక ఖాళీగా ఉంటున్నాయి. ఇందులో 2వేలదాకా ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు. ఇంత పెద్ద మొత్తంలో సబ్జెక్టు టీచర్లు, ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండటం పాఠశాలల అడ్మినిస్ట్రేషన్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం ఉండడం సహజమే కదా! అర్ధ పుష్కరకాలం పైగా పండిట్, పిఇటి అప్‌గ్రేడేషన్ సమస్య సాగదీయడం విద్యాశాఖకు ఓమచ్చగా మిగిలిపోతున్నది. పరిష్కారమార్గాన్ని పరిశీలించే బదులు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులే కోర్టుకు వెళ్ళారంటూ క్లిష్టమైన సమస్యగా చిత్రీకరించి చెప్పుకోవడమే సులభమైన మార్గంగా ఎంచు కోవడమనేది విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లిప్తధోరణి కాక ఏమనుకోవాలి? రాష్ట్రంలోని 33జిల్లాలకుగాను కేవలం 7జిల్లాల్లోనే పూర్తిస్థాయి డీఈఓలు ఉన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడేనాటికున్న 12డీఈఓ పోస్టులకు గాను ఐదుఖాళీగా ఉండగా నూతన జిల్లాలకు మంజూరీ చేయాల్సిన పోస్టులు ఇంతవరకు లేవు. జిల్లాల్లో ఇంఛార్జిలు లేదా పూర్తి అదనపు బాధ్యతలుగా విధులు నిర్వహించే డీఈఓలు ఉన్నారు. కీలకమైన జిల్లా విద్యాశాఖాధికారి పోస్టులు ఖాళీగా ఉండడం మూలంగా పాఠశాలల గైడెన్స్, పర్యవేక్షణకు సంబంధించిన సమగ్రతలో లోటు ఏర్పడుతున్నది. ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టులు, సర్వీసు సమస్యల పరిష్కారానికి సంబంధించిన పరిస్థితులు ఉపాధ్యాయులను అసంతృప్తికి గురి చేస్తున్నాయి. మారిన పరిస్థితుల కనుగుణంగా ఉప విద్యాశాఖాధికారుల అదనపు పోస్టులు మంజూరు చేయాల్సి ఉన్నది. మండల స్థాయిలోనైతే మండల విద్యాధికారులు లేనందువలన పర్యవేక్షణా భారంతో ఒక్కొక్క ఇంఛార్జి యంఈఓ అరడజను మండలాల బాధ్యతలతో నెట్టుకొస్తున్న పరిస్థితి. ఇది ఉపాధ్యాయులపై కూడ అదనపు పనిభారానికి కారణమవుతున్నది. మొత్తం 612మండలాలకుగాను కేవలం 17మండలాలలోనే పూర్తికాలపు యంఈఓలు ఉండటం, పదిహేనేండ్లుగా యంఈఓ పోస్టులు భర్తీకాకపోవడం మూలంగా పాఠశాల విద్యలో కలిగిన ప్రతినష్టాన్ని, లోపాల్ని అసర్-2022 నివేదిక తేటతెల్లం చేసింది.

విద్యార్థుల ఎన్‌రోల్‌మెంటు

కరోనా తదనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంటు గణనీయంగా పెరిగింది. పెరిగిన విద్యార్థుల సంఖ్యకనుగుణంగా బోధనా సిబ్బందిని, బోధనా సౌకర్యాలకు సంబంధించి సానుకూల సత్వర చర్యలు తీసుకున్నట్లైతే ఎన్‌రోల్‌మెంట్‌ను నిలుపుకోగలిగే అవకాశం ఉందేది. కానీ పెంచాల్సిన ప్రభుత్వం ఆవైపు దృష్టి కేంద్రీకరించకపోగా కరోనాకు ముందు ఖాళీపోస్టులు సబ్జెక్టు టీచర్ల స్థానంలో, పనిచేస్తున్న 20వేల విద్యావాలంటీర్లను పునర్నియామకం చేయలేదు. కరోనా సమయంలో పెరిగి మళ్ళీ తగ్గిన నమోదును పరిశీలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరగడంపట్ల ప్రభుత్వానికి శ్రద్ధ చూపడంలేదేమోననే సందేహం కలగడం సహజం. తగినంతమంది టీచర్లు లేకపోవడం, మౌలిక వసతుల లేమి లాంటి కారణాలు ఎన్‌రోల్‌మెంటు తగ్గడానికి కారణమవుతున్నాయి. ఎన్‌రోల్‌మెంటు సమస్య విద్యా ప్రమాణాల సంక్షోభానికి కారణమవుతున్నది. గత విద్యాసంవత్సరం ఎన్‌రోల్ మెంటును గమనిస్తే మొత్తం 18235 ప్రాథమిక పాఠశాలలో 1290 ప్రాథమిక పాఠశాలల్లో సున్నా ఎన్‌రోల్‌మెంటు నమోదైంది. 10మంది వరకు విద్యార్థులున్న పాఠశాలలు 1415 ఉండగా 20వరకు విద్యార్థులున్న పాఠశాలలు 4031 ఉన్నాయి. 100మందికి పైబడి విద్యార్థులున్న పాఠశాలలు 2,500 ఉన్నాయి. తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఇద్దరు, ముగ్గురు టీచర్లు సరిపోతారనుకున్నా బోధన మాత్రం ఐదు తరగతులకు, అన్ని సబ్జెక్టులకు జరగాల్సిందే కదా! మొత్తం ప్రాథమిక పాఠశాలల్లో 1686ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే తరగతికొక్క ఉపాధ్యాయుని చొప్పున ఐదుగురు ఉన్నారు. ఇక ఉన్నత పాఠశాలల విషయానికొస్తే 100 అంతకు తక్కువ విద్యార్థులున్న పాఠశాలలు 1500 దాకా ఉన్నాయి. 800 ఉన్నత పాఠశాలల్లో 300కు మించి విద్యార్థులున్నారు. ఇందులో వేయికిపైగా విద్యార్థులున్న పాఠశాలలున్నాయి. వీటిలో ఫిజికల్ డైరెక్టర్, ఆర్ట్స్, డ్రాయింగ్, క్రాఫ్ట్ పోస్టులు మచ్చుకు కూడా కానరావు. ఈ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించాలంటే సరిపడా సబ్జెక్టు టీచర్లు, వసతులు ఉండాలి. అప్పుడే ఈ విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుంది. నాలుగున్నర వేలకుపైగా ఉన్న మొత్తం ఉన్నత పాఠశాలల్లో రెండున్నర వేల పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులు పదోన్నతులులేని కారణంగా ఖాళీగా ఉన్నాయి. మరో 300కుపైగా పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయాల్సి ఉన్నది. ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో నియామకాల ప్రక్రియ లేనందువలన మూతపడుతున్నవి.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలల మౌలిక స్థితిగతులను సంపూర్ణంగా మార్చి అభివృద్ధి చేసే ఉద్దేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రకటించిన మన



ఊరు-మనబడి, మన బస్తీ-మన బడి కార్యక్రమం స్వాగతించదగిందే. నిర్ణీతకాల వ్యవధిలో పాఠశాలలకు సంబంధించి ఈ పనులన్నీ పూర్తయ్యేవిధంగా ప్రభుత్వం చర్యతీసుకోవడం అత్యంత ఆవశ్యం. ప్రభుత్వం చిత్త శుద్ధితో ఇవన్నీ అమలు చేసినప్పుడు ఉపాధ్యాయులు, సంఘాలు తప్పని సరిగా సానుకూల దృక్పథంతోనే వాటిని వినియోగించుకుంటారు. ఎటొచ్చీ ఇది ప్రచార కార్యక్రమంగా ఉండకూడదనేదే ఉపాధ్యాయుల ఆలోచన. అలాగే ముఖ్యమైన అంశం ఏంటంటే బోధనలో ఉపాధ్యాయునితోపాటు పాఠ్యపుస్తకాలు కీలకం. ఇవి సకాలంలో విద్యార్థికి అందాలి. గత విద్యాసంవత్సరం రెండు నెలల ఆలస్యం మూలంగా రకరకాల కార్యక్రమాలు సృష్టించి నెట్టుకొచ్చిన పరిస్థితిని చూశాం. ఈ విద్యాసంవత్సరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఉచితంగా

కరోనా తదనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంటు గణనీయంగా పెరిగింది. పెరిగిన విద్యార్థుల సంఖ్యకనుగుణంగా బోధనా సిబ్బందిని, బోధనా సౌకర్యాలకు సంబంధించి సానుకూల సత్వరచర్యలు తీసుకున్నట్లైతే ఎన్‌రోల్‌మెంట్‌ను నిలుపుకోగలిగే అవకాశం ఉందేది. కానీ పెంచాల్సిన ప్రభుత్వం ఆవైపు దృష్టి కేంద్రీకరించకపోగా కరోనాకు ముందు ఖాళీపోస్టులు సబ్జెక్టు టీచర్ల స్థానంలో, పనిచేస్తున్న 20వేల విద్యావాలంటీర్లను పునర్నియామకం చేయలేదు. కరోనా సమయంలో పెరిగి మళ్ళీ తగ్గిన నమోదును పరిశీలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరగడంపట్ల ప్రభుత్వానికి శ్రద్ధ చూపడంలేదేమోననే సందేహం కలగడం సహజం.

అందజేస్తామన్న ప్రభుత్వం నిర్ణయం అభినందనీయం. వీటితోపాటు ఏకరూప దుస్తులు సకాలంలో విద్యార్థులకు అందేవిధంగా తగు ఏర్పాట్లు చేయాలి. విద్యార్థులకు పౌష్టికరమైన ఆహారం చాలా ప్రధానం మధ్యాహ్న భోజనం మరింత పౌష్టికరమైన ఆహారంగా ఉండేందుకు అవసరమైన నిధులను పెంచాలి. దీంతో ప్రభుత్వ పాఠశాల లన్నింటిలో అల్పాహారం అందించాలి. పేద విద్యార్థు లందరూ బడికి వచ్చేవిధంగా ఈ చర్యలు తోడ్పడతాయి. డ్రాప్ అవుట్స్ సమస్య గణనీయంగా తగ్గుతుంది.

ఉన్నతవిద్యపై దృష్టి అవసరం

కేజీ టు పీజీ అమలులో భాగంగా ఏర్పాటు చేశామంటున్న గురుకులాల సంఖ్యను పెంచడంతోపాటు ఆ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి వేతనాలు చెల్లించాలి. విద్యారంగంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, చుట్టం టీచర్ లాంటివి శోభనిచ్చే పదాలు కావు. శాస్త్ర, సాంకేతిక రంగం కొత్తపుంతలు తొక్కుతున్న క్రమంలో, సమాజం లోని సమకాలీన పరిణామాలలో ఉన్నత విద్యారంగానిది కీలకపాత్ర. నూతన ఆవిష్కరణ లకు విశ్వవిద్యాలయాలు నిలయాలుగా మారాలి. సమాజపరిణామ క్రమానికి దిశానిర్దేశం చేసే ఆలోచనా ప్రవంతికి పుట్టి నిల్లుగా ఉండాలి. అందుకు నిరంతర అధ్యయన, పరిశోధనల కవసరమైన ఏర్పాట్లు అధ్యాపకులు విశ్వ విద్యాలయాల కవసరం. కానీ నేడు దశబ్దాల తరబడి ప్రొఫెసర్లు, లెక్చరర్ల ఖాళీలతో జూనియర్, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు వెలవెల పోతున్నాయి. కాంట్రాక్టు లెక్చరర్లతో కాలం గడుస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 5వేల ప్రొఫెసర్లు ఇతర సిబ్బంది ఖాళీలున్నాయంటే ఉన్నత విద్యలో ఉన్నతాన్నేమని అర్థం చేసుకోగలం. నియామకాల నోటిఫికేషన్‌లకు ఆటంకాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. ఆ ఆటంకాల వెనుకున్న సూత్రధారుల ఆటలు కట్టించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలి. దానికేమాత్రం వెరవరాదు. విద్యారంగంతోపాటు ప్రభుత్వం నిర్మాణాత్మక విమర్శగా స్వీకరించి పరిష్కార కార్యాచరణను ప్రకటించాలి. అందుకోసం మరో ఉద్యమానికి సైతం పూనుకోవాలి. కావలసిందల్లా విద్యా రంగంపట్ల, పేద ప్రజల చదువులపట్ల చిత్తశుద్ధి. తద్వారా విద్యా భిమానులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, యువ కులందరూ ఒక్కే లక్ష్యంతో భవిష్యత్తుకు బాటలు వేసే విద్యారంగాన్ని కాపాడుకోవడం కష్టమైన పనేమి కాదు. ఇదే దశాబ్ది ఉత్సవాల లక్ష్యం కావాలి.

సెల్:9440064276



'చే' అంటే... ప్రశ్నించడమే...

ప్రపంచ మానవాళి విముక్తి కోసం... భౌగోళిక సరిహద్దులతో సంబంధంలేకుండా... అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా... ఆఖరి క్షణం వరకూ పోరాడిన ధీరుడు, కోట్లాది మంది యువత గుండెల్లో నిలిచిన గెరిల్లా యోధుడు చే గువేరా. చే... అంటేనే ఒక గెరిల్లా విప్లవకారుడు, మనస్సున్న డాక్టర్, మహాకవి, గొప్ప రచయిత, ప్రాణం ఇచ్చే స్నేహితుడు, మిలటరీ వ్యూహకర్త, క్యూబా విముక్తి యోధుడు, చదరంగంలో గ్రాండ్ మాస్టర్, అన్నింటికీ మించి అమెరికా సామ్రాజ్యవాదులకు సింహస్వప్నం. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కోణాలు చేగువేరాలో చూడవచ్చు. ఆయన జీవితం నేటి యువతరానికి ఆదర్శం.

చేగువేరా అర్జెంటీనాలోని రోసారియోలో 1928 జూన్ 14న ఎర్నెస్టో గువేరా లించ్, సెలియా దంపతులకు జన్మించాడు. బ్యూనస్ అఫ్ ఎయిర్స్ విశ్వవిద్యాలయంలో వైద్యశాస్త్రంలో పట్టభద్రుడయ్యాడు. 1949లోనే అర్జెంటీనాలో ఒంటరిగా, తర్వాత 1952లో మిత్రుడు ఆల్బర్ట్ గ్రినిడాతో కలిసి లాటిన్ అమెరికా మొత్తాన్ని మోటారు బైక్ యాత్ర ద్వారా చుట్టేశాడు. అప్పుడే అమెరికన్ సామ్రాజ్యవాద కంపెనీలు ప్రజలను ఎలా దోచుకుంటున్నాయో చేగువేరాకు అర్థమైంది. ఈ దోపిడీని అరికట్టాలని, పేద ప్రజలకు అండగా నిలబడాలని మోటారు సైకిల్ యాత్రలోనే ఒక నిర్ణయానికి వచ్చాడు. వైద్యుడిగా కొంతమంది రోగులకు వైద్యం చేసే బదులు సమాజానికి పట్టిన అత్యంత ప్రమాదకరమైన జబ్బును వదిలించాలనుకున్నాడు. ఇదే సమయంలో గ్వాటెమాలా దేశంలో జాకెబ్ అర్బేంజ్ ప్రభుత్వం ప్రజలకు అనుకూల నిర్ణయాలు తీసుకుందని అమెరికన్ సామ్రాజ్యవాదులు సీఐఏ కుట్ర ద్వారా ప్రభుత్వాన్ని కూల్చడాన్ని ప్రత్యక్షంగా చూశారు. అక్కడినుండి మెక్సికో చేరుకున్నారు 1955లో ఒక రాత్రి వేళ క్యూబాలో బాటిస్టా నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విప్లవ సారథి ఫైడెల్ క్యాస్ట్రోతో కలిసి నడవాలని నిర్ణయించుకున్నాడు. ముందు డాక్టర్‌గా సాయుధదళంలో చేరాడు. 1956లో క్యాస్ట్రో రూపొందించిన సాయుధ తిరుగుబాటు పథకాన్ని అమలు చేయడానికి గ్రాన్మా అనే పడవలో చేగువేరాతో సహ 81మందితో గెరిల్లా పోరాటానికి క్యూబాకు బయలుదేరారు. గెరిల్లా పోరాటం సందర్భంగా దళానికి డాక్టర్‌గా బయలుదేరిన చేగువేరా పరిస్థితిని బట్టి ఫైటర్ అయ్యాడు. శత్రువుల వ్యూహాలను పసిగట్టి ఎత్తులకు పైఎత్తులు వేసి శత్రువు సైన్యాన్ని చిత్తుచేశాడు. అనతికాలంలోనే కమాండర్ అయ్యాడు. శాంతక్లారాలో తిరుగుబాటుతో బాటిస్టా ప్రభుత్వానికి చావుదెబ్బ తగిలింది. 1959లో క్యూబాలో విప్లవం విజయవంతమైంది. హవానాలో విజయోత్సవ ర్యాలీలో క్యాస్ట్రోతో కలిసి చే పాల్గొన్నాడు. క్యూబా ప్రభుత్వంలో పారిశ్రామిక విభాగం అధ్యక్షుడిగా, క్యూబా బ్యాంకు అధ్యక్షుడిగా, పారిశ్రామిక మంత్రిగా వివిధ బాధ్యతలు నిర్వహించి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. తన లక్ష్యం ఇంతటితో ఆగదని ప్రపంచ దేశాలను విముక్తి చేయాలనే సంకల్పంతో 1965లో క్యూబా వదిలి కాంగో అక్కడ నుంచి టాంజానియా, జెకోస్లోవేకియాలో తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. 1966లో బొలీవియా దేశంలో నాకహుజ్ ప్రాంతాల్లో సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు. కంటి మీద కునుకులేని అమెరికా సామ్రాజ్యవాదులు ఎలాగైనా చేగువేరాను చంపాలని, లేకపోతే తమ ఆటలు సాగవని గ్రహించారు. 1967 అక్టోబర్ 9న లా హిగెయెరా పట్టణంలో ఒక చిన్న గదిలో చేగువేరాను బంధించి చంపారు అమెరికన్ సామ్రాజ్యవాదులు. చేగువేరాను భౌతికంగా లేకుండా చేసి చివరకు ఆయన శవాన్ని కూడా దొరకకుండా చేశారు. కానీ ఈ రోజు కోట్లాది యువత గుండెల్లో, ప్రశ్నించే ప్రతి గొంతులో, అన్యాయాన్ని ఎదిరించే ప్రతి పిడికిలిలో చేగువేరా స్ఫూర్తి కనిపిస్తోంది.

కేవలం 39ఏండ్ల వయసులోనే కార్మిక, కష్టజీవుల రాజ్యం కోసం, ఈ దోపిడీ సమాజాన్ని కూల్చేయడం మినహ మరో మార్గం లేదని నమ్మి దాని కోసం తన ప్రాణాలను సైతం బలిపెట్టాడు. అందుకే చేగువేరా అంటే విప్లవం, చేగువేరా అంటే చైతన్యం, చే గువేరా అంటే ప్రశ్నించడం, చేగువేరా అంటే సమానత్వం, చేగువేరా అంటే నియంతృత్వ పాలనకు చరమగీతం. క్యాస్ట్రో మాటల్లో చెప్పాలంటే చేగువేరా ఒక అసాధారణ సామర్థ్యం గల ఒక సేనాని. యుద్ధక్షేత్రంలో ఏ మాత్రం భయపడకుండా దూసుకెళ్లడం చేగువేరా సహజ లక్షణం. 1964లో చేగువేరా తన కూతురికి లేఖ రాస్తూ ఇలా అంటాడు... ప్రపంచంలో ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా స్పందించగలగాలి. నేడు ఈ మాటే కోట్లాది మంది యువతకు ఆదర్శంగా మారింది. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని, అణచివేతను యువత ప్రశ్నించాలి, తీవ్రంగా నిరశించాలి. చేగువేరా 95వ జయంతి సందర్భంగా ఆయనకు మనమిచ్చే నివాళి ఇదే.

- జి. రామన్న



ఏ దేశ ప్రజలు గొర్రెల్లా ఉంటారో
ఆ జాతిని చూసి జాలిపడు
ఏ గొర్రెల కాపరులు వారిని తప్పుదారి పట్టిస్తారో
ఆ దేశపు బూటకపు నాయకత్వాన్ని చూసి జాలిపడు

ఏ దేశ మేధావులు నోరు విప్పరో
ఏ సద్గుణ సంపన్నులు గాలి కబుర్లతో
గాలితో యుద్ధాలు చేస్తుంటరో
వారినందరినీ చూసి జాలిపడు
అవసరమైనప్పుడైనా గొంతెత్తలేని
జాతి జనుల చూసి జాలిపడు
దాడులు చేసే వారిని పొగడుతూ ఉండడం
హింసిస్తూ, ప్రపంచాన్ని బలవంతంగా
పాలించాలనుకునే ఆంబోతుల్ని - హీరోలనుకుని,
భజనలు చేస్తున్న భక్తుల్ని చూసి జాలిపడు -
తమ భాష తమదే తప్ప,
మరో భాష అర్థం చేసుకోలేని
అవివేకులను చూసి జాలిపడు

తమ సంస్కృతీ సంప్రదాయాలు తమవే తప్ప,
ఇంకా వేరేవి కూడా ఉంటాయని
తెలుసుకోలేని మూర్ఖుల్ని చూసి జాలిపడు
డబ్బే ఊపిరిగా బతికే వారిని చూసి జాలిపడు
బాగా మెక్కి నిద్రిస్తున్న వారిని ఇంకా నిద్రబుచ్చుతున్న
కాపాలాదారుల కపటత్వాన్ని చూసి జాలిపడు
హక్కుల్నీ, బాధ్యతల్ని గాలికొదిలేసే దేశప్రజల్నీ..
వారి దేశాన్నీ... చూసి జాలిపడు!

తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కొట్టుకుపోతున్నా,
మిన్నకుండే వానపాము
ఒమనస్తత్వాన్ని చూసి జాలిపడు.
స్వేచ్ఛాలోచనతో తలెత్తుకు సగర్వంగా బతికిన
ఓ నా ప్రియమైన దేశమా? నువ్విప్పుడు నిరంతరం
కన్నీళ్ళెందుకు కారుస్తున్నావ్?

ఖలీల్ జీబ్రాన్ భావానికి కవితా రూపం ఇచ్చింది:
అమెరికన్ కవి లారెన్స్ ఫెర్లిగెట్టి
తెలుగు అనువాదం : డాక్టర్ దేవరాజు మహారాజు

దేశానికి కామ్రేడ్స్ కావాలి...



ఎండీ. షకీలాబేగమ్

"నీ హక్కు కోసం నువ్వు పోరాడాలి. దాన్ని నువ్వు ధైర్యంగా అడగాలి. దానికోసం ఏ కష్టాన్నైనా ఎదిరించాలి. దాన్ని సాధించడం కోసం నువ్వు చేసే ప్రయాణంలో నీకు తోడొచ్చే వాడే కామ్రేడ్!" అంటూ 'డియర్ కామ్రేడ్' సినిమాలో హీరో తాతయ్య వివరిస్తారు. ఈ సినిమాలో హీరోయిన్ ఒక క్రికెట్ క్రీడాకారిణి. క్రికెట్ బోర్డుకు చెందిన అధికారి తనను లైంగికంగా వేధిస్తున్నప్పుడు ప్రతిఘటించిన ఆమెను, ఆమె స్నేహితురాలిని అకాడమీ నుండి బయటకు వెళ్లేలా చేస్తాడు. తనకు ఎంతో ఇష్టమైన క్రికెట్‌కు దూరమై, ఇంత చేసిన అతన్ని ఏమీ అనలేక, బయటకు తెలిస్తే తమ పరువు పోతుందనుకునే తల్లిదండ్రుల నీడన ఉన్న ఆమె డిప్రెషన్‌లోకి వెళు తుంది. తనని అవమానించిన, మానసికంగా హింసించిన, తన భవిష్యత్తునే కాలదన్న చూసిన వాడి నిజస్వరూపం బయటపెట్టిన తర్వాతే ఆమె డిప్రెషన్ నుంచి నిజంగా బయటకొస్తుంది. దీనికి తన వెంట ఉండి నిలబడినవాడే సినిమాలో హీరో కామ్రేడ్.

ఇలాంటి పోలిక ఉన్న కథే నేడు దేశ రాజధానిలో నిజ జీవితంలో జరుగుతున్నది. దేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని, అవార్డులను తెచ్చిన మహిళా రెజ్లర్లను... 'భారత కుస్తీ సమాఖ్య' (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు వారు ఆరోపణ చేశారు. వేధింపులు చేసిన వారిపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం, దానికోసం నెలల తరబడి రోడ్లపై నిరసన తెలపాల్సి రావటం, స్వయంగా ప్రధానితో చెప్పినా పట్టించుకోకపోవడం, బాధితులను బెదిరింపులకు గురిచేయడం, సుప్రీంకోర్టు అక్షింతలు వేసిన తర్వాత గానీ నామమాత్రంగా కేసు నమోదు చేయడం, దీనిపై వేసిన కమిటీ పారదర్శకతలేని విచారణ జరిపి నిందితునికి క్లీన్‌చిట్ ఇచ్చేయడం అన్నది మహిళల ప్రాథమిక హక్కులను కాలరాయడం కన్నా మించినదని ఇట్టే అర్థమైపోతుంది. అధికారంలో ఉన్న మహిళా రాజకీయ ప్రతినిధులు కళ్లకు గంతలు కట్టుకున్నట్లు నటించడం, కనీసం స్పందించకుండా పరుగులు తీయడం (కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి), క్రీడారంగంలోనే ఉన్న మహిళలు సైతం నిరసన తెలుపుతున్న వారిని తప్పుపట్టడం, ఇంకా తుప్పుపట్టి ఉన్న వ్యవస్థను ప్రతిబింబింపజేస్తుంది.

నిర్భయ ఘోరం జరిగినప్పుడు ఆ సమయంలో ఆమె ఎందుకు బయటకు వెళ్లాలి అనీ, బన్వారీ దేవి (రాజస్థాన్) కేసులో ఎవరికో బాల్య వివాహం చేస్తుంటే ఆమెకేంటని, రెజ్లర్ల విషయంలో అసలు ఆడపిల్లలకు ఇలాంటి ఆటలు ఎందుకని మాట్లాడే వ్యవస్థను పాలకులు ఇంకా ఇంకా కొనసాగించాలనే ఈ రోజు పాలక పార్టీకి



చెందిన ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తప్పు చేశాడని తెలిసి కూడా వెనకేసుకొస్తోంది. బన్వారీ దేవి కేసులో మొట్ట మొదటిసారిగా... పని ప్రదేశంలో మహిళల భద్రత అనేది వారి ప్రాథమిక హక్కు అని పేర్కొంటూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఇచ్చింది. ఆర్టికల్ 14, 15, 19, 21 ప్రకారం లైంగికంగా వేధించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అవుతుంది. కానీ రాజ్యాంగ హక్కు కాదు కదా! కనీసం నైతిక విలువలు కానీ మానవీయ కోణం కూడా లేని దృశ్యాలు దేశంలో చోటు చేసుకుంటున్నాయి. కొందరు బలైన తర్వాతే చట్టాలు వచ్చాయి. కానీ ఈ చట్టాల అమలు కోసం మరలా పోరాటం చేయ వలసి వస్తున్నది. ఈ పోరాటంలో అనేకమంది తమ జీవితాలను పణంగా పెట్టాల్సి వస్తోంది. గుజరాత్ అల్లర్లలో బిల్కిస్ బానో కేసులో ఆమె సంవత్సరాల తరబడి పోరాడిన తర్వాత దోషులకు శిక్షపడింది. అయితే ఆ తర్వాత సంస్కారవంతులనే సర్టిఫికెట్‌తో అంత ఘోరం చేసినవారు బయటకు రావడం... హారతులు ఇవ్వడం చూశాం. సినిమాలో చివరకు కథ సుఖాంతం అవుతుంది. కానీ నిజ జీవితంలో ఇది నిజంగా సాధ్యమా? ఆ అధికారి వెనుక ఒక రాజకీయ పార్టీ ఉంటే? ఆ అధికారి వెనుక ధనస్వామ్యం ఉంటే? అధికారి వెనుక ఏకంగా అధికార పార్టీ అండదండ ఉంటే... బాధితురాలికీ, ఆమె కుటుంబానికీ పాట్లు తప్పవని ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావో దారుణ అత్యాచార ఉదంతం తెలియచేస్తోంది. ఇటువంటి అనేక ఇబ్బందులను ఢిల్లీలో రెజ్లర్లు పడుతున్నారు. అయినా కానీ వారి పోరాట స్ఫూర్తి తగ్గలేదు. మే 28న ఒకపక్క పార్లమెంటు భవన ప్రారంభోత్సవం జరుగుతుంటే మరో పక్క పోలీస్ రాజ్యం యథేచ్ఛగా సాగిపోయింది. నూతన పార్లమెంటు భవనానికి మార్చ్‌గా వెళుతున్న రెజ్లర్లపై పోలీసులు పైశాచికంగా దాడిచేశారు. నడిరోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి పోలీస్ వాహనంలో ఎత్తిపడేశారు. పోలీస్‌స్టేషన్ల చుట్టూతిప్పారు. సోషల్ మీడియాలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రెజ్లర్లకు వ్యతిరేకంగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నెట్‌వర్క్ విషప్రచారం సాగించింది. దీంతో తాము గెలిచిన పతాకాలను గంగలో కలిపేందుకు సిద్ధమయ్యారు రెజ్లర్లు.

దేశవ్యాప్తంగా రైతు, వ్యావసాయ కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల మద్దతును రెజ్లర్లు కూడగట్టుకోవడంతో ఈ పోరాటం ప్రజా పోరాటంగా రూపాంతరం చెందింది. ఇది కేవలం మల్ల యోధుల పోరాటం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యానికి, ధనస్వామ్యానికి జరుగుతున్న పోరాటం. ఈ పోరాటానికి... స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ వారి ముందు రొమ్ము విరుచుకుని నిలబడిన కామ్రేడ్లు కావాలి. ఎన్ఆర్‌సి లాంటి కుట్ర పూరితమైన పౌర సత్వ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించిన కామ్రేడ్లు కావాలి. రైతు ఉద్యమంలో దేశ ప్రధాని మెడలు వంచిన కామ్రేడ్లు కావాలి. ఇటువంటి కామ్రేడ్స్ లేకుండా ప్రపంచంలో ఏ హక్కు సాధించలేదు. అందుకే రెజ్లర్లకు న్యాయం జరిగే వరకూ, మహిళలను లైంగిక వస్తువుగా చూసే నీచులకు బుద్ధి చెప్పే వరకు ఈ పోరాటం సాగాలి.

ఇవి ఫ్రిజ్‌లో పెడుతున్నారా..?

ఈ రోజుల్లో ఫ్రిజ్ లేని ఇల్లు ఉండదు. అందులోనూ వేసవి కాలం అయితే మంచినీటి దగ్గర నుంచి తినే పదార్థాల వరకు అందులో పెట్టాల్సిందే. కొన్ని వస్తువులకు ఫ్రిజ్ అవసరమే. అయితే కొన్ని ఆహార పదార్థాలు మాత్రం ఫ్రిజ్‌లో పెడితే విషతుల్యం అవుతాయి. అవేంటో తెలుసుకుందాం...

పుచ్చకాయ : వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం పుచ్చకాయ తింటుంటాం. అవసరాన్ని బట్టి ఒకేసారి రెండు మూడు ఇంటికి తీసుకువస్తూ ఉంటాం. అయితే కోయని పుచ్చకాయల్ని ఫ్రిజ్‌లో పెట్టవచ్చు. కానీ కోసిన తర్వాత వాటిని డైరెక్ట్‌గా ఓపెన్‌గా ఫ్రిజ్‌లో పెట్టకూడదు. ఒక వేళ చల్లదనం కోసం పెట్టాలనుకుంటే ఏదైనా మూత ఉన్న బాక్స్‌లో పెట్టి పెట్టుకోవచ్చు.



ఉల్లిగడ్డలు : వంట చేసేపుడు కొన్ని సందర్భాలలో అవసరానికి మించి ఉల్లిగడ్డలు కట్ చేస్తుంటాం. వాటిని మళ్ళీ ఉపయోగించవచ్చని ఫ్రిజ్‌లో దాస్తాం. ఇలా చేయడం వల్ల ఫ్రిజ్‌లో ఉండే ఇతర ఆహార పదార్థాలు చెడిపోతాయి. అందువల్ల తరిగిన ఉల్లిగడ్డలను ఫ్రిజ్‌లో పెట్టకపోవడమే ఉత్తమం.

ఆలూ : చల్లటి ప్రదేశంలో లేదా ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల ఆలుగడ్డలో ఉండే చెక్కర శాతం పెరుగుతుంది. దీని వల్ల కూర రుచి మారుతుంది.

తేనె : ఎన్ని ఏండ్లయినా చెడిపోని ఆహార పదార్థం తేనె. దీనిని ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల రుచి మారుతుంది.

అరటి పండ్లు : అరటి పండ్లలో ఎంజైమ్స్ ఉంటాయి. వీటిని ఫ్రిజ్‌లో ఉంచితే ఈ ఎంజైమ్స్ తగ్గిపోతాయి. దీనితో అరటి పండ్లు త్వరగా చెడిపోయే అవకాశం ఉంటుంది.

పువ్వులు : పువ్వుల వాసన వల్ల ఫ్రిజ్‌లో ఉండే ఇతర ఆహార పదార్థాలకు ఆ వాసన పడుతుంది. ఫలితంగా వాటిని తినలేం.

పచ్చళ్ళు : కాలానికి తగ్గట్లు పచ్చళ్ళు పెడుతూనే ఉంటారు. ఇవి చెడి పోకుండా ఉండటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి కానీ వాటిని ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల చల్లదనానికి త్వరగా చెడిపోయే అవకాశం ఉంటుంది.

బ్రెడ్ : బ్రెడ్ పాకెట్ ఓపెన్ చేసి తిన్నాక మిగిలినది తాజాగా ఉండాలని ఫ్రిజ్‌లో పెడుతుంటారు. ఓపెన్ చేసి పెట్టడం వల్ల బ్రెడ్ గట్టి పడిపోతుంది. అందువల్ల కవర్ మూసి పెట్టాలి.

డార్క్ స్పాట్స్‌కు బార్లీ...

బార్లీ కాస్త వగరుగా, కాస్త తియ్యగా ఉండి చలువ చేసే స్వభావాన్ని కలిగి ఉంటాయి. వేసవి వచ్చిందంటే బార్లీ గింజలను విరివిగా వాడుతుంటారు. ఇవి బరువు తగ్గించడంలో, బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయడంలో ఉపయోగపడతాయి. అలసట, నీరసం వంటి సమస్యలను దూరం చేస్తాయి. కిడ్నీలో రాళ్లను కరిగించడంలోనూ వీటి పాత్ర కీలకం. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక విధాలుగా బార్లీ గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే వీటిని ఆరోగ్యంతో పాటు చర్మ సంరక్షణకు కూడా ఉపయోగించ వచ్చుట. ముఖ్యంగా డార్క్ స్పాట్స్‌ను తగ్గించడంలో ఇవి చాలా ఎఫెక్ట్‌గా పని చేస్తాయట. మరి వాటిని చర్మ సంరక్షణకు ఎలా ఉపయోగించాలో తెలుసుకుందామా...



- బార్లీ గింజలను పొడి చేసుకుని, అందులో ఓట్స్ పొడి, రోజ్ వాటర్ వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని డార్క్ స్పాట్స్ ఉన్న చోట అప్లై చేసి ఇరవై నిమిషాల పాటు ఆరనివ్వాలి. అనంతరం చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తే డార్క్ స్పాట్స్ క్రమంగా తగ్గిపోతాయి.
- ఒక బౌల్‌లో బార్లీ గింజల పొడి, కొద్దిగా నిమ్మ రసం వేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పావు గంట పాటు ఆరనివ్వాలి. తర్వాత గోరు వెచ్చని నీటితో శుభ్రంగా రుద్దుతూ కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల డార్క్ స్పాట్స్‌తో పాటు చర్మంపై మృతకణాలు కూడా తొలగిపోయి, ముఖం అందంగా మారుతుంది.
- బార్లీ గింజలను నీటిలో వేసి నానబెట్టుకుని పేస్ట్ చేసుకోవాలి. ఈ పేస్ట్‌లో కొద్దిగా తేనె వేసి కలిపి ముఖానికి పట్టించాలి. బాగా ఆరిన తర్వాత కొద్దిగా నీళ్ల చల్లి వేళ్లతో స్క్రబ్ చేసుకుంటూ శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల డార్క్ స్పాట్స్ తొలగిపోయి ముఖం కాంతివంతమవుతుంది.



ఓట్స్ వాడకం ఈ మధ్యకాలంలో బాగా పెరిగిపోయింది. ఒకప్పుడు అధిక బరువు తగ్గాలనుకునే వారు మాత్రమే ఓట్స్‌ను ఉపయోగించే వారు. ఇప్పుడు రోజువారీ ఆహారంలో భాగమయ్యాయి. బరువుతో నిమిత్తం లేకుండా ప్రతీ ఒక్కరూ ఓట్స్‌తో చేసిన వంటకాలను ఇష్టపడుతున్నారు. ఉప్మా, ఇడ్లిలాంటివే కాకుండా చిన్న చిన్న మార్పులతో వెరైటీగా చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అవేంటో మనమూ ఓ సారి ప్రయత్నిద్దాం...

ఓట్స్‌తో వెరైటీగా...

పుంగనాలు

కావాల్సిన పదార్థాలు : ఓట్స్ – కప్పు, నీళ్ళు – ఒకటిన్నర కప్పు, చిన్నగా తరిగిన ఉల్లిగడ్డ – పావు కప్పు, పచ్చిమిర్చి – ఒకటి (సన్నగా తరిగినది), అల్లం – అంగుళం ముక్క (సన్నగా తరిగి పెట్టుకోవాలి), క్యారెట్ – ఒకటి (తురిమి పెట్టుకోవాలి), ఉడికించిన పచ్చి బఠానీలు – అర కప్పు, క్యాబేజి – పావు కప్పు (సన్నగా తరిగి పెట్టుకోవాలి), జీలకర్ర – అర టీ స్పూన్, ఉప్పు – రుచికి సరిపడా, తరిగిన కొత్తిమీర – కొద్దిగా, నెయ్యి – కొద్దిగా



తయారుచేసే విధానం : ఒక గిన్నెలోకి ఓట్స్ తీసుకుని కప్పున్నర నీళ్ళు పోసి అరగంట పాటు నానబెట్టాలి. నానిన ఓట్స్‌ను నీళ్ళతోపాటు మిక్సి జార్‌లోకి తీసుకుని కొంచెం పలుకులుగా గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి మార్చుకుని అందులో తగిరిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, అల్లం ముక్కలు, క్యారెట్ తురుము, బఠానీలు, క్యాబెజీ తురుము, అర టీస్పూన్ జీలకర్ర, పసుపు, కొత్తిమీర, ఉప్పు, బియ్యం పిండి అన్ని వేసి బాగా కలపాలి. గుంతపుంగనాల గిన్నె తీసుకుని స్టవ్ మీద పెట్టి కాస్త వేడయ్యాక ఆయిల్ లేదా నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని ఆ గుంతల్లో వేసుకుని మీడియం మంట మీద కనీసం మూడు నుంచి ఐదు నిమిషాలు కాలాక తీసుకుంటే సరి. కమ్మని ఓట్స్ గుంతపుంగనాలు రెడీ.

ఇడ్లీ

కావాల్సిన పదార్థాలు : ఓట్స్– రెండు కప్పులు, పుల్లని పెరుగు – రెండు కప్పులు, ఆవాలు– టీస్పూన్, మినప్పప్పు – టేబుల్ స్పూన్, సెనగపప్పు– అర టేబుల్‌స్పూన్, నూనె– అరటీస్పూన్, పచ్చిమిర్చి – రెండు (సన్నగా తరగాలి), క్యారెట్ తురుము–రెండు టేబుల్ స్పూన్లు, కొత్తిమీర తురుము– టేబుల్ స్పూన్, పసుపు– చిటికెడు, ఉప్పు – తగినంత.



తయారుచేసే విధానం : మొదట బాణలిలో ఓట్స్ వేసి కాస్త రంగు మారే వరకూ సన్నని మంట మీద వేయించాలి. తర్వాత మిక్సీలో వేసి పొడిలా చేయాలి. తర్వాత చిన్న కడాయిలో నూనె పోసి వేడయ్యాక ఆవాలు, మినప్పప్పు, సెనగపప్పు వేసి వేయించాలి. కొద్దిసేపటి తర్వాత పచ్చిమిర్చి, కొత్తిమీర తురుము, క్యారెట్ తురుము, పసుపు వేసి ఓ నిమిషం వేగాక దించి ఓట్స్ పొడిలో కలపాలి. అందులోనే కొద్దిగా పెరుగు, తగినంత ఉప్పు వేసి కలిపి ఇడ్లీ పిండి మిశ్రమంలా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన ఇడ్లీ ప్లేటుల్లో వేసి సుమారు 15 నిమిషాలు ఉడికించి దించాలి. అంతే వేడివేడి ఓట్స్ ఇడ్లీ రెడీ అయినట్టే.

ఉప్మా

కావాల్సిన పదార్థాలు : ఓట్స్ – రెండు కప్పులు, మినప్పప్పు– టేబుల్ స్పూన్, శనగపప్పు – రెండు టీ స్పూన్లు, అల్లం ముక్కలు – ఒక టీ స్పూన్, కరివేపాకు – కొద్దిగా, ఇంగువ – చిటికెడు, ఆవాలు – ఒక టీ స్పూన్, పచ్చి మిర్చి – మూడు, ఎండు మిర్చి – రెండు, ఉల్లిగడ్డ – ఒకటి, నూనె – ఒక టీస్పూన్, నీరు – నాలుగున్నర కప్పులు, ఉప్పు – తగినంత



తయారుచేసే విధానం : పాన్‌లో మూడు నిమిషాల పాటు ఓట్స్ వేయించి పక్కన పెట్టుకోవాలి. తర్వాత అదే పాన్‌లో కొద్దిగా నూనె వేడిచేసి, మినప్పప్పు, శనగపప్పు, ఆవాలు, పచ్చిమిర్చి ముక్కలు, ఎండు మిర్చి వేసి వేగనివ్వాలి. ఉల్లిగడ్డ, అల్లం ముక్కలు, కరివేపాకు కూడా వేసి వేయించాలి. తర్వాత ఇంగువ, ఉప్పు కలిపి నీరు పోసి మరిగించాలి. ఓట్స్ వేసి, నీరంతా పీల్చేదాకా సన్నని సెగపై ఉడికించాలి. అంతే రుచికర ఓట్స్ ఉప్మా రెడీ. షుగర్‌తో బాధపడే వారికి ఇది మంచి ఆహారం.

ఖీర్

కావాల్సిన పదార్థాలు : ఓట్స్ – పావు కేజీ, గ్రాములు, పంచదార – రెండు టేబుల్ స్పూన్‌లు, ఆపిల్ – ఒకటి, తేనె – యాభై గ్రాములు, కాజు, బాదం పలుకులు – ఇరవై ఐదు గ్రాములు, పాలు – అర లీటరు, నెయ్యి – టేబుల్ స్పూన్, యాలకుల పొడి – చిటికెడు



తయారుచేసే విధానం : ఒక పాన్‌లో నెయ్యి వేసి అందులో ఓట్స్ కూడా వేసి సన్నని మంట మీద కొద్దిగా వేయించాలి. చాల్లారాక మిక్సి జార్‌లో వేసి పొడి చేసుకోవాలి. స్టవ్ మీద పాత్ర పెట్టి పాలు బాగా మరగ నివ్వాలి. అందులో ఈ ఓట్స్ మిశ్రమం వేసి తిప్పుతూ ఉండాలి. ఆపిల్‌ను చిన్న ముక్కలుగా కట్ చేసుకుని అందులో వేసి కలపాలి. మిశ్రమం మొత్తాన్ని బాగా కలియ తిప్పుతూ పంచదార, తేనె వేయాలి. పంచదార అందులో కలిసి పోయాక బాదం, జీడిపప్పు పలుకులు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. స్టవ్ ఆఫ్ చేసి దించి కాస్త చల్లారాక సర్వ్ చేసుకుంటే సరి. ఈ ఖీర్ చాలా వెరైటీ రుచితో మళ్ళీ తినాలనిపిస్తుంది.

ఊతప్పం

కావాల్సిన పదార్థాలు : ఓట్స్– రెండు కప్పులు, సేమియా– కప్పు, పెరుగు– రెండు కప్పులు, ఉల్లిగడ్డ – రెండు, పచ్చిమిర్చి– నాలుగు, కొత్తిమీర – కొంచెం, టమాటా– ఒకటి, ఉప్పు – తగినంత, నూనె – కొంచెం,



తయారుచేసే విధానం : ఓట్స్‌ను పెరుగులో, నీళ్లలో సేమియాను నానబెట్టాలి. రెండు గంటలయ్యాక సేమియాలో నీళ్లు వంపేసి, ఓట్స్‌లో కలపాలి. పచ్చిమిర్చి, ఉల్లిగడ్డలు, టమాటాలను సన్నగా తరిగి ఓట్స్ మిశ్రమంలో కలపాలి. అందులోనే కొత్తిమీర, కొద్దిగా ఉప్పు వేసి కలియ తిప్పాలి. గట్టిగా ఉంటే కొన్ని నీళ్లు చేర్చి కలపాలి. తర్వాత పొయ్యి మీద పెనం పెట్టాలి. వేడయ్యాక మిశ్రమాన్ని ఊతప్పంలా మందంగా వేసి నూనెతో రెండు వైపులా కాల్చాలి. పోషకాలు మిళితమైన వేడి వేడి ఓట్స్ ఊతప్పాన్ని కొబ్బరి పచ్చడితో తింటే రుచిగా ఉంటుంది.

రాజగోపాల్‌రెడ్డి చూపు.. హస్తం వైపు

(మొదటిపేజీ తరువాయి)

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బాహాటంగానే చర్చిస్తున్నారు. తెలంగాణలో బీజేపీకి అవకాశం లేదని తన అనుచరుల వద్ద తేల్చిచెపుతున్నారు. ఈ విషయం ఇప్పుడే కాదు...మునుగోడు ఉప ఎన్నికల్లోనూ తేలిపోయిందని చెబుతున్నారు.

మునుగోడులో పావుగా వాడుకుందనే ఆవేదన

మునుగోడు ఉప ఎన్నిక ద్వారా రాష్ట్రంలో చక్రం తిప్పాలనే భావనతో బీజేపీ తనను పావుగా వాడుకుందని సన్నిహితుల వద్ద ఆవేదన చెందినట్టు తెలిసింది. అంతేకాకుండా మునుగోడుకు చెందిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, బండి సంజయ్ వెన్నంటి ఉండే జి మనోహర్‌రెడ్డి కూడా తన ఓటమికి కారణమయ్యారనే కోపం రాజగోపాల్‌రెడ్డిని వెంటాడుతున్నది. పాత బీజేపీ శ్రేణులు అక్కడ రాజగోపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా పని చేశారనే ప్రచారముంది. మరోవైపు బీజేపీలో ఇటీవల గ్రూపుల పోరు తీవ్రమైంది. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో ఆయన కమలం పార్టీని వీడిని హస్తం గూటికి చేరాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

అక్కడే ఉంటే గెలుపు అంత ఈజీ కాదు

ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో కాంగ్రెస్ పార్టీ కర్నాటక రాష్ట్రంలో తిరుగులేని విజయం సాధించడంతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఊపొచ్చింది. రాజగోపాల్‌రెడ్డి సొంత అన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే ఉన్నారు. రాజగోపాల్‌రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా సుదీర్ఘ కాలం పనిచేశారు. అంతేకాకుండా రానున్న ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేస్తే మునుగోడులో గెలుపు అంత ఈజీగా కాదనేది తేలిపోయింది. దీంతో ఆయన సొంత గూటికి రావాలని నిర్ణయించుకున్నట్టు బలంగా వినిపిస్తున్నది.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నేతలు నోముల, శ్రీహరిరావు

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నోముల ప్రకాష్ గౌడ్, నిర్మల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేత శ్రీహరి రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకాష్ గౌడ్ సేవలను ఉపయోగించుకుని వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. గ్రేటర్‌లో సెల్ఫీలు దిగే వారు, సెల్ఫ్ డబ్బాలు కొట్టుకునేవారు ఎక్కువయ్యారు అని బీఆర్ఎస్ నాయకులను ఎద్దేవా చేశారు. కేటీఆర్, దానం నాగేందర్ ను సూటిగా ప్రశ్నిస్తున్నా.. గ్రేటర్ లో మెట్రో నిర్మించింది కాంగ్రెస్ కాదా? అని ప్రశ్నించారు. కచ్చితంగా నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కొడంగల్‌లో గెలవడం ఎంత ముఖ్యమో నిర్మల్ నియోజకవర్గంలో గెలవడం అంతే ప్రాధాన్యతగా తీసుకుంటామన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి, ప్రజలకు మధ్య యుద్ధం జరగబోతోందన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని బండకేసి కొడతారని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

సిగ్గనిపించడం లేదా కేసీఆర్? రేవంత్ ట్వీట్

రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) బాధిత రైతులకు బేడీలు వేసి భువనగిరి కోర్టుకు తీసుకొచ్చిన ఘటనపై రేవంత్‌రెడ్డి ట్విటర్ వేదికగా స్పందించారు. 'ఆడబిడ్డలపై అకృత్యాలు చేసే దుర్మార్గులపై చర్యలు ఉండవు. మత్తు పదార్థాల మాఫియాకు శిక్షలు ఉండవు. భూ కబ్జాలు చేసే బీఆర్ఎస్ గద్దలపై కేసులు ఉండవు. తన రక్తాన్ని చెమటగా మార్చి బుక్కెడు బువ్వ పెట్టే రైతు చేతికి సంకెళ్లా? సిగ్గనిపించడం లేదా కేసీఆర్'. అని రేవంత్ ప్రశ్నించారు.

కాంగ్రెస్‌లో పొంగులేటి చేరిక ఖాయం : మాజీ ఎంపీ వి హనుమంతరావు



మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో పార్టీలో చేరుతారని మాజీ ఎంపీ వి హనుమంతరావు వెల్లడించారు. ఎలాంటి షరతులు లేకుండా చేరుతున్నారని తెలిపారు. అన్ని సీట్లు పొంగులేటి వర్గానికి అనేది అవాస్తవమని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చూసుకుంటారని వివరించారు.

ఢిల్లీకి పాలు, నీళ్లు నిలిపేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

రైతులు దిగ్బంధించారు. ఖాప్ పంచాయతీల బంద్‌కు ప్రతిపక్ష పార్టీలు మద్దతునిచ్చాయి. బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశాయి. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయకుంటే ఢిల్లీకి పాలు, నీళ్ల సరఫరా నిలిపివేస్తామని ఖాప్ పంచాయతీలు హెచ్చరించాయి. హర్యానా బంద్ తరువాత ఖాప్ పంచాయతీలు ఈ నెల 18న భారత్ బంద్ ప్రకటించాయి. ఇందుకోసం ఇతర రాష్ట్రాల రైతు సంఘాలను సంప్రదించి సన్నాహాలు చేసేందుకు 21 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటుచేశారు. దీనితో పాటు, ఇతర రాష్ట్రాల వ్యాపార బోర్డులు, రాజకీయ పార్టీలు, ఖాప్‌ల ప్రతినిధులతోనూ సంప్రదింపులు జరుపుతున్నారు. బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ అరెస్టు, రైల్ కారిడార్‌కు పరిహారం, రుణమాఫీ, తదితర అంశాలతో కూడిన 25 అంశాల చార్టర్‌ను రూపొందించారు. ప్రభుత్వంతో చర్చలు జరిపే బాధ్యతనూ ఈ 21 మంది సభ్యుల కమిటీకి అప్పగించారు.

బ్రిజ్ భూషణ్ కుటుంబ సభ్యులెవరూ డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల్లో పోటీ చేయరు

డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుటుంబ సభ్యులు అర్హత ఉన్నప్పటికీ రాబోయే ఫెడరేషన్ ఎన్నికల్లో పోటీ చేయరని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, నలుగురు వైస్ ప్రెసిడెంట్లు, సెక్రటరీ జనరల్, ట్రెజరర్, ఇద్దరు జాయింట్ సెక్రటరీలు, ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్ల స్థానాలకు జూలై 6న ఎన్నికలు జరగనున్నాయి.

రాబోయే ఎన్నికలలో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుటుంబ సభ్యులు లేదా అతని సహచరులు పోటీ చేసేందుకు అనుమతించకూడదన్నది క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ వద్ద రెజ్లర్లు లేవనెత్తిన డిమాండ్లలో ఒకటి. అందుకు రెజ్లర్లకు కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. సింగ్ కుమారుడు కరణ్ భూషణ్ ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్‌కు నాయకత్వం వహిస్తుండగా, అతని అల్లుడు ఆదిత్య ప్రతాప్ సింగ్ బీహార్ యూనిట్‌కు అధిపతిగా ఉన్నారు. 'ఆయన కుమారుడు కరణ్, అతని అల్లుడు ఆదిత్య డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలకు నామినేషన్లు వేయకూడదని నిర్ణయించుకున్నారు' అని సింగ్ సన్నిహిత వర్గాలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వివాదానికి మరింత ఆజ్యం పోసేలా చేయడం మంచిది కాదని, అయితే కరణ్, ఆదిత్య ఇద్దరూ ఎన్నికలలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని ఆయా వర్గాలు పేర్కొన్నాయి.

మణిపూర్‌లో ఆగని హింస

(మొదటిపేజీ తరువాయి)

ఖామెన్‌లాక్‌లో బాంబులు విసిరారు. ఈ ప్రాంతంలోనే కుకీలు, మైతీల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. కొద్ది రోజులుగా జరుగుతున్న వేర్వేరు ఘటనల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. రెండు తెగల వారు అత్యాధునిక ఆయుధాలతో ఒకరిపై ఒకరు కాల్పులకు తెగబడుతున్నారు. ఈ నెల 3న ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుండి 115 మంది చనిపోగా 40 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న మైతీలు తమకు ఎస్టీ హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తుండగా గిరిజనులైన కుకీలు దానిని వ్యతిరేకిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాంతి కమిటీపై తమకు విశ్వాసం లేదని, అందులో చేరే ప్రశ్నే లేదని రెండు తెగల వారు స్పష్టం చేశారు.

లండన్‌లో హైదరాబాద్ యువతి హత్య

(మొదటిపేజీ తరువాయి)

లండన్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో నివసిస్తున్న ఆమెపై ఎదురు ఫ్లాట్‌కు చెందిన ఓ బ్రెజిలియన్ కత్తితో దాడి చేశాడు. దాంతో ఆమె మృతి చెందింది. అడ్డువచ్చిన జనగామకు చెందిన అఖిలకు తీవ్రగాయాలు అయ్యాయి. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. అయితే నిందితుడు ఆ అపార్ట్‌మెంట్‌లోకి వారం రోజుల క్రితమే వచ్చినట్టు తెలిసింది. కాగా, హత్య విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి కేటీఆర్‌తో ఫోన్‌లో సంప్రదించారు. మృతదేహాన్ని త్వరలోనే స్వగ్రామం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకట రమణా రెడ్డి, తదితరులున్నారు.

ధరణి జీవన్మరణ సమస్య

(మొదటిపేజీ తరువాయి)

తప్పు లేదని చెప్పారు. ఇలాంటి మాటలు అనటానికి తాము ఏ మాత్రం భయపడటం లేదన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు మల్లు రవి, హర్కర వేణుగోపాల్‌తో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 75 ఏండ్లలో ఏ రాజకీయ పార్టీ, రాజకీయ నాయకుడు కేసీఆర్ మాదిరిగా దోపిడీకి పాల్పడలేదన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ సైబర్ నేరగాళ్ల మాదిరిగా ధరణి పేరుతో తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్ వెనకాల దొరలు, రాజులున్నారని చెప్పారు. కేసీఆర్ దోపిడీ, దొంగతనానికి అడ్డు అదుపూ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి దోపిడీపై తొవ్వుతుంటే కొత్త కొత్త విషయాలు బయపడుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉండాల్సిన రెవెన్యూ రికార్డులను ధరణి పేరుతో పూర్తిగా ప్రయివేటు కంపెనీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కు కట్టబెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో భూలావాదేవీలన్నీ ధరణి పోర్టల్ ద్వారా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ నిర్వహిస్తున్నదని తెలిపారు. వాస్తవానికి ఆ కంపెనీ దివాళా తీసిందన్నారు. గతంలో రూ.90వేల కోట్ల అప్పులు చేసి బ్యాంకులను నిండా ముంచిందని విమర్శించారు. దివాళా తీసిన కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం చేసిన మొదటి తప్పు అని చెప్పారు. ఆ కంపెనీ ధరణి నిర్వహణ కోసం సబ్సిడీ కంపెనీ టెర్రాసిస్ టెక్నాలజీస్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసిందనీ, అందులో 52.26 శాతం వాటాను టెర్రాసిస్ కంపెనీ ఫిలిప్పీన్స్ దేశానికి చెందిన ఫాల్కన్ కంపెనీకి రూ.1275 కోట్లకు అమ్ముకుందని అన్నారు. కొనుగోలు చేసే కంటే ఒక నెల ముందు మాత్రమే ఫాల్కన్ కంపెనీని 2021, అక్టోబర్‌లో ప్రారంభించారని తెలిపారు. ఇప్పుడు టెర్రాసిస్ కంపెనీ 99 శాతం వాటా ఫాల్కన్ కంపీనికి ఇచ్చేసిందనీ, ఇప్పుడు ఆ కంపెనీలో శ్రీధర్‌రాజు చేరారని తెలిపారు. దాంతో ధరణి పోర్టల్ పూర్తిగా శ్రీధర్ రాజు చేతుల్లోకి వెళ్ళిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా ప్రజల భూముల వివరాలన్నీ ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో పెడుతున్నారని విమర్శించారు. ధరణి నిర్వహణపై ఐఎల్ఎఫ్ సంస్థతో రూ.150కోట్లకు ఒప్పందం చేసుకున్నారని గుర్తు చేశారు. ఆ సంస్థకు చెందిన 99శాతం వాటాను టెరాలసిస్ టెక్నాలజీస్ అనే సంస్థ కొనుగోలు చేసిందనీ, 70లక్షల భూ యజమానుల వివరాలను ఐఎల్ఎఫ్ సంస్థకు విక్రయించారని ఆరోపించారు. ఒడిశా ప్రభుత్వం 2008లో ఈ–ధరణి పేరుతో ఈ ప్రాజెక్టు ప్రారంభించిందనీ, దీని నిర్వహణను కూడా ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కు అప్పగించిందన్నారు. ధరణి పోర్టల్ పారదర్శకంగా ఉంటే, అంతా తప్పుల తడకగా ఉందంటూ కాగ్ రిపోర్టు ఎందుకు ఇచ్చిందని ప్రశ్నించారు.

ధరణిని బంగాళాఖాతంలో పడేయాలని కాగ్ చెప్పిందని గుర్తు చేశారు. ఇంత జరిగితే కేసీఆర్ తానే అద్భుతాలు చేసి ధరణిని సష్టించినట్టు చెప్పారని ఎద్దేవా చేశారు. రిజిస్ట్రేషన్ కు స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే తిరిగి డబ్బులు రావడం లేదనీ, అందుకు మక్తల్‌కు చెందిన ఆంజనేయులు గౌడ్ ఒక ఉదాహరణ అని తెలిపారు. ఇలా ఎన్ని వందల కోట్లు కంపెనీ ఖాతాలోకి వెళుతున్నాయని ప్రశ్నించారు. అసలు ఆ డబ్బులు ప్రభుత్వానికి చేరుతున్నాయా? చెప్పాలన్నారు.

ధరణి ద్వారా జరిగిన లావాదేవీలతో వచ్చిన రూ.50వేల కోట్లలో రూ. 40వేల కోట్లు ప్రభుత్వానికి వెళ్లాయని కొంత మంది అధికారులు చెబుతున్నారనీ, ఇది వాస్తవమా? అవాస్తవమా? విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్ల దోపిడీ జరుగుతున్నా కేంద్రం కేసీఆర్‌పై ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. దీని వెనక ఏ గూడుపుఠానీ ఉందో కేంద్ర బీజేపీ నేతలే చెప్పాలని డిమాండ్‌చేశారు. 'అరవింద్ కుమార్ లీగల్ నోటీసులను రిజిస్టర్ పోస్టు లేదా పర్సన్ ద్వారా నాకు పంపాలి.. కానీ పబ్లిక్ డొమైన్‌లో ఎలా పబ్లిష్ చేస్తారు. మీడియాకు ఎలా రిలీజ్ చేస్తారు? ఉద్దేశపూర్వకంగానే అరవింద్ కుమార్ నా ప్రతిష్ఠను తగ్గించేలా వ్యవహరించారని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ముంచుకొస్తోంది..

(మొదటిపేజీ తరువాయి)

పురషోత్తమ్ రూపాలా పేర్కొన్నారు. గురువారం సాయంత్రం గుజరాత్‌లోని జఖౌ పోర్ట్‌లో తీరాన్ని దాటవచ్చని ఐఎండీ అధికారులు అంచనా వేశారు. ఆ సమయంలో గంటకు 150 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు.

8 రాష్ట్రాల్లో వర్షాలు..

ఈ తుపాను ప్రభావంతో గుజరాత్‌తో పాటు మరో ఎనిమిది రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో కేరళ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాలతో పాటు డామన్‌డయ్యూ, లక్షద్వీప్, దాద్రానగర్ హవేలీ కేంద్ర పాలిత ప్రాంతాలు అప్రమత్తమయ్యాయి. రాజస్థాన్‌లో జూన్ 16 నుంచి ఈ తుఫాను ప్రభావం ఉండనున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది.

రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణాలకు అంతర్జాతీయ అవార్డులు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఇందులో.... డా.బిఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయం, యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనం, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్, మొజంజాహీ మార్కెట్‌లు 'ఇంటర్నేషనల్ బ్యూటీఫుల్ బిల్డింగ్స్ గ్రీన్ యాపిల్ అవార్డుల'ను అందుకోవడం గొప్ప విషయమని సీఎం తెలిపారు. పర్యావరణ రంగంలో ప్రపంచంలోనే పేరొందిన లండన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'గ్రీన్ ఆర్గనైజేషన్' ఈ అవార్డులను ప్రకటించడం తెలంగాణకు గర్వకారణమని చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా ఈ గ్రీన్ అవార్డులను దక్కించుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలవడం ద్వారా, తెలంగాణతో పాటు దేశ ఖ్యాతి ఇనుమడించిందని సీఎం అభిప్రాయపడ్డారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పర్యావరణ నియమాలకు అనుగుణంగా నూతన కట్టడాల నిర్మాణం, పునరుద్ధరణ జరుగుతున్నదని సీఎం స్పష్టం చేశారు. అందుకు ఈ అవార్డులు నిదర్శనమన్నారు. సకల జనుల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన కొనసాగుతున్న నేపథ్యంలో, తెలంగాణ ఆచరిస్తున్న ప్రగతి దారులను దేశం అనుసరిస్తున్నదని తెలిపారు. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ప్రశంసలు తెలంగాణకు వెల్లువెత్తుతున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ఈ నెల 16న లండన్‌లో ఈ అవార్డులను తెలంగాణ రాష్ట్రానికి అందచేయనున్న సందర్భంగా, ఇందుకు కృషి చేసిన ఆయా శాఖల మంత్రులను, ఉన్నతాధికారులను, సిబ్బందిని సీఎం కేసీఆర్ అభినందించారు.

తమిళనాడు మంత్రి అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

తప్పుబట్టారు. ఈ సోదాలు ఫెడరలిజం స్ఫూర్తిపై దాడిగా ఆయన అభివర్ణించారు. బీజేపీ ప్రతీకార రాజకీయాల చర్యలను చూస్తున్న ప్రజల మౌనాన్ని తక్కువ అంచనా వేయకూడదన్నారు. 2024 జాతీయ ఎన్నికలు అనే తుఫానుకు ముందున్న ప్రశాంతత బీజేపీని తుడిచిపెట్టేస్తుందని హెచ్చరించారు. ఇటు డీఎంకే మిత్రపక్షం కాంగ్రెస్ సైతం మంత్రి అరెస్టును తప్పుబట్టింది. సెంథిల్ బాలాజీ అరెస్టు నరేంద్రమోడీ నేతృత్వంలోని సర్కారు చేసిన రాజకీయ వేధింపులు, ప్రతీకార చర్య తప్ప మరొకటి కాదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు ప్రతిపక్షంలో ఉన్న తామేమీ భయపడబోమని తెలిపారు. డీఎంకే నేతృత్వంలోని అధికార కూటమి సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్.. మంత్రి అరెస్టును నిరసిస్తూ ఈనెల 16న కోయంబత్తూరులో బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది.

పలు జిల్లాలకు వేడిగాలులల హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

వచ్చే రెండు రోజులకు సంబంధించి పలు జిల్లాల్లో వేడిగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ జాబితాలో నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్, ములుగు, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ జిల్లాలున్నాయి. అదే సమయంలో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయని తెలిపింది.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

ఆకాశం వైపు ఎదురుచూపు

జూన్ రెండో వారంలో కూడా మండుతున్న ఎండల్ని చూస్తుంటే వానా కాలమా..? ఎండా కాలమా..? అనే సందేహం కలుగుతుంది. ముందస్తు ఖరీఫ్ కాదు కదా.. సాధారణ ఖరీఫ్ సీజన్ కూడా చేజారిపోతుందనే గుబులు అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో అకాల వర్షాలు తప్ప సీజన్‌లో కురవాల్సిన వర్షాల జాడలేకపోయే సరికి రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. నైరుతి రుతుపవనాలు సకాలంలో వస్తున్నాయని ఆశపడ్డ రైతులకు నిరాశే ఎదురవుతోంది. వేసవి దుక్కులు దున్నేందుకైనా పదును ఉండే చిన్నపాటి వర్షంకూడా కురవకపాయే అంటూ దిగాలు చెందుతున్నారు. పత్తి విత్తనాలు విత్తుకునే సమయం చేజారిపోతుందని ఆందోళన చెందుతున్నార

నైరుతీ రుతుపవనాలు ఆలస్యం

- జూన్ 15 వచ్చినా చినుకు జాడలేదు
- ఖరీఫ్ ముందస్తు సాగు అసాధ్యమంటున్న రైతులు
- ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు ఏవీ?



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటల సాగు జాడే కనిపిస్తలేదు. మూడు జిల్లాల్లో కలిపి 18 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశముంది. సంగారెడ్డి జిల్లాలో 7.10 లక్షల ఎకరాలు సాగుకానుంది. ఇందులో పత్తి 3.50 లక్షల ఎకరాలు, వరి 1.40 లక్షల ఎకరాలు, మిగతావి ఇతర పంటలు సాగవుతాయి. మెదక్ జిల్లాలో 3.76 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవ్వనుండగా.. ఇందులో అత్యధికంగా వరి.. 3.10 లక్షల ఎకరాల్లో సాగవుతుంది. సిద్దిపేట జిల్లాలో 8 లక్షల ఎకరాల్లో.. 3.20 లక్షల ఎకరాల్లో వరి, 3.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవ్వనుంది. చెరకు, కంది, పెసర, మొన్నజొన్న, జొన్న, మినుము, మక్కలు, ఆలు, ఉల్లిగడ్డ వంటి పంటలూ సాగవుతాయి.

జూన్ 15 దాటినా వర్షాల్లేవు

జూన్, జులైలో కురిసే వర్షాల ఆధారంగానే ఖరీఫ్ సీజన్ పంటల సాగు ఆధారపడి ఉంటుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధికంగా 7.48 లక్షల ఎకరాల్లో సాగయ్యే పత్తి విత్తనాలు జూన్ మొదటి వారంలోనే విత్తుకోవాలి. కనీసం రెండో వారంలోనైనా విత్తనాలు విత్తకపోతే పంట ఆలస్యమై చీడపీడల పాలవుతుంది. అదే విధంగా బోరుబావులు, కాల్వ లు, చెరువుల కింద 8 లక్షల ఎకరాల్లో వరి సాగవ్వనుంది. ఆరిద్ర కార్తిలోనే వరినార్లు పోసుకుంటారు. సన్న రకాలు ఆరు మాసాలకే పంట చేతికొస్తుంది. అందుకే ఖరీఫ్‌లో జూన్‌లోనే వరి నార్లు పోస్తారు. ఇప్పటి వరకు వర్షాలు పడక పోయే సరికి మేజర్ పంటలైన పత్తి, వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. సంగారెడ్డి జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షాపా తం 130.4 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు వర్షం జాడే కనిపించలేదు. గతేడాది జూన్‌లో 150.1 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ సాధారణ వర్షపాతం 130.6 మిల్లీ మీటర్లు కాగా ఇంత వరకు చినుకే పడలేదు. ఈ ఏడాది జూన్‌లో కనీస వర్షాపాతమైనా పడు తుందా లేదా అనే అనుమానం కలుగుతుంది. పరిస్థితులు ఇలానే కొనసాగితే ఇక జులైపై ఆధారపడాల్సి వస్తుంది. ఆ మాసంలోనూ వర్షాలు సరిపడ కురవకపోతే ఖరీఫ్ పంటల సాగు చేజారిపోయిన ట్లేనని రైతులు పేర్కొంటున్నారు.

చేజారిన ముందస్తు ఖరీఫ్

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ముందస్తు ఖరీఫ్‌కు వెళ్లాలని ప్రణాళికలు తయారు చేసింది. తక్కువ కాలంలో పంట చేతికొచ్చే వరి రకాల్ని సాగు చేయాలని ప్రతిపాదనలు చేసింది. యాసంగి సీజన్‌లో పంట చేతికొచ్చే దశలో అకాల వర్షాలు కురిసి ప్రతి ఏటా నష్టమేర్పడుతుంది. యాసంగిలో మార్చి వరకు కోతలు పూర్తయితే నూక శాతం తక్కువవుతుంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ను ముందుకు తీసుకెళ్లాలని బావించింది. ఇందు కోసం వ్యవసాయ శాఖ వానాకాలం, యాసంగిలో సాగు పద్దతిపై ఒక ప్రణాళికల తయారు చేసింది. వానాకాలంలో 140 రోజులు అంతకన్న ఎక్కువ సయమం గల దీర్ఘకాలిక రకాల సాగుకు మే 25 నుంచి జూన్ 5 లోగా నారు పోసుకోవాలని సూచించింది. 130-135 రోజుల వ్యవధి గల మధ్య కాలిక రకాల సాగుకు జూన్ 15 వరకు నార్లు పోసుకోవాలి. 120-125 రోజుల వ్యవధి గల స్వల్పకాలిక రకాల సాగుకు జూన్ 25 వరకు నార్లు పోయాలి. ఎలాంటి రకాలైనప్పటికీ వానాకాలంలో జులై చివరి నాటికే నాట్లు వేసుకోవాలి. ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు రకాల సూచనలకు కూడా సమయం దాటిపోయింది. అంటే ఈ ఏడాది ఖరీఫ్ ముందుకు జరిగే అవకాశంలేదు. యాసంగిలోనూ పాత పద్దతిలోనే వరి సాగు చేయాల్సి ఉంటుంది.

పత్తి, వరి సాగుకు అదును దాటుతున్న వైనం

పత్తి, వరి సాగుకు అదును దాటుతోంది. జూన్ 5 వరకు వరి సాగుకు నార్లు పోయాలి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా వరి నార్లు పోయలేదు. బోర్ల కింద కొంత మంది రైతులు నారు కోసం వడ్లు చల్లారు. అవి మొలకలు రావట్లేదు. వర్షాలు పడకపోతే నాట్ల కోసం పొలం దున్నడం వీలుకాదు. ఇక పత్తి సాగు సీజన్ దాటిపోతుంది. జూన్ మొదటి వారంలోనే పత్తి విత్తనాలు విత్తుకోవాలి. ఇప్పటి వరకు దక్కులు దున్ని సిద్ధం చేశారు. వర్షాలు పడకపోవడం తో ఇంత వరకు ఏ ఒక్క ఎకరంలో కూడా విత్తనాలు విత్త లేదు. జూన్ చివరి వరకు పత్తి విత్తనాలు వేయకపోతే ఆ పంట సాగు ప్రశ్నార్థకమే అవుతుంది.

చినుకు కోసం ఎదురుచూపు



చినుకు జాడ కోసం ఎదురు సూత్తున్నం. మబ్బుకాన రాట్లే. ఎండలు మండుతున్నయి. కాలమైతదో కాదోనన్న గుబులు పట్టుకుంది. 20 ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధం చేసిన. అప్పు చేసి విత్తనాలు, ఎరువులు తెచ్చిన. ఏం లాభం కాలం లేకపాయే. ఈ మాసాంతం లోనైనా వర్షం కురిస్తే సరె. లేదంటే పత్తి వేసినా దండగే. పెట్టుబడి ఎల్లదు. కాలమైతదని పొలంలో ఆశతో ఎదురు సూత్తున్నం. ఆ మేఘాల దయ.

భీమిని మాణిక్యప్ప, మేళసంఘం

ప్రత్యామ్నాయ ప్రణాళికలు

సకాలంలో అవసరం మేరకు వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంట సాగుకు సంబంధించిన ప్రణాళికలున్నాయి. కాంటింజెంట్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి రైతులు అకాల పరిస్థితులకు అనుకూలమైన పంటలేయాలి. ఆగస్టు 15 వరకు కూడా వర్షాలు కురవకపోతే రెగ్యులర్‌గా వేసుకునే పంటలు కాకుండా తక్కువ కాలంలో చేతికొచ్చే రకాల్ని సాగు చేయాలి.

స్పందన, ఏరువాక శాస్త్రవేత్త

నిమ్స్ కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిమ్స్ కాంట్రాక్టు కార్మికుల జీతాలను పెంచాలనీ, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌కు నిమ్స్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్(సీఐటీయూ) వినతిపత్రం అందజేసింది. బుధవారం నిమ్స్ ప్రాంగణంలో సీఎం కేసీఆర్‌ను సీఐటీయూ, టీఆర్ఎస్‌కేవీ నాయకులు వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షులు జీ.రాంబాబు యాదవ్, కనీస వేతనాల సలహా మండలి బోర్డు చైర్మెన్ పి.నారాయణ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, నిమ్స్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) అధ్యక్షులు ఎం.వెంకటేశ్, నాయకులు బాలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో 30 ఏండ్ల నుంచి 1350 మంది కార్మికులు పనిచేస్తున్నారనీ, 306 డ్రాఫ్ట్ జీవో ప్రకారం రూ.14,700 జీతం మాత్రమే ఇస్తున్నారని సీఎం కేసీఆర్ దృష్టికి వారు తీసుకెళ్లారు. 2019 నుంచి వీడీఏ పాయింట్లు అమలు చేస్తామనీ, వాటిని లెక్కించి అదనంగా రూ.2,100 వేతనం పెంచి ఏరియర్స్ ఇస్తామని నిమ్స్ అధికారులు వాగ్దానం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పటివరకూ నిమ్స్ యాజమాన్యం ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని వాపోయారు. సీనియార్టీ ప్రకారం కార్మికులను రెగ్యులర్ చేయాలనీ, 306 జీవోను గెజిట్ చేయాలనీ, రూ.26 వేల వేతనం ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. నిమ్స్‌లో పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికులకు ఆ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు అందించాలనీ, బస్‌పాసు సౌకర్యం కల్పించాలని కోరారు.

సర్కారు బడుల్లో వసతులు కల్పించాలి

- కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలి : విద్యాశాఖ కార్యదర్శికి ఎస్ఎఫ్ఐ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను బుధవారం హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని తెలిపారు. కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కోసం చట్టం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలను అందించాలని కోరారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. వాటిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. మన ఊరు - మన బడి పథకాన్ని అన్ని పాఠశాలల్లోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే చేపట్టిన వాటిలో పనులు చేయాలని తెలిపారు. పనులు నిలిపోయిన పాఠశాలల్లో వాటిని పునరుద్ధరించి నిధులు విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె రమేష్ పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాలకు ఆన్‌లైన్‌లో ప్రవేశాలు కల్పించొద్దు

రాష్ట్రంలోని బీసీ కళాశాలల వసతి గృహాలకు ఆన్‌లైన్ పద్ధతిలో ప్రవేశాలు కల్పించే పద్ధతిని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరం నుంచి బీసీ కళాశాలల వసతిగృహాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలంటూ ఆ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఒక విద్యార్థి ఆన్‌లైన్‌లో హాస్టల్ సీటు కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత మూడు హాస్టళ్లకు ఆప్షన్లు ఇవ్వాలని తెలిపారు. ఎక్కడ సీటు వస్తే అక్కడ చేరాలన్న నిబంధన పెట్టారని పేర్కొన్నారు. దీనివల్ల విద్యార్థులు హాస్టళ్లలో చేరే పరిస్థితి ఉండబోదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు చేయడమంటే హాస్టళ్లను ఎత్తేయాలన్న కుట్ర చేయడమేనని విమర్శించారు. కళాశాలలో అడ్మిషన్ తీసుకున్న ప్రతి విద్యార్థికీ హాస్టల్ సీటు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్ల, సౌకర్యాల్లేని హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించకుండా వాటిని ఎత్తేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. గతంలో లాగానే హాస్టళ్లలో ప్రవేశాలు కల్పించాలని కోరారు.

ఉన్నతంగా వైద్యం

(మొదటిపేజీ తరువాయి)

వైద్యానికి ఉన్న ఎడతెగని సంబంధాన్ని వివరించారు. "మానవజీవితం ఉన్నంత కాలం వైద్యం కూడా తప్పకుండా కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. గతంలో మిడతలదండు బెడద గురించి కేంద్రం హెచ్చరికతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు, అనుభవాలను కేసీఆర్ వివరించారు. " మధ్య ఆసియా నుంచి ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ మీదుగా గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రానికి మిడతల దండు వస్తుంటుంది. ఈ మిడతల దండు హర్యానాలోకి వచ్చి అక్కడి నుంచి మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోకి ప్రవేశించి, ఆదిలాబాద్ సరిహద్దు దాకా విస్తరిస్తూ వస్తున్నది. కేంద్ర ప్రభుత్వం హెచ్చరికతో ఆదిలాబాద్ ఉత్తర భాగాన ఉన్న కలెక్టర్లను, ఎస్పీలను అప్రమత్తం చేసి ప్రజలను, పంటలను కాపాడుకునేందుకు ఫైరింజన్లు, స్ప్రేలతో సన్నద్ధంగా ఉన్నాం. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఒక మహిళా అధికారి, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు ఎంటమాలజిస్టులు పర్యవేక్షణ కోసం వస్తే హెలికాప్టర్ సమకూర్చి సరిహద్దులకు పంపాం. మహారాష్ట్రలోనే మిడతల దండును చంపేయడం వల్ల, అవి మన దాకా రాలేదు. సైన్స్ ఇంతగా అభివృద్ధి చెందిన ఈ కాలంలోనూ ఈ సమస్యకు పరిష్కారం ఎందుకు కనుక్కో లేదని నేను వారిని ప్రశ్నించాను. అందుకు వారు, మిడతలను చంపలేము. నిర్మూలించలేము. అది అసాధ్యమని చెప్పారు. మనిషి 4 లక్షల సంవత్సరాల క్రితం భూమి మీదకు వచ్చాడు. కానీ ఈ మిడతలు, బాక్టీరియాలు, ఇతరత్రా 8 లక్షల సంవత్సరాల క్రితమే ఉద్భవించాయి. అవి నిద్రాణంగా ఉంటాయి. వాటికి వ్యతిరేక చర్యలతో ప్రకోపం చెంది ఇబ్బందులు కలిగిస్తాయని చెప్పారు. కరోనా కూడా అటువంటిదేనా అంటే అటువంటిదే అని వారు బదులిచ్చారు. అయితే ప్రజలను ఎలా రక్షించుకోవాలని ప్రశ్నించాను. ఎక్కడైతే వైద్యారోగ్య వ్యవస్థ పకడ్బందీగా ఉంటుందో అక్కడ తక్కువ నష్టాలు జరుగుతాయని వారిచ్చిన సమాధానంతో ఆరోగ్యశాఖ ప్రాధాన్యతను అర్థం చేసుకున్నాను.." అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు వివరించారు.

" డాక్టర్లు గొప్పవారు. నిరుపేదలు వైద్యానికి వచ్చిన సందర్భంలో బెడ్లు అందుబాటులో లేకుంటే కిందనే బెడ్లు వేసి వైద్యం అందిస్తారు. దాన్ని రోగులను కింద పడుకోబెడుతున్నారు... అంటూ పత్రికలు, జర్నలిస్టులు వక్రీకరణలు చేస్తారు. వైద్యారోగ్యశాఖ అధికారులకు పౌర సంబంధాలపై అవగాహన తక్కువ. దీంతో వారిని విమర్శించే వారే ఎక్కువ. వైద్యం ప్రత్యేక చదువు, అర్హత. మానవతా కోణంలో ఆలోచించాలి. ఎంత ఉన్నత పదవుల్లో ఉన్నవారైనా డాక్టర్ల దగ్గరికి రావాల్సిందే..." అని సీఎం తెలిపారు.

వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు చురుకైన వ్యక్తి అంటూ సీఎం కేసీఆర్ ప్రశంసించారు." వైద్యశాఖ అందించే సేవలు ప్రజల్లోకి పోయేలా పౌర సంబంధాలను పెంపొందించాలి. ప్రజలతో పెనవేసుకున్న విభాగం కాబట్టి వైద్యారోగ్య రంగంలో పౌరసంబంధాలు బాగా పెరగాలి. వైద్యారోగ్య శాఖ ప్రజల బాగు కోసం ఏం చేస్తున్నదనేది ప్రజలకు బాగా తెలిసేలా చర్యలు చేపట్టాలి.

కేసీఆర్ కిట్ల ద్వారా గర్భిణులకు నగదు సాయంతో పాటు, ప్రసవానంతరం ఇచ్చే కిట్లతో ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. గతంలో ప్రభుత్వాస్పత్రుల్లో 30 శాతం ప్రసవాలు జరిగితే, ప్రస్తుతం అవి 70 శాతానికి పెరిగాయి. తద్వారా మహిళల ఆరోగ్యం బాగుంటు న్నది. అనవసరమైన అబార్షన్లు, దుర్మార్గపూరిత చర్య లు కూడా ఉండటం లేదు. సమాజాన్ని కాపాడు కోగలుగుతున్నాం. మాతా మరణాలు, శిశు మరణా లు చాలా తగ్గాయి..." అని కేసీఆర్ చెప్పారు. రాష్ట్రం ఏర్పడే నాటికి నిమ్స్‌లో 900 పడకలుంటే వాటిని 1,500 పెంచుకున్నామని సీఎం కేసీఆర్ తెలిపారు. వాటికి తోడు మరో రెండు వేల పడకల ఆస్పత్రి బ్లాక్ నిర్మించుకుంటున్నామని చెప్పారు. హైదరాబాద్ నాలుగువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రు ల నిర్మాణం, విదేశాలకు పోకుండా ఆధునిక వైద్య సేవలు, టెలిమెడిసిన్ వంటివి విస్తరించామని గుర్తుచేశారు.

కరోనా వంటి పరిస్థితులు ఎదురైతే ఎదుర్కొనేం దుకు సిద్ధంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ప్రయివేటు ఆస్పత్రులు తిరస్కరించిన కరోనా రోగులను గాంధీ ఆస్పత్రి వైద్యులు బతికించారని అభినందించారు. రాష్ట్రంలోని పరిస్థితులకు అను గుణంగా అధ్యయనం చేసి ప్రణాళికలు రూపొందిం చాలని వైద్యులకు సూచించారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం

గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక మాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా లాంఛనంగా ప్రారంభించారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ లబ్ధిదారు లు ఉదయనగర్ కాలనీకి చెందిన పార్వతి, భోళా నగర్‌కు చెందిన పర్వీనమ్మ, ఎంబీటీనగర్‌కు చెందిన శిరీషమ్మ, ప్రతాప్‌నగర్ పంజాగుట్ట తేజస్విని, శ్రీరామ్ నగర్‌కు చెందిన సుజాతమ్మ, అంబేద్కర్‌నగర్ రేణుక మ్మలకు న్యూట్రిషన్ కిట్లను సీఎం అందచేశారు. వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు సీఎం కేసీఆర్‌కు లక్ష్మీనరసింహ స్వామి జ్ఞాపికను అందచేశారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు, మంత్రులు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజ్యసభ సభ్యులు కె.కేశవరావుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డీసెట్‌లో 3,975 మంది ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల
- 72 డీఈఐఈడీ కాలేజీల్లో 4,750 సీట్లు : కన్వీనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో 2023-25 బ్యాచ్ ప్రవేశాల కోసం నిర్వహించిన డీసెట్-2023 రాతపరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ మేరకు డీసెట్ కన్వీనర్ ఎస్ శ్రీనివాసాచారి ఒక ప్రకటన విడుదల చేశారు. డీసెట్‌కు మొత్తం 6,485 మంది దరఖాస్తు చేస్తే, 5,150 మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. వారిలో 3,975 (77.18 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని వివరించారు. అబ్బాయిలు 1,058 మంది దరఖాస్తు చేయగా, 837 మంది పరీక్ష రాశారని తెలిపారు. వారిలో 712 (85.06 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని పేర్కొన్నారు. 5,427 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 4,313 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.

వారిలో 3,263 (75.65 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. తెలుగు మాధ్యమానికి 2,575 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, 2,043 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో 1,551 (75.91 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. తెలుగు మాధ్యమంలో 73 మార్కులు సాధించిన బాలిన మాధవరావు ప్రథమ ర్యాంకు సాధించారని వివరించారు. ఇంగ్లీష్ మీడియంకు 3,213 మంది దరఖాస్తు చేయగా, 2,495 మంది పరీక్ష రాశారని తెలిపారు. వారిలో 2,114 (84.72 శాతం) మంది ఉత్తీర్ణత పొందారని పేర్కొన్నారు. ఇందులో 73 మార్కులు సాధించిన షేక్ ముస్తాక్ పాషా అగ్రస్థానంలో నిలిచారని వివరించారు. ఉర్దూ మాధ్యమానికి 697 మంది దరఖాస్తు చేయగా, 612 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో 310 (50.65 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఇందులో 58 మార్కులు సాధించిన జావెరియా ఫిర్దోస్ ప్రథమ ర్యాంకు పొందారని వివరించారు. ఫలితాల కోసం www. deecet. cdse. telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలో 72 డీఈఐఈడీ కాలేజీల్లో 4,750 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందులో పది ప్రభుత్వ కాలేజీల్లో తెలుగు మాధ్యమంలో 500 సీట్లు, ఉర్దూ మాధ్యమంలో 400 సీట్లు, ఇంగ్లీష్ మాధ్యమంలో 500 సీట్లు కలిపి మొత్తం 1,400 సీట్లున్నాయని వివరించారు. 62 ప్రయివేటు కాలేజీల్లో తెలుగు మాధ్యమంలో 1,750 సీట్లు, ఉర్దూ మాధ్యమంలో వంద సీట్లు, ఇంగ్లీష్ మాధ్యమంలో 1,500 సీట్లు కలిపి మొత్తం 3,350 సీట్లున్నాయని తెలిపారు.

డీసెట్ ఫలితాల వివరాలు

	దరఖాస్తు	హాజరు	ఉత్తీర్ణత	శాతం
ఎస్సీ	1,276	977	977	100
ఎస్టీ	1,341	1,101	1,101	100
బీసీ	3,475	2,755	1,686	61.19
ఇతరులు	393	317	211	66.56
మొత్తం	6,485	5,150	3,975	77.18


డ్రగ్స్ విక్రయిస్తున్న సినీ నిర్మాత కృష్ణ ప్రసాద్ అరెస్ట్

నవతెలంగాణ-రాజేంద్రనగర్

గోవా నుంచి డ్రగ్స్ తీసుకుని వచ్చి, నగరంలో అమ్ముతున్న సినీ నిర్మాత కృష్ణ ప్రసాద్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్టు రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. డీసీపీ జగదీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బోనకల్ మండలానికి చెందిన సుంకర కృష్ణ ప్రసాద్ చౌదరి 2016లో కబాలి సినిమాని నిర్మించారు. అదేవిధంగా తెలుగులో సర్దార్, గబ్బర్ సింగ్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, అర్జున్ సినిమాలకు డిస్ట్రిబ్యూటర్‌గా పని చేశారు. ఆ సినిమాల్లో భారీగా నష్టాలు రావడంతో అతడు గోవాలో ఒక క్లబ్బు స్థాపించాడు. అక్కడ కూడా నష్టాలు రావడంతో తిరిగి హైదరాబాద్‌కు వచ్చాడు. అయితే గోవాలో క్లబ్ నిర్వహించే సమయంలో అక్కడ నైజీరియాలతో పరిచయం ఏర్పడి డ్రగ్స్ తీసుకోవడం అలవాటు చేసుకున్నాడు. అయితే కొంతకాలం నుంచి గోవా నుంచి గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ తీసుకొని వచ్చి నగరంలోని ఇతర వ్యక్తులకు అమ్ముతున్నాడు. బుధవారం అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం కృష్ణ ప్రసాద్ కిస్మత్పూర్‌లో డ్రగ్స్ విక్రయిస్తుండగా మాదాపూర్, రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇతని వద్ద నుంచి 90 ప్యాకెట్లు కలిగిన 82.75 గ్రాముల కొకైన్, నాలుగు సెల్ ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

ఇండ్లకోసం పోరాటాలు ఉధృతం

- మహబూబాబాద్‌లో ప్రభుత్వ దమనకాండను ఖండిస్తున్నాం : వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు జీ నాగయ్య



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలనీ, నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలందరికీ తక్షణమే ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీ నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకోసం తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక అధ్వర్యంలో జూన్ 18 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగే బస్సుయాత్ర కరపత్రాలను హైదరాబాద్‌లోని ఎమ్‌బీ భవన్ ఆవిష్కరించారు. మహబూబాబాద్‌లో పేదల గుడిసెలు కూల్చివేసి, 8 గంటలకు పైగా ప్రభుత్వ శాఖల అధికారులు దమనకాండ జరపడాన్ని తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగం ప్రకారం జీవించేహక్కు అందరికీ ఉందనీ, దానిలో సొంత ఇల్లు కూడా భాగమేనని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడంలో తీవ్రంగా వైఫల్యం చెందాయన్నారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లో 61 కేంద్రాల్లో 48 వేల మంది పేదలు ఇండ్లు వేసుకొని నివాసముంటున్నారనీ, వారందరినీ అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీజీ నర్సింహ్మా రావు (పట్నం రాష్ట్ర కన్వీనర్), ఆర్.వెంకట్రాములు (వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి),టి.స్కైలాబ్ బాబు (కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి), ఆర్.అరుణజ్యోతి (ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు), ఆర్.శ్రీరాం నాయక్ (గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి), కోట రమేష్, ఆనగంటి వెంకటేష్(డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు), జి.నరేష్ (వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు) పాల్గొన్నారు.

కౌన్సిలింగ్ ఎప్పుడు?

హైదరాబాద్ వదలని నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ -1

- ఉన్నతాధికారుల అండగా జూనియర్లపై ఒత్తిడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారు బదిలీ కావాలి. ఎక్కడి నుంచైతే డిప్యూటేషన్‌పై తిరిగి అక్కడికి వెళ్లిపోవాలి. అయినా సరే...ఏండ్ల తరబడి హైదరాబాద్ ఆస్పత్రుల్లో తిష్ట వేసుకుని కూర్చున్నారు. వారిని అక్కడి నుంచి పంపిస్తే తప్ప అర్హత కలిగిన తమకు పదోన్నతులు లభించే అవకాశం లేకపోవడంతో కిందిస్థాయిలో ఉద్యోగులు నష్టపోతున్నారు. ఇదే విషయంపై పదే పదే ఉన్నతాధికారులకు విన్నవించుకుంటున్నా ఫలితం లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాల తరబడి తామందించిన సేవలకు తగిన ప్రతిఫలం లభిస్తుందా? అని ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ తదితర ఆస్పత్రుల్లో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1గా విధులు నిర్వహిస్తున్న వారిలో ఎక్కువ మంది ఏండ్లతరబడి ఒకే ఆస్పత్రిలో విధులు నిర్వహి స్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఆయా ఆస్పత్రుల్లో పట్టు సంపాదించి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్యూటీల విషయంలో సీనియర్లను, తమ వారికి సులువైన పనులు చెబుతూ జూనియర్లపై పనిభారం మోపుతున్నారని సమాచారం. తమ చెప్పుచేతల్లోకి రాని వారిని తమ అదుపులోకి తెచ్చుకునేందుకు వేధింపులకు కూడా పాల్పడుతున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం ఈ ఏడాది ఐదున సీనియార్టీ లిస్టును విడుదల చేసింది. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ 2 నుంచి గ్రేడ్ 1గా పదోన్నతి పొందేందుకు అర్హత కలిగిన వారి జాబితా ఇది. ఇందులో మల్టీ జోన్-1 నుంచి ఏడుగురు, మల్టీ జోన్ -2 నుంచి 13 మంది ఉన్నారు. అయితే ఇప్పటి వరకు కౌన్సిలింగ్ తేదీలను ప్రకటించక పోవడంతో పరిస్థితిలో మార్పు రావడం లేదు. కౌన్సిలింగ్ జరిగితే మల్టీ జోన్-2లో ఎవరైతే గ్రేడ్ -1గా డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారని అది రద్దయి తిరిగి మల్టీ జోన్ -1కి పంపించాల్సి ఉంటు ంది. అదే విధంగా దీర్ఘకాలంగా ఒకే చోట గ్రేడ్-1 గా కొనసాగుతున్న వారిని వేరే వైద్యశాలలకు బదిలీ చేసి వేకెన్సీ జాబితా పెట్టాల్సి ఉంటుంది. ఇది ఇష్టం లేనీ, హైదరాబాద్ వదిలి వెళ్లడం ఇష్టం లేని కొంత మంది కారణంగానే కౌన్సిలింగ్ జాప్యం చేస్తున్నారనే సీనియర్టీ లిస్టులో ఉన్నవారు అనుమానం వ్యక్తమవుతున్నది. హైదరాబాద్‌లోని ఆయా ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్న గ్రేడ్-1 సూపరింటెండెంట్లలో ఐదేండ్ల నుంచి 13 ఏండ్ల వరకు ఒకే చోట పని చేస్తున్న వారుండటం గమనార్హం. గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ అంటే గెజిటెడ్ హోదా. ఈ హోదా కలిగిన వారిని ప్రతి మూడేండ్లకొకసారి స్థానచలనం చేయాల్సి ఉన్నప్ప టికీ కొంత మంది స్వార్థప్రయోజనాల కారణంగా ఒకే చోట కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా కౌన్సిలింగ్ నిర్వహించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

నూతన పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలి

- పెండింగ్ డీఏలను ప్రకటించాలి
- ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టాలి : సీఎస్‌కు టీఎన్జీవో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నూతన పే రివిజన్ కమిటీ (పీఆర్సీ)ని వెంటనే ఏర్పాటు చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ నేతృత్వంలో బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో నూతన పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని తెలిపారు. లేదంటే ఆదేశించి మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. దాదాపు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయడం కోసం ఉద్యోగుల చందాతో ఈహెచ్‌ఎస్ సొసైటీని వెంటనే ఏర్పాటు చేయాలని, చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

'మట్టి' దొంగలు

యథేచ్ఛగా దోపిడీ.. • నిద్రావస్థలో మైనింగ్, రెవెన్యూ యంత్రాంగం


కటాక్షపూర్ చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు

నవతెలంగాణ- వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అక్రమ మైనింగ్ దందా నిత్యకృత్యంగా మారింది. అనుమతులుండవు.. ఒకవేళ అనుమతులున్నా, అనుమతించిన దాని కంటే పెద్ద ఎత్తున మైనింగ్ చేస్తూ కోట్ల రూపాయలు అక్రమార్కులు దండుకుంటున్నారు. ఇంత పెద్ద ఎత్తున మొరం దందా జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. అదేమంటే పర్మిట్ ఉందని చెబుతారు.. ఎన్ని క్యూబిక్ మీటర్లకు అనుమతి ఉంది.. ఎన్ని క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించారో తేల్చని పరిస్థితి. ఈ మైనింగ్ దందాలో మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోక పోవడం శోచనీయం.

హన్మకొండ, ములుగు జిల్లాల పరిధి ఒగ్లాపూర్-ములుగు గట్టమ్మతల్లి గుట్ల వరకు రూ.208 కోట్ల అంచనాతో జాతీయ రహదారి-163కు సంబంధించి 4 వరుసల రహదారి నిర్మాణపు పనులను 'వృద్ధి ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్' కంపెనీ దక్కించుకుంది. మరో రూ.92 కోట్లు జీఎస్టీ, భూనిర్వాసితులకు పరిహారానికి కేటాయించారు. దామెర బైపాస్ నుంచి ఆత్మకూరు వరకు 9 కిలోమీటర్లు, నీరుకుల్ల-ములుగు గట్టమ్మ తల్లి గుట్ట వరకు 21 కిలోమీటర్ల మేరకు మొత్తం 30 కిలోమీటర్లు 4 వరుసల రహదారిని నిర్మించాల్సి ఉంది. రోడ్డు విస్తరణ, కల్వర్టుల విస్తరణతోపాటు రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను ఈ కంపెనీ 2024 జులైలోపు పూర్తి చేయాల్సి ఉంది. ఈ రహదారి పనులకు దామెర మండలం వెంకటాపురం, ఆత్మకూరు మండలం కటాక్షపూర్ చెరువు నుండి పెద్ద ఎత్తున మొరం తవ్వకాలు జరిపి రహదారి నిర్మాణానికి వినియోగిస్తున్న మట్టిని అక్రమంగా దోపిడీ చేస్తోంది. అధికారులు ఇచ్చిన అనుమతులకు భిన్నంగా అధికంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నా మైనింగ్, రెవెన్యూ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. పైగా అధికారులు ఇచ్చే వివరణలు సైతం హాస్యాస్పదంగా ఉన్నాయి.

కటాక్షపూర్ చెరువులో ప్రమాదకరంగా తవ్వకాలు

ఈ జాతీయ రహదారి సమీపంలోని ఆత్మకూరు మండలం కటాక్షపూర్ చెరువులో వృద్ధి కంపెనీ అక్రమంగా మొరం తవ్వకాలు జరిపింది. రెవెన్యూ అధికారులు వృద్ధి కంపెనీకి 14 వేల మెట్రిక్ టన్నుల మొరం తవ్వకానికి తాత్కాలిక అనుమతినిచ్చారు. సదరు కంపెనీ దామెర మండలం వెంకటాపురం గ్రామ పరిధిలో 25,419 మెట్రిక్ టన్నుల మొరాన్ని అక్రమంగా తవ్వి రహదారి నిర్మాణంలో వినియోగించారు. 11,419 మెట్రిక్ టన్నుల మొరాన్ని అక్రమంగా తవ్వి తరలించినందుకు కంపెనీకి రూ.15.52 లక్షల జరిమానాను మైనింగ్ శాఖ విధించింది. కాగా, జాతీయ రహదారికి అత్యంత సమీపంలో చెరువులో ఈ తవ్వకాలు జరపడంతో చెరువులో లోతు పెరిగింది. వర్షాలు పడితే ఈ అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతంలో లోతు తెలియక చిన్నారులు, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. నీటిపారుదల శాఖ, రెవెన్యూ, మైనింగ్ శాఖలు చోద్యం చూస్తుండటంతో పెద్ద ఎత్తున చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపారు. ఈ విషయంలో జిల్లాస్థాయి అధికారులు సైతం ప్రేక్షకపాత్ర పోషించడం అనుమానాలకు తావిస్తుంది. మైనింగ్ దొంగలు ప్రకృతిని విధ్వంసం చేస్తూ కోట్లాది రూపాయలను సంపాదిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇప్పటికైనా ఈ మట్టి దొంగలను కనిపెట్టి శిక్షించాలని, అక్రమ మైనింగ్ దందాను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.



క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లను రెగ్యులరైజ్ చేయాలి

- విద్యాశాఖ ఉద్యోగ నోటిఫికేషన్‌ల్లో 30 శాతం వెయిటేజ్ కల్పించాలి : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ - అడిక్ మెట్

క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సమగ్ర శిక్షా క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షాలో విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారు నిత్యం రవాణా చేయడానికి రవాణా చార్జీలు కూడా చెల్లించడం లేదని తెలిపారు. సమగ్ర శిక్షాలో విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లను రెగ్యులేషన్ చేసి వారికి రవాణాచార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ ఉద్యోగ నోటిఫికేషన్‌లో 30 శాతం వెయిటేజ్ కల్పించాలన్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి క్లస్టర్ రిసోర్స్ పర్సన్ 18 నుంచి 25 పాఠశాలలను ప్రతి నెలా సందర్శిస్తున్నందుకు రవాణాచార్జీలు, ఫోన్ బిల్, నెట్ బిల్ రూపంలో నెలకు రూ. 5000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంపాదిత సెలవులు మినహా ఆరు నెలల ప్రసూతి సెలవులు, సమగ్ర శిక్షా ఉద్యోగులందరికీ అమలు చేయాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ.. తెలంగాణలో రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్య పెరిగింది కావున క్లస్టర్‌ల సంఖ్య పెంచాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ కల్పించాలని కోరారు. ఈ ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగుల సహదేవ్, కోశాధికారి రవీందర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కంచర్ల మహేందర్, కార్యదర్శులు జానకిరామ్, కంబాల సుధాకర్, ఉపాధ్యక్షులు చందు, పాషా, చంద్రశేఖర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కుల గణన కోసం ఉద్యమించాలి

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఓబీసీఎస్‌ఏ) ఆధ్వర్యంలో రూపొందించిన కుల గణన కోసం లక్ష పోస్టు కార్డుల ద్వారా పది లక్షల ట్వీట్‌లతో మహా ఉద్యమాన్ని తీసుకురావాలనే ఉద్దేశంతో 'కుల గణన కోసం ఉద్యమిద్దాం' అనే వాల్ పోస్టర్‌ను హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు కిరణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్, తెలంగాణ సాగర సంగం అధ్యక్షుడు శేఖర్ సాగర్, తెలంగాణ గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, మహబూబ్‌నగర్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాజేంద్ర ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీసీసీఐ, క్యూసీఎఫ్ఐ

- సమర్థతను, నాణ్యతే లక్ష్యంగా భాగస్వామ్య ఒప్పందాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) 106 ఏండ్ల ట్రేడ్, కామర్స్, ఇండస్ట్రీ బాడీ, 41 ఏండ్ల క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా మంగళవారం రాత్రి వరకు జరిగిన ఒక కార్యక్రమంలో ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

రెండు సంస్థలు, తమ తమ రంగాల్లో సహకారాన్ని పెంపొందించడానికి, నాణ్యతను, సమర్థతను, శ్రేష్ఠతను పెంచుకోవడానికి కలిసి వచ్చాయి. ఎఫ్‌టీసీసీఐ తరపున ప్రెసిడెంట్ అనిల్ అగర్వాల్, క్యూసీఎఫ్ఐ తరపున డైరెక్టర్ బొడ్డపాటి శ్రీనివాస్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మీలా జయదేవ్, వైస్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్ సింఘాల్ సమక్షంలో పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. అవగాహనా ఒప్పందాన్ని సంతకం చేయడం సహకారం, నాణ్యతను, సమర్థతను ప్రోత్సహించడంలో ఒక ముఖ్యమైన అడుగు అని ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ అనిల్‌అగర్వాల్ అన్నారు. భవిష్యత్తుకు నాణ్యతే ఏకైక మార్గమని అన్నారు. ఇది సంస్థకు అధిక ఆదాయాలు, ఉత్పాదకతను నిర్ధారిస్తుందన్నారు. నాణ్యత వ్యర్థాలు, ఖర్చులు నష్టాలను తగ్గించడంలో సహాయపడుతుందని చెప్పారు. నాణ్యత ఖ్యాతిని, బ్రాండ్ విలువను పెంపొందించడానికి సహాయపడుతుందని వివరించారు. జులై 17 నుంచి 19 వరకు 'నాణ్యత, విశ్వసనీయత కోసం బెంచ్‌మార్కింగ్' కార్యక్రమాన్ని నిర్వహించబోతోందన్నారు. క్యూసీఎఫ్ఐ లాభాపేక్ష లేని, రాజకీయ రహిత, జాతీయ వృత్తిపరమైన సంస్థ అని, మానవ ప్రయత్నంలోని ప్రతి రంగంలో చురుకైన ప్రమేయం, భాగస్వామ్యం కోసం వాతావరణాన్ని సృష్టించే ఉద్దేశ్యంతో ఏర్పడిన సంస్థ అని బొడ్డపాటి శ్రీనివాస్ అన్నారు. ప్రజల మొత్తం నాణ్యతను అభివృద్ధి చేయడానికి అవసరమైన, అంతర్భాగంగా జీవన నాణ్యతను మెరుగుపరచడానికి పరిధిని విస్తరిస్తుందన్నారు. ఎఫ్‌టీసీసీఐ సీఈఓ, ఖ్యాతి నర్వానే, స్కిల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ అంకిత్ భట్నాగర్, సీనియర్ ఫ్యాకల్టీ సీవీ.రమణ, క్యూసీఎఫ్ఐ టోటల్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సీఓఓ సునీల్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు, విద్యాలయాల అభివృద్ధి, శాంతిభద్రతలకు ప్రాధాన్యం

త్వరలోనే మల్కపేట జలాశయాన్ని ప్రారంభిస్తాం : ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్


సిరిసిల్ల 02 శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ టీటీడీ ఆలయ చైర్మెన్ వైవి సుబ్బారెడ్డి

నవతెలంగాణ - సిరిసిల్ల

రాష్ట్రంలో విద్యాలయాలను ఎంత అభివృద్ధి చేస్తున్నామో దేవాలయాలను, పోలీసింగ్, శాంతి భద్రత వ్యవస్థను కూడా అదే పద్ధతిలో అభివృద్ధి చేస్తూ ప్రజలకు చేరువ చేస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ పున్ణనిర్మాణ పనులకు బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మెన్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి శంకుస్థాపన, భూమిపూజ చేశారు. అనంతరం సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 80సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. టీటీడీ ఆర్థిక సహకారంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రసిద్ధ దేవాలయాలకు పూర్వ వైభవం తేవచ్చని రిక్వెస్ట్ చేసిన వెంటనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మెన్ వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. ఫలితంగా ఇప్పుడు సిరిసిల్లలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. గంభీరావుపేటలో కేజీ టూ పీజీ క్యాంపస్‌ను అభివృద్ధి చేసిన మాదిరిగానే తెలంగాణలోని 26వేల ప్రభుత్వ పాఠశాలలను 'మన ఊరు-మనబడి' కార్యక్రమం కింద అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. మండు వేసవిలో చెరువులు, కుంటలు, నదులు జలకళను సంతరించుకున్నాయని, సీఎం కేసీఆర్ సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర సస్యశ్యామలమైదన్నారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనారిటీలతో పాటు బ్రాహ్మణ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అణగారినవర్గాలనే కాదు అగ్రవర్ణ పేదలను కూడా ప్రభుత్వం కడుపులో పెట్టుకుంటుందని స్పష్టం చేశారు.

20రోజుల్లో మల్కపేట జలాశయాన్ని సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. మల్కపేట జలాశయంతో ఎల్లారెడ్డి పేట శాశ్వతంగా సస్యశ్యామలం అవుతుందన్నారు. దేశ జనాభాలో 3శాతం జనాభా కలిగిన తెలంగాణ.. కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు అందించే జాతీయ అవార్డుల్లో 30శాతం సాధించిందన్నారు. పట్టణాలు కూడా అదే బాటలో నడుస్తూ 25 అవార్డులు అందుకున్నాయని తెలిపారు. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేటలో ఆలయాల పున్ణ నిర్మాణానికి సహకరించిన టీటీడీ గంభీరావుపేట సీతారామ ఆలయం పున్ణ నిర్మాణానికి కూడా ఆర్థిక సహాయం అందజేయవలసిందిగా కోరగా టీటీడీ చైర్మెన్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. టీటీడీ చైర్మెన్ వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. నాలుగేండ్లుగా బడుగు, బలహీన వర్గాలు, గిరిజనులు ఉండేచోట పెద్ద ఎత్తున ఆలయాలను నిర్మిస్తున్నామన్నారు.

కరీంనగర్‌లో రూ.20కోట్లతో శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. తొమ్మిదేండ్లలో తెలంగాణ రూపురేఖలు మారాయని కొనియాడారు.

భూ ఆక్రమణదారులను వదిలి గుడిసె వాసులపై ప్రతాపమా?

పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు నిర్మించే వరకు పోరాటం: సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ-అశ్వారావుపేట

నిలువ నీడ లేని నిరుపేదలకు స్థలాలు ఇచ్చి, గృహాలు నిర్మించి ఇవ్వాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలను ధ్వంసం చేస్తూ అరాచకాలను సాగిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ 14 నుంచి 16 వరకు స్థానిక లహరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే రాజకీయ శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచికగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన రావు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం.. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్.. ఉద్యమంలో భాగస్వాములై పలు అనారోగ్య కారణాలతో మృతి చెందిన నాయకులు, కార్యకర్తలకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఈ తరగతుల్లో వీరయ్య "రాజకీయ పరిస్థితులు" అనే అంశాన్ని రైతు ప్రతినిధులకు బోధించారు.

ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో 26 జిల్లాల్లో 6 పోరాట కేంద్రాల్లో వేలాది మంది పేదలు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కోసం పోరాటం చేస్తుంటే.. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కైన రెవెన్యూ, పోలీస్ అధికారులు పేదలు గుడిసెలను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్‌లో సోమవారం తెల్లవారుజామున 4 గంటలు నుంచి మంగళవారం మధ్యాహ్నం 2 గంటలు వరకు గుడిసెలు కూల్చే పనిలో ప్రభుత్వ అధికారులు తలమునకలు అయ్యారన్నారు. ఏండ్ల తరబడి ప్రభుత్వ భూములను ఆక్రమించిన పెద్దలను వదిలేసి పేదలు గుడిసెలు కూల్చడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పథకం ద్వారా పేదలకు గృహాలు నిర్మించి ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అవి సఫలం కాలేదని అన్నారు. 58 జీఓ ప్రకారం స్వాధీనంలో ఉన్న భూములకు ఇంటి పట్టాలు ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్, 59 జీఓ తెచ్చి తిరిగి ధనవంతులకే మేలు చేస్తున్నారని విమర్శించారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధించే వరకు పోరాటం చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక నిర్ణయించిందని చెప్పారు. ఆ మేరకు ఈ నెల 19 నుంచి 24 వరకు పేదలతో వ్యక్తిగతంగా తహసీల్దార్‌కు దరఖాస్తులు చేయించడం, ధర్నాలు చేపడతామని తెలిపారు. ఈనెల 18 నుంచి 21 వరకు బస్సు యాత్ర చేపట్టి పేదలను సమీకరించి పోరాటాలకు సన్నద్ధం చేస్తామని ప్రకటించారు. చివరిగా జులై 3న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు మహాధర్నా నిర్వహించి పేదలు గొంతుకగా ప్రభుత్వానికి మొరవినిపిస్తామన్నారు. అనంతరం "రైతు ఉద్యమం" అనే అంశం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన రావు బోధించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య, మాదినేని రమేష్, వి వెంకటేశ్వర్లు, శెట్టి వెంకన్న, సహాయ కార్యదర్శులు కందాల ప్రమీల, బొంతు రాంబాబు, డి.బాల్ రెడ్డి, ఎం శ్రీనివాస్, బాలరాజు గౌడ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొక్కిరపాటి పుల్లయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యలమంచిలి వంశీ క్రిష్ణ, అన్నవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లో స్నానానికి వెళ్లి.. ఇద్దరు చిన్నారులు మృతి

నవతెలంగాణ - ఓదెల/జమ్మికుంట

చెక్‌డ్యామ్‌లో స్నానానికి వెళ్లి ఇద్దరు చిన్నారులు మృతిచెందిన విషాదకర సంఘటన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో బుధవారం జరిగింది. స్థానికులు, పొత్కపల్లి ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికి చెందిన జూపాక అశోక్ కుమారుడు సాత్విక్, కాసర్ల సునీల్ కూతురు నిత్యశ్రీ వేసవి సెలవులకు వీణవంక మండలం కొండపాక గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి



వెళ్లారు. బుధవారం ఈ ఇద్దరు పిల్లలతో పాటు మరో నలుగురు పిల్లలు పొత్కపల్లి శివారులోని మానేరు చెక్‌డ్యామ్‌లో స్నానానికి వెళ్లారు. కాగా సాత్విక్(14), నిత్యశ్రీ(12) నీటిలోతు ఎక్కువ ఉన్న ప్రాంతంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న పొత్కపల్లి ఎస్ఐ రామకృష్ణ వెంటనే తన సిబ్బందితో చెక్ డ్యామ్‌కు చేరుకొని మునిగిన స్థలంలో వెతికించి చిన్నారులను బయటకు తీసి పోలీసు వాహనంలో హాస్పిటల్ తరలించారు. చిన్నారులను పరీక్షించిన డాక్టర్లు.. వారు మృతిచెందినట్టు ధృవీకరించారు. చిన్నారుల మృతితో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. పాప తల్లి కాసర్ల వందన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ

పదేండ్లుగా పెరగని ఆర్టీసీ కార్మికుల వేతనాలు

- రెండో వేతన సవరణలు 2017, 2021 వెంటనే అమలు చేయాలి
- కొత్త సంస్కరణల పేరుతో సంస్థను నిర్వీర్యం చేస్తున్న ఎండీ : టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్




నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు రెండవ వేతన సవరణలు 2017, 2021 జరగకపోవడంతో పదేండ్లుగా ఆర్టీసీ కార్మికులకు వేతనాలు పెరగడం లేదని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే హనుమంతు ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. వేతన సవరణ చేసి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీఎస్‌ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి బస్సు భవన్ వరకు ర్యాలీ చేపట్టి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల పట్ల సీఎం కేసీఆర్ అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆర్టీసీలో యూనియన్లను నియంత్రించి కార్మికులతో 14 గంటల డ్యూటీ చేయిస్తున్నారని, దాంతో పని భారం పెరిగి అనేకమంది కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెరుగుతున్న జనాభా కనుగుణంగా ప్రజా రవాణా మెరుగుపరచడం కోసం బస్సు డిపోల సంఖ్య పెంచాల్సి ప్రభుత్వం.. డిపోలను తగ్గించడం రాచరిక పాలనకు నిదర్శనమన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో యూనియన్లను అనుమతించి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కార్మిక సమస్యలపై ఏ రోజూ దృష్టి పెట్టలేదని, పైగా కొత్త కొత్త సంస్కరణల పేరుతో సంస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. మహిళా కార్మికులకు రాత్రి 8 గంటలకు డ్యూటీలు ముగించే విధంగా ప్రతి డిపోలో డ్యూటీలు వేయాలన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన వర్కర్స్ యూనియన్ నాయకులు సుద్దాల సుధాకర్, రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ డి.వి.కె.రావు, అడ్వైజర్ కృష్ణ, జాయింట్ సెక్రటరీ స్వాములయ్య, కోశాధికారి పీఎస్ఎస్ రావు, హైదరాబాద్ రీజినల్ సెక్రటరీ రాజయ్య, మహిళా నాయకులు సత్యవతి, బుల్లెట్ పాండు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల సరఫరా ముఠా అరెస్టు

- రూ.1.60 కోట్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- ముగ్గురు అరెస్ట్, ఒకరు పరారీ : ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడి



నవతెలంగాణ-నల్లగొండ

నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేసే ముఠాను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. కోటీ 80 లక్షల విలువ గల నకిలీ పత్తి విత్తనాలు, ఎర్టిగా కారు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ అపూర్వరావు తెలిపారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. బుధవారం తెల్లవారుజామున ఎస్ఐ డీ.సైదాబాబు, ఎస్ఐ విజయ్ కుమార్, ఎస్ఐ ఈ.రవి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పక్కా సమాచారంతో నార్కట్‌పల్లి ఫ్లై ఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా వస్తున్న ఎర్టిగా కార్‌ను ఆపి తనిఖీ చేశారు. అందులో రెండు విడి విత్తనాలు కలిగిన బస్తాలను పట్టుకొని వ్యవసాయ అధికారులను పిలిపించి చెక్ చేయించారు. అవి నకిలీ పత్తి విత్తనాలని తెలపగా వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. గోరంట్ల నాగార్జున, గడ్డం రవీంద్రబాబు, మెరిగే వేణు.. కర్నాటకలోని కొంత మంది రైతుల దగ్గర నుంచి పత్తి విత్తనాలు తక్కువ ధరకు కొనుగోలు చేసి గుంటూరు జిల్లా దాచేపల్లి దగ్గర స్టోరేజ్ చేసి అక్కడ నుంచి మహారాష్ట్రలోని నాగపూర్‌కి చెందిన రైతులకు ఎక్కువ ధరకు అమ్మేందుకు తరలిస్తుండగా పోలీసులకు చిక్కారు. నలుగురి నిందితుల్లో ముగ్గురిని రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లాకు చెందిన నరసింహ పరారీలో ఉన్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన నల్లగొండ డీఎస్పీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో చిట్యాల సీఐ శివరామ్‌రెడ్డి, నార్కెట్‌పల్లి ఎస్ఐ సైదాబాబు, చిట్యాల ఎస్ఐ రవి, ఎస్ఐ విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ సురేందర్, కానిస్టేబుల్స్ శివ శంకర్, గిరిబాబు, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కడుపులోనే క్లాత్

- ఆపరేషన్ చేసి మరిచిపోయిన డాక్టర్లు
- సంవత్సరం కాలంగా ఇబ్బంది పడ్డ రోగి
- సాయి రక్ష హస్పిటల్ నిర్వాకం



నవతెలంగాణ-నల్లగొండ

అనారోగ్యంతో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరిన మహిళకు ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేసి కడుపులో క్లాత్‌ను వదిలేసి కుట్లు వేసి డిశ్చార్జ్ చేశారు. దాంతో ఆ మహిళకు కడుపులో ఇన్ఫెక్షన్ పెరిగి సంవత్సర కాలంగా తీవ్ర ఇబ్బంది పడింది. ఇటీవల ఆమెకు కడుపునొప్పి విపరీతంగా పెరగడంతో హైదరాబాద్‌లోని కామినేనిలో చేరింది. ఆ మహిళకు స్కానింగ్ చేయగా.. కడుపులో క్లాత్ ఉన్నట్టుగా గుర్తించారు. ఈ నిర్వాకం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సాయి రక్ష హస్పిటల్‌లో జరిగిందని డాక్టర్ల ద్వారా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెళితే.. మునుగోడుకు చెందిన వసంత ఏడాది కిందట జిల్లా కేంద్రంలోని సాయి రక్ష హాస్పిటల్‌లో అనారోగ్యంతో చేరింది. దాంతో ఆస్పత్రి డాక్టర్లు మహిళకు ఆపరేషన్ చేశారు. ఆసమయంలో కడుపులో క్లాత్ మర్చిపోయారు. హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత వసంత మరోసారి తీవ్ర అనారోగ్యానికి గురై ఏడాది కాలంగా కడుపునొప్పితో బాధపడుతూనే ఉంది. అయితే రెండు రోజుల క్రితం సమస్య తీవ్రతరం కావడంతో హైదరాబాద్ కామినేనిలో చేర్పించగా డాక్టర్లు వసంత కడుపులో క్లాత్ ఉండటం ద్వారా ఇన్ఫెక్షన్ అయ్యిందని, వెంటనే ఆమెకు అపరేషన్ చేసి క్లాత్‌ను బయటకు తీశారు. కాగా, పేషెంట్ ప్రాణాలతో చెలగాటమాడిన సాయిరక్ష హస్పిటల్‌ను సీజ్ చేయాలంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భానుడి భగభగలు - మరోవైపు సాగుకు అన్నదాతలు సమాయత్తం

ఏటేటా పెరుగుతున్న అన్నదాతల కష్టాలు

నవతెలంగాణ - బోనకల్



జూన్ మాసం సగం నిండినా ఒకవైపు భనుడు భగభగ అంటూనే ఉన్నాడు. వాతావరణ శాఖ అధికారులు జూన్ మొదటి వారంలో రెండు తెలుగు రాష్ట్రాలలో నైరుతి రుతుపవనాలు వస్తాయని ప్రకటించారు. దీంతో అన్నదాతలు తమ పొలాలను దుక్కుల దున్ని విత్తనాలు నాటేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. కానీ మరొకవైపు భానుడు ప్రతాపం మాత్రం ఆగటం లేదు. రోజురోజుకీ భానుడి ప్రతాపం తీవ్ర రూపం దాల్చుతూనే ఉంది. కానీ జూన్ మాసంలో పత్తి విత్తనాలను నాటు వలసి ఉంది. కానీ జూన్ మాసం సగం ఇప్పటికే పూర్తయిపోయింది. దీంతో అన్నదాతలు ఒకవైపు ఆందోళన చెందుతూనే ఉన్నారు. ప్రతి సంవత్సరం అన్నదాతలను ప్రభుత్వ విధానాలు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతునే ఉన్నారు. అయినా అన్నదాతలు వెరవకొండ ఈ సంవత్సరమైనా పంటలు కలిసి వస్తాయేమో అని ఆశతో వ్యవసాయం చేస్తూనే ఉన్నారు. ఈ సంవత్సరం వానాకాలంలో ప్రధాన పంటల సాగు వివరాలు మండల వ్యవసాయ శాఖ అధికారుల అంచనా వివరాలు ఇలా ఉన్నాయి.పత్తి 18,500 ఎకరాలలో, వరి 6,100 మొక్కజొన్న 60, కంది 80, పెసర 350, మిరప 2840 ఎకరాలలో సాగు చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. మండల వ్యాప్తంగా 27,930 ఎకరాలలో వివిధ రకాల పంటలను సాగు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అధికంగా 472 ఎకరాలలో పత్తి పంట సాగు విస్తీర్ణం పెరగనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా వరి కూడా గత సంవత్సరం కంటే ఈ ఏడాది 303 ఎకరాలలో సాగు విస్తీర్ణం పెరగనున్నట్లు అధికారులు అంచనా వేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది వానాకాలంలో 1,421 ఎకరాలలో వివిధ రకాల పంటల సాగు విస్తీర్ణం పెరగనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ వ్యవసాయం ప్రారంభించిన దగ్గర నుంచి ముగిసే వరకు అన్నదాతల కష్టాలు మాత్రం తీరకపోగా ప్రతి సంవత్సరం కష్టాలు పెరుగుతూనే వస్తున్నాయి. గత ఏడాది వానాకాలంలో అకాల వర్షాల వలన పత్తి పంట దెబ్బతిని అన్నదాతల తీవ్రంగా నష్టపోయారు. దీంతో అన్నదాతలు పత్తి పంటను పీకి వేసి యాసంగిలో మొక్కజొన్న పంటను అత్యధికంగా సాగు చేశారు. దాదాపు 15000 ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. కానీ అకాల వర్షాల వల్ల మండల వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం 8000 ఎకరాలలో మొక్కజొన్న పంట నష్టపోయింది. మిగిలిన సగానికి పైగా మొక్కజొన్న పంట సాగునీటి సమస్యతో ఎండిపోయింది. ఈ విధంగా గత ఏడాది అన్నదాతలు సాగునీటి సమస్యతో, అకాల వర్షాలతో పంటల దెబ్బతిని అప్పులు పాలయ్యారు. ప్రతి సంవత్సరం అన్నదాతలు ఈ సంవత్సరం పంట చేతికి అప్పుల నుంచి బయట పడతామని ఆశతో వ్యవసాయం చేస్తూనే ఉన్నారు. కానీ అన్నదాతల కష్టాలు మాత్రం తీరటం లేదు.

అక్రమ కేసులు సహించం

- భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం



కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని పోలీసులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ హెచ్చరించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూసుమంచి మండలం ముత్యాలగూడెంలో అధికార పార్టీ నేతలు కావాలనే అల్లర్లు సృష్టించి పార్టీల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే దీనిని అదుపు చేయకుండా ఇంకా ప్రోత్సాహిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, లా అండ్ ఆర్డర్‌ను కాపాడాల్సిన పోలీసులు అధికార పార్టీ చెప్పుచేతల్లో ఉండడం రాజ్యాంగ విరుద్ధమని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, పోలీసులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పాలేరు నియోజకవర్గ పిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముత్యాలగూడెంలో జరిగిన సంఘటనకు బీఆర్ఎస్ నేతలే ప్రధాన సూత్రదారులని, వారిని పక్కన పెట్టి కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదన్నారు. విలేకరుల సమావేశంలో పీసీసీ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, పుచ్చకాయల వీరభద్రం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య పాల్గొన్నారు.

ఎట్టికేలకు చెరువు తూముకు మరమ్మతులు

నవతెలంగాణ- కల్లూరు

కల్లూరు పెద్ద చెరువు పెద్ద తూములో షట్టర్ మరమ్మతుల పనులు ఎట్టకేలకు బుధవారం ప్రారంభించారు. కల్లూరు పెద్ద చేరువులో పెద్ద తూములో గత ఖరిప్ సీజన్ ముందు షట్టర్ తూములో ఇరకుపోయింది. గత సీజన్లో పంటలు ఎండిపోకుండా అధికారుల ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సాగునీరు అందించి పంటలు ఎండిపోకుండా కాపాడారు. అప్పుడు చెరువు నిండా నీళ్ల ఉండటంతో మరమ్మతులకు సాధ్యం కాదని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిర్మించారు. మళ్లీ ఖరీఫ్ సీజన్ ప్రారంభం రావడంతో అప్పటికి చెరువు మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. చెరువు నిండా నీళ్ల ఉండటంతో పని కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్ చెరువులో నీళ్ల ఇంకని వంకతో మరమ్మతులు చేపట్టకపోవడంతో అధికారులు ప్రత్యేక శ్రమ తీసుకుని కాంటాక్ట్ చేత పనులు ప్రారంభించే విధంగా ఒప్పించారు. దీంతో పనులకు స్వీకారం చుట్టారు. చెరువులో ఇక బస్తాలతో బండ నిర్మించేందుకు లక్ష రూపాయలు నిధులు కేటాయించారు. షటరు తూము నిర్మించేందుకు ఐదు లక్షల రూపాయలు కేటాయించారు. మొత్తం ఆరు లక్షల కేటాయించడం జరిగింది. సీజన్ ప్రారంభం కంటే ముందే పనులు పూర్తి చేసే విధంగా చూస్తున్నామని అధికారులు అంటున్నారు. ఈ పనులను ఈఈ మంద లక్ష్మీనారాయణ, డిఇ రత్నాకర్, ఏఇలు పర్యవేక్షిస్తున్నారు.

తెలంగాణ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ- ఖమ్మం



టిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ తొమ్మిదవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను టిఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం డిపో కమిటీ ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంప్లాయిస్ యూనియన్ జెండాను రీజియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లికొండ.వెంకన్న ఆవిష్కరించారు. ఖమ్మం డిపో ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ బేతంపూడి బుచ్చిబాబు అధ్యక్షతన సభ జరిగింది. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి.రమేష్, పాటి అప్పారావు, ఖమ్మం డిపో కార్యదర్శి గుడిబోయిన శ్రీనివాస్‌రావు, పున్నారెడ్డి, మల్లేశ్వరావు, హనుమంతరావు, టి.వెంకటేశ్వరరావు, ఎం.సుగుణ కుమారి, పద్మ, భూషణం, నాగరాజు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్య సేవలు

- పేదలకు ఉచితంగా కీలక శస్త్రచికిత్సలు
- జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు
- క్షేత్ర స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే పల్లె, బస్తీ దవాఖానల ఏర్పాటు
- ప్రతి జిల్లా కేంద్రంలో డయాలసిస్ సెంటర్
- వరల్డ్ బ్లడ్ డొనర్స్ డే సందర్భంగా మంత్రి పువ్వాడ రక్త దానం
- రేడియోలజి ల్యాబ్, డయాలసిస్ సెంటర్, కీమోథెరఫీ వార్డు ప్రారంభం

నవతెలంగాణ- ఖమ్మం



"నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అంటూ ఓ సినీ కవి రాసిన పాట ఇప్పుడు పూర్తిగా రివర్స్ అయిపోయిందని, నేను వస్త బిడ్డో సర్కారు దవాఖానకు అని పాడుకునే రోజులు వచ్చాయి" అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఖమ్మంలోని వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రేడియోలజి ల్యాబ్, డయాలసిస్ సెంటర్, కీమోథెరఫీ వార్డులను మంత్రి పువ్వాడ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సమకూర్చిన న్యూట్రిషన్ కిట్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు 250 పడకలలోనే 500 మంది రోగులు, ఒక్కో బెడ్‌కు ఇద్దరు పేషంట్స్ ఉండేవారని, ఇవన్నీ నాకు స్వయంగా తెలుసునని అన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 500 బెడ్స్‌కు పెంచుకున్నమని, దీనికి తోడు ప్రత్యేక మాతాశిశు కేంద్రం, ట్రామా కేర్, క్రిటికల్ కేర్ యూనిట్, డయాలసిస్ ఇలా అనేక సేవలు ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.166 కోట్ల నిధులను ఇప్పటికే కేటాయించగా, 100 ఎంబీబీఎస్ సీట్లతో ఈ విద్యా సంవత్సరం నుండే తరగతులు ప్రారంభం కానున్నాయని, రూ.9 కోట్లతో కళాశాలకు కేటాయించిన పాత కలెక్టరేట్ భవనం ఆధునీకరణ, రూ.3.5 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేసుకున్నామని వివరించారు. ప్రతి పీహెచ్‌సీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ప్రధాన ఆసుపత్రికి వచ్చే వారికి 134 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తామని, ఈసీజీ, 2డీ ఈకో, ఎక్స్ రే, అల్ట్రా సౌండ్, మెమెగ్రఫీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గతంలో వివిధ పరీక్షల కోసం ప్రభుత్వ వైద్యులు, ప్రయివేటు ల్యాబ్‌లకు పంపేవారని కానీ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేస్తున్న టీ డయాగ్నోస్టిక్ హబ్, రేడియోలజీ ల్యాబ్‌లను ప్రజలు వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. వరల్డ్ బ్లడ్ డొనర్స్ డే సందర్భంగా మంత్రి పువ్వాడ రక్త దానం చేశారు. అనంతరం జిల్లాలో పని చేస్తున్న ఉత్తమ వైద్యులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు బహుకరించి అభినందించారు. కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా, సుడా చైర్మన్ విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిఎంఅండ్ హెచ్వో మాలతీ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, ఆసుపత్రి సూరింటెండెంట్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .



సామూహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

రాజుల దేవరపాడు గ్రామంలో గల మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల నందు ఒకటవ తరగతి విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుద్దుకూరు లింగయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఉప్పతల వెంకట నారాయణ, ఉప సర్పంచ్ దుద్దుకూరు సుజాత, మాముసూరు మాజీ సర్పంచ్ బండారు నరసింహా రావు, దుద్దుకూరు తిరుపతిరావు, ఉపాధ్యాయులు దివ్వల వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరునిగా ఎదగాలి: ఎంఈవో

నవతెలంగాణ-మధిర

బడిబాటలో భాగంగా మధిర మండలంలోని రాయపట్నం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జరిగిన సామూహిక అక్షరాస్యత కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు. అందరూ చదువుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2 జతల ఉచిత యూనిఫాం, ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ బుక్స్, మధ్యాహ్న భోజనంతో పాటు మన ఊరు – మనబడి కార్యక్రమం కింద పాఠశాలకు కావలసిన అన్ని సౌకర్యాలను సమకూరుతున్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ సౌకర్యాలు సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకొని క్రమశిక్షణతో ఎదగాలని తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచి నంద్రు సుశీల మాట్లాడుతూ చదువుకొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల ఇంచార్జి హెచ్ ఎమ్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు దాతల సహకారం తో అందించిన టేబుల్స్, సీలింగ్ ఫ్యాన్స్, లైబ్రరీ బుక్స్ పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల కన్నా దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నంద్రు తిమోతి,గద్దెల సురేష్, ఉపాధ్యాయులు సాంబశివరావు, అజయ్ కుమార్, లక్ష్మీప్రసన్న, విశ్వనాథం, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

నవతెలంగాణ-వేంసూరు

ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు దాతల సహకారంతో నోట్ బుక్స్, బ్యాగులు, బూట్లు అందజేయడం జరుగుతుందని సర్పంచ్ మేడ రమేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమ్మపాలెం పాఠశాల నందు విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అంగన్వాడి టీచర్‌తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

నూతన ప్యాషన్ ప్లస్ మోడల్‌ని ఆవిష్కరించిన ఎంఎల్‌ఏ

నవతెలంగాణ-పెనుబల్లి

హీరో కంపెనీకి నూతన ప్యాషన్ ప్లస్ మోటార్ సైకిల్‌ని బుధవారం సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఆవిష్కరించారు. వియం బంజరలోని చైతన్యరెడ్డికి చెందిన హీరో షోరూంలో ప్రారంభించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకటరావు, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య దినోత్సవం

నవ తెలంగాణ-మధిర

తెలంగాణ అవతరణ దినోత్సవం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మధిర పివిఆర్ కళ్యాణ మండపం నందు డాక్టర్ సుబ్బారావు అధ్యక్షతన నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పీ చైర్మన్ లింగాల కమల రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆరోగ్య తెలంగాణగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొడితోక లత, వార్డ్ కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

రూ.లక్ష రుణ పథకం కోసం బీసీల పాట్లు

- కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం దరఖాస్తుల వెల్లువ
- సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్న అధికారులు
- దరఖాస్తుదారులతో రద్దీగా మారిన తహశీల్దార్ కార్యాలయం

నవతెలంగాణ - బోనకల్



రాష్ట్ర ప్రభుత్వం బీసీల కులవృత్తులు, చేతివృత్తుల వారికి రూ. లక్ష ఆర్థిక సాయం పథకం ప్రకటించింది. దీంతో దరఖాస్తులు చేసుకునేందుకు కావలసిన ధ్రువ పత్రాల కోసం ఆశావహులు మండల తహశీల్దార్ కార్యాలయాలకు పరుగులు పెడుతూ పాట్లు పడుతున్నారు. మండల కేంద్రమైన బోనకల్ తహశీల్దార్ కార్యాలయంలో గత వారం రోజుల నుండి దరఖాస్తుదారులతో కిక్కిరిస్తుంది. ఓ పక్క ఎండ తీవ్రత ఎక్కువవుతున్నా ఎండవేడిమిని లెక్క చేయకుండా కుల, ఆదాయ పత్రాల కోసం పరుగులు తీస్తున్నారు. కార్యాలయంలో విధులు నిర్వర్తించే సిబ్బంది దరఖాస్తుదారుల నుండి వచ్చే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా వచ్చే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఆన్లైన్ ప్రక్రియ ద్వారా నిరంతరం ధ్రువపత్రాలను జారీ చేస్తున్నా దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో దీనికి తోడు అన్ లైన్‌లో సర్వర్లు రోజుల తరబడి మొరాయిస్తుండడంతో ధ్రువీకరణాల జారీ ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. రూ.లక్ష రుణం కోసం దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ దగ్గర పడుతుండటంతో దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తాసిల్దార్, నాయబ్ తహశీల్దార్, గిరిదావర్లు, జూనియర్ సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు వీఆర్ఏలు దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు సమయమునకు మించి పనిచేస్తున్నారు. ప్రతిరోజు ఎక్కువ దరఖాస్తులు వస్తుండడంతో పాటు ఓ పక్క ఆన్ లైన్ ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంతో దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పాఠశాలలో కూడా పున ప్రారంభం కావడంతో విద్యార్థులు కూడా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తాసిల్దార్ కార్యాలయం చుట్టూ ప్రతిరోజు తిరుగుతున్నారు. దీంతో సర్టిఫికెట్ల జారీ అధికారులకు భారంగా మారింది. ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో జాప్యం జరగటం లేదు కానీ కుల ధ్రువీకరణ పత్రాల జారీలో మాత్రం జాప్యం జరుగుతుంది. గతంలో గ్రామీణ స్థాయిలో వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ ఉంది. క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వెంటనే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేవారు. కానీ ప్రస్తుతం వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ లేకపోవడంతో కుల ధ్రువీకరణ విషయంలో సిబ్బంది కొరత వలన జాప్యం జరుగుతుంది. దీనివలన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుల ధ్రువీకరణ పత్రం కావటంతో గిర్దావర్లు జాగ్రత్తగా విచారణ నిర్వహించి జారీ చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మండలంలో 22 గ్రామాలు ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే గిర్దావర్లు ఉన్నారు. వీరు కుల ధ్రువీకరణ పత్రాల జారీ విషయంపై క్షేత్రస్థాయి విచారణ చేయకుండా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఇద్దరు గిర్దావర్లు 22 గ్రామాలలో క్షేత్రస్థాయిలో విచారణ ఎలా చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ రద్దు వలన ప్రజలకే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ధ్రువీకరణ పత్రాల జాప్యంపై తాసిల్దార్ చిపుకుల రమణిని వివరణ కోరగా ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు కృషి చేస్తున్నామని సర్వర్లు బిజీ వల్లే సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

ఓపెన్ కేటగిరి 460 ర్యాంకుతో న్యూవిజన్ విజయ విహారం

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల ఆలిండియా స్థాయి ఓపెన్ కేటగిరిలో 460వ ర్యాంకు సాధించి నీట్-23 ఫలితాలలో తిరుగులేని ఆధిక్యాన్ని కైవసం చేసుకున్నట్లు న్యూవిజన్ విద్యాసంస్థల ఛైర్మన్ సిహెచ్.జి.కె. ప్రసాద్ తెలిపారు. వైద్యవిద్యలో ప్రవేశార్థం ఎన్‌టిఏ వారు ఆలిండియాస్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షా ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు ఓపెన్ కేటగిరితో పాటు వివిధ కేటగిరిలలో జాతీయస్థాయి 96, 144, 188, 339, 1555, 1583, 1859, 2025, 2154, 2410 వంటి టాప్ ర్యాంకులతో జిల్లాస్థాయిలోనే కాక రాష్ట్రస్థాయిలో బెస్ట్ ర్యాంకులు సాధించిన కళాశాలగా నిల్చిందని తెలిపారు. బుధవారం విడుదలైన నీట్ ఫలితాలలో ఓపెన్ కేటగిరిలో బొంకూరి ధనుష్ 460 జాతీయస్థాయి ర్యాంకును పొందాడని, వివిధ కేటగిరిలలో బి.ధనుష్ - 96వ ర్యాంకు, డి.జతిన్ -144వ ర్యాంకు, బి.షర్మిల - 188వ ర్యాంకు, బి.శ్రీలేఖ - 339వ ర్యాంకు, బి.బాలరాజు - 1555వ ర్యాంకు, టి.లిఖిత-1583వ ర్యాంకు, బి.అంకితశ్రీ-1859వ ర్యాంకు, బి.నిత్య-2025వ ర్యాంకు, ఎమ్.సుష్మశ్రీ- 2154వ ర్యాంకులతో జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించగా 720 మార్కులకుగాను 695, 654, 653, 615, 602, 591, 584, 582 వంటి టాప్ మార్కులతో జిల్లా టాపర్‌గా నిలవడమే కాకుండా హైదరాబాద్ మినహా ఇతర ఏ జిల్లాలో సాధించని ఉత్తమర్యాంకులు, మార్కులు సాధించిందని తెలిపారు. తమ కళాశాల నుండి 114 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరుకాగా వివిధ కేటగిరిలో ఐదువేలలోపు - 14 ర్యాంకులు, పదివేలలోపు- 22 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. కళాశాల ప్రారంభించిన నాటినుండి నీట్, ఐఐటి, జేఈఈ, మెయిన్ వంటి జాతీయస్థాయి పరీక్షల్లో తమ కళాశాల సామాన్య విద్యార్థులతో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అందుకు సహకరించిన తల్లిదండ్రులను, కృషిచేసిన అధ్యాపకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్ర మంలో న్యూవిజన్ విద్యా సంస్థల ఛైర్మన్ సిహెచ్‌జికె.ప్రసాద్, డైరెక్టర్ సి.హెచ్. గోపిచంద్, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్.కార్తీక్, ప్రిన్సిపల్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావు మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నీట్-2023 ఫలితాలలో రెజొనెన్స్ అగ్రగామి

నవతెలంగాణ- ఖమ్మం



నీట్-2023 ఫలితాలలో రెజొనెన్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి ఖమ్మం జిల్లాలోనే అగ్రగామిగా నిలిచారని కళాశాల డైరెక్టర్స్ ఆర్‌వి.నాగేంద్ర కుమార్, కె. శ్రీధర్‌రావు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ ఇంటర్మీడియట్‌తో పాటే నీట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన తమ విద్యార్థులు మొహమ్మద్.నాజియ అంజుమ్ 550 మార్కులు, యస్. దేవిక 513, జి. రమ్య 480, కె.సాయి ఆనంద్ 462, యస్. సాయి నేహ 449, వి.జోషిక 417, బి.వినీల 390 మార్కులు సాధించారని తెలిపారు. ఇంతటి ఘనవిజయం సాధించడానికి పటిష్ఠమైన ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, బోధనానుభవం కలిగిన మేనేజ్‌మెంట్ ఈ విజయానికి కారణమని తెలిపారు. ఇంటర్‌తో పాటే నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు తగు శిక్షణ ఇవ్వడం ద్వారా ఇంతటి అద్భుత ఫలితాలు సాధించామని తెలిపారు. సాధారణ విద్యార్థులతో సైతం అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే ఇంతటి ఘన విజయం సాధించామని, ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సతీష్, ఎం.భాస్కర్ రెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు వీరస్వామి మృతి

నివాళులర్పించిన తమ్మినేని, పలువురు నాయకులు



నవతెలంగాణ- ఖమ్మంరూరల్

మండలంలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు లింగంపల్లి వీరస్వామి(70) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. లింగంపల్లి మృతదేహంపై సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడారు. లింగంపల్లి వీరస్వామి తన జీవితాంతం ఎర్రజెండా నీడలోనే బతికారని తెలిపారు. పార్టీపై ఎనలేని ప్రేమను చూపించిన వ్యక్తి లింగంపల్లి అన్నారు. లింగంపల్లి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతునికి భార్య చిన్న సైదమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు మల్లేశ్వరరావు గత సంవత్సరం సాగర్ కాల్వలో పడి మృతి చెందాడు. వీరస్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, సీపీఎం పాలేరు నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్, ఆంధ్ర బ్యాంక్ టేకులపల్లి సొసైటీ వైస్ చైర్మన్ తమ్మినేని విజయలక్ష్మి, తెల్దారు పల్లి సర్పంచ్ సిద్దినేని కోటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు,పొన్నెకంటి సంగయ్య, ఎర్ర శ్రీనివాస్‌రావు, పొన్నగంటి సంగయ్య వడ్లమూడి నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు, దోనోజు లక్ష్మయ్య, సిపిఎం నాయకులు తమ్మినేని వెంకట్రావు, తమ్మినేని కోటేశ్వరరావు, రంజాన్, యల్లంపల్లి నాగయ్య, జక్కంపూడి కృష్ణ, యర్రా నర్సింహారావు, రజక సంఘం నాయకులు సత్తెనపల్లి శ్రీను, నెల్లుట్ల వెంకన్న, దొనకొండ ముత్తయ్య, సిరికొండ అప్పారావు, సైదులు, మహిళ సంఘం నాయకులు తమ్మినేని కమలమ్మ, పెండ్యాల సుమతీ, సావిత్రి, వాణి, సైదమ్మ, రాజేశ్వరి, ఉష ఉన్నారు.

ఇండ్ల నిర్మాణం కోసం పది లక్షలు ఇవ్వాలి

సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి:పాలడుగు భాస్కర్



నవ తెలంగాణ- మధిర

సిపిఎం మధిర రూరల్ మండలం కమిటీ సమావేశం స్థానిక బోడేపూడి భవనం నందు ఓట్ల శంకర్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం మధిర నియోజకవర్గ ఇన్చార్జి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2023 సంవత్సరం నాటికి దేశవ్యాప్తంగా ఇల్లు లేని పేదలు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారని, రాష్ట్ర ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇండ్లతో పేదోళ్ళ సొంతింటి కలలో నిజం చేస్తామని హామీలు ఇచ్చారని, ఈ హామీలను వెంటనే అమలు పరచాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 5లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు మొత్తం ఇల్లు లేని పేదలకు 10 లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. ఇల్లు లేని పేదల పక్షాన పోరాడుతామని, తెలంగాణ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు ఇంతవరకు మంజూరు కాలేదని, రైతుల లక్ష రూపాయల రుణమాఫీ ఇంతవరకు జరగలేదని, అర్హులైన పేదలు దరఖాస్తులు చేసుకొని కొత్త పెన్షన్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకుపై సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అందులో భాగంగా మధిర పట్టణంలో మండలంలో ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు శీలం నరసింహారావు, పార్టీ మండల కార్యదర్శి మందా సైదులు, నాయకులు మద్దాల ప్రభాకర్, షేక్ ఉదండు సాహెబ్, దొంతి వీరాచారి వడ్డాణపు మధు కారుమంచి జోజి కుక్క మోహన్ రావు మరియు ఇతర మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ (ఎం) సీనియర్ నాయకులు రాఘవులుకి నివాళి



నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం లక్ష్మీపురం గ్రామంలో ఇటీవల మరణించిన సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి బొమ్మిడి రాఘవులు దశ దిన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కర్మ సందర్భంగా సిపిఐ(ఎం) మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, పార్టీ మండల నాయకులు మల్లెంపాటి రామారావు, కిన్నెర మోతి అమరజీవి బొమ్మిడి రాఘవులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సితార్, మురళి, రవి, ముత్తయ్య, వెంకయ్య, దరిపెల్లి శీను తదితరులు పాల్గొన్నారు.

నేడు సిఐటీయు జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్ వద్ద సిఐటీయు ఖమ్మం జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణు వర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గట్టయ్య సెంటర్ దగ్గరలో రోటరీ క్లబ్ పక్కన సిఐటీయు జిల్లా కార్యాలయాన్ని గురువారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు తమ్మినేని వీరభద్రం, సిఐటీయు జాతీయ నాయకులు ఎం.సాయిబాబు, సిఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు పాల్గొంటున్నారని పేర్కొన్నారు.



నీట్‌లో మెరిసిన చీకటి శ్రీజ

అఖిల భారత స్థాయిలో 692వ ర్యాంక్

శ్రీజతో పాటు తల్లిదండ్రులకు పలువురి అభినందనలు



నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ప్రముఖ ప్రజా వైద్యులు, జనతా హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ చీకటి భారవి, కలపాల మాధవి దంపతుల కుమార్తె చీకటి శ్రీజ నేషనల్ ఎలిజిబిలిటి కం ఎంట్రన్స్ టెస్ట్ (యూజీ) - 2023 ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. నీట్ ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో 720 మార్కులకు గాను శ్రీజ 690 మార్కులు సాధించారు. 692వ ర్యాంకు సొంతం చేసుకున్నారు. మొదటి నుంచి ఎంతో ప్రతిభ ఉన్న శ్రీజ పదవ తరగతి ఖమ్మంలోని న్యూ విజన్ పాఠశాలలో చదివి పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించారు. అనంతరం హైదరాబాదులో శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. 1000కి 984 మార్కులకు పైగా సాధించిన ఆమె ఆల్ ఇండియా లెవెల్ లో నిర్వహించిన నీట్ పరీక్షల్లోనూ ఉత్తమ ర్యాంక్ పొందిన ఆమె జాతీయస్థాయిలో మెరుగైన ఎయిమ్స్ వైద్య కళాశాలలో సీటు సాధించే అవకాశం ఉంది. శ్రీజ సోదరుడు సైతం మెడిసిన్ చదువుతుండటం గమనార్హం. అలిండియా స్థాయిలో అద్భుత ప్రతిభ చూపిన శ్రీజను సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు వై.విక్రమ్, బండారు రమేష్, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు.

డీపీఆర్ఓకి మాతృవియోగం



నవతెలంగాణ- కల్లూరు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిపిఆర్ఓ శీలం శ్రీనివాసరావు మాతృమూర్తి సరస్వతి(72) ఆకస్మికంగా కొత్తగూడెంలో మృతి చెందారు. బుధవారం భౌతికగాయాన్ని స్వగ్రామమైన కల్లూరు తీసుకొచ్చారు. భౌతికగాయానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు శ్రీనివాసరావుతో ఫోన్లో మాట్లాడి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళ్లర్పించిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న, డిపిఓ లక్కినేని రమాకాంత్, డిఆర్‌డిఓ జి మధుసూదన్ రాజు, మైనార్టీ హెల్పర్ అధికారి సంజీవరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, మార్కెటింగ్ పర్యవేక్షకులు సురేందర్, సత్తుపల్లి ఎం.వి.ఐ సంఘం వెంకట పుల్లయ్య, ఖమ్మం జిల్లా రిటైర్డ్ ఆర్ సి ఓ పుల్లయ్య ఎమ్మెల్సీ సి సీ సుమంత్, పిఆర్‌డిఇ రావిరాల రాంబాబు, కేటీపీఎస్ డి ఈ ఎం వి ఎల్ ఎస్ రవికుమార్, గడల లక్ష్మణరావు, కొత్తగూడెం టీ పిసిసి సభ్యులు కాంగ్రెస్ నాయకులు నాగ సీతా రాములు కాంగ్రెస్ జిల్లా నాయకులు మాట్ల దయానంద్ విజయకుమార్, నాయకులు కొండూరు సుధాకర్, రైతు సమితి మండల కన్వీనర్ లక్కినేని రఘు, ఉప్పల శీను దామాల సురేష్ తదితరులు నివాళులర్పించారు.

తుఫాన్ సాకేనా? సమీకరణే సమస్యనా..??

- ఖమ్మంలో బీజేపీ సభ రద్దుపై భిన్న వాదనలు
- ప్రజా సమీకరణ కష్టతరమవడంతో రంగంలోకి సుధాకర్‌రెడ్డి
- ఇంతలోనే అధిష్టానం నుంచి కబురు
- అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు అయినట్లు ప్రకటించిన బండి..
- త్వరలో తేదీ ప్రకటిస్తామని వెల్లడి
- ఖమ్మంలో ధ్రువీకరించిన సుధాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మహాజన సంపర్క అభియాన్ సభల్లో భాగంగా గురువారం ఖమ్మంలో నిర్వహించాల్సిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా బహిరంగ సభ రద్దవడంపై సందేహాలు నెలకొన్నాయి. అరేబియా సముద్రంలో ఏర్పడిన బిపర్ జోయ్ తుఫాను కారణంగా హోం మంత్రి పర్యటనను రద్దు చేశామని బీజేపీ వర్గాలు వెల్లడించినా...అది సాకు మాత్రమేనని, అస్సలు సమస్య జన సమీకరణేనని విమర్శలు వినిపిస్తున్నాయి. కమ్యూనిస్టు ఖిల్లాలో కాషాయ జెండా ఎగురవేస్తాం.. లక్ష మందిని ఈ సభకు తరలిస్తాం.. అంటూ ప్రగల్భాలకు పోయిన బీజేపీ నేతలు అ లక్ష్యం చేరుతామన్న విశ్వాసం లేకపోవడంతోనే సభను రద్దు చేసుకున్నట్లు ప్రత్యర్థులు విమర్శలు గుప్పిస్తున్నారు.

రద్దు కాదు వాయిదానే అంటున్న బీజేపీ..

కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా గురువారం నాటి ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటన రద్దు అయినట్లు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ప్రకటించారు. ఖమ్మంలో నిర్వహించే సభ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. రద్దు కాదు వాయిదా మాత్రమేనని జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అంటున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ అర్ధరాత్రికి అమిత్ షా హైదరాబాద్ కు చేరుకోవాల్సి ఉంది. రేపు ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగసభలో పాల్గొనాల్సి ఉంది. తుపాను కారణంగా ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలు ఇప్పటికే తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, ఎన్డీఆర్ఎఫ్ టీములు ఆయా రాష్ట్రాల్లో మోహరించాయని, రెస్క్యూ ఆపరేషన్స్ ను అమిత్ షా స్వయంగా పర్యవేక్షిస్తారని బండి సంజయ్ తెలిపారు. విషయాన్ని ఖమ్మం సభ ఏర్పాట్లలో ఉన్న బీజేపీ జాతీయ నాయకులు, తమిళనాడు సహ ఇంచార్జి మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి కూడా నిర్ధారించారు .గత రెండు రోజులుగా ఆయన ఖమ్మం లోనే మకాం వేసి జన సమీకరణకు ప్రయత్నిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం వైరా , మధిర , బోనకల్లు ప్రాంతాలకు వెళ్ళడానికి ఆయన సమాయత్తమైన సమయంలో అధిష్టానం నుంచి తెలంగాణ బీజేపీ ఇంచార్జి తరుణ్ ఛుగ్ నుంచి అమిత్ షా పర్యటన రద్దు అయినట్లు ఫోన్ వచ్చింది. ఏర్పాట్లు బ్రహ్మాండగా చేసినా ఆశించిన జన సమీకరణ కష్టమేనని ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారంతోనే పర్యటన రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణాలో ప్రత్యేకించి ఖమ్మం జిల్లాలో ఎండలు తీవ్రంగా ఉండటంతో జన సమీకరణపై సందేహాలు ఉన్నాయి. సభ రద్దవడంతో పొంగులేటి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీ గరికపాటి రామ్మోహన్‌రావు హైదరాబాదు వెళ్లారు.

తుఫాను సాకేనా..?

అమిత్ షా పర్యటన రద్దు కు గుజరాత్ తుఫాన్ కారణంగా చెపుతున్నా రకరకాల కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. మొదటి నుంచి బీజేపీకి అసలే బలం లేని ఖమ్మం జిల్లాలో బీజేపీ అగ్రనేత బహిరంగ సభ పెట్టడం రాజకీయ పరిశీలకులకు కొంత ఆశ్చర్యం కలిగించింది . దీనికి లక్ష మందిని సమీకరిస్తున్నట్లు నేతలు చెప్పారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా బీజేపీలో చేరట్లేదనే సంకేతం జనంలోకి వెళ్లడం, ఎండల తీవ్రత, స్థానికంగా బీజేపీకి సానుకూలత లేకపోవడం...ఎలా చూసినా సభకు కనీస జన సమీకరణ జరిగే సూచనలు లేకపోవడంతోనే పర్యటనను రద్దు చేసుకున్నట్లు చర్చ నడుస్తోంది.

బండి మాటలు ?

అమిత్ షా పర్యటన ఖరారు అయిన వెంటనే ఖమ్మం వచ్చిన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పర్యటన కోసం అనేక జిల్లాలు పోటీపడినా ఖమ్మంకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పుకొచ్చారు. ఖమ్మం కాంగ్రెస్, కమ్యూనిస్టుల జిల్లా అని కొందరు అంటున్నారు.. ఇది కాషాయ జిల్లా అని నిరూపించాలని ఇక్కడ నేతలకు ఉద్బోధ చేశారు. కానీ ఆ రోజే ఆయనకు సీన్ అర్థం అయినట్లు ఉన్నది.. ఆచరణలో అది సాధ్యం కాకపోవచ్చు అని భావించినా పైకి గాంభీర్యం ప్రదర్శించారని.. ప్రస్తుత పరిణామాలను బట్టి విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పర్యటనతో బిజెపి కొత్త, పాత నేతల మధ్య ఉన్న అనైక్యత సైతం బయటపడే అవకాశం ఉందని.. అదే జరిగితే మొదటికే మోసం వస్తుందని భావించే తుఫాను సాకుగా చూపించి పర్యటనను రద్దు చేసుకున్నట్లు మరో వాదన కూడా వినిపిస్తోంది. సభ రద్దవడంతో ఫ్లెక్సీలు, కటౌట్లు, జెండాలన్నీ తొలగించారు.

పోడు ప్లాంటేషన్‌పై హక్కు మాదే

ప్రత్యామ్నాయ పోడైనా చూపాలి

కారేపల్లి రేంజ్ ఎదుట బాధితుల ఆందోళన



నవతెలంగాణ-కారేపల్లి

పోడుకు ప్రత్యామ్నాయం చూపుతామని నమ్మించి తమ పోడులో ఫారెస్టు అధికారులు ప్లాంటేషన్ వేసి తర్వాత ప్రత్యామ్నాయం పోడు చూపక పోవటంపై ప్లాంటేషన్ బాధితులు బుధవారం కారేపల్లి ఫారెస్టు కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ప్లాంటేషన్ పోడు మాదేనని దానిని సర్వే చేసి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయం చూపే వరకు పోడు ప్లాంటేషన్ ను వదిలేది లేదని తేగేసి చెప్పారు. ఆందోళన విషయం తెలుసుకున్న కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు ఫారెస్టు రేంజ్ కార్యాలయంకు చేరుకోని అందోళనకారులతో చర్చించారు. తమకు న్యాయం చేయాలని ప్లాంటేషన్ బాధితులు వేడుకున్నారు. ఈ సంధర్బంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికారులు ప్లాంటేషన్‌కు ప్రత్యామ్నాయ భూమి చూపటంలో అలసత్వం కారణంగానే ప్లాంటేషన్ ధ్వంసం, ఉద్రిక్తత పరిస్థితులు దాపురించాయన్నారు. కారేపల్లి మండలం మాణిక్యారం, ఎర్రబోడు పంచాయ తీలలోని చెందిన 38 కుటుంబాలకు చెందిన 93 మంది పోడు సాగు చేసుకోని జీవిస్తున్నారన్నారు. పోడులో ప్లాంటేషన్ వేయాలని ఫారెస్టు ఉన్నతాధికారుల ఒత్తిడితో పోడు సాగుదారులతో 2020లో స్థానిక ఫారెస్టు అధికారులు ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ప్లాంటేషన్ బాధితులు తాము సాగు చేసుకుంటున్న పోడు భూమిలో సగం ప్లాంటేషన్‌కు మిగతాది వ్యవసాయం చేసుకోవటానికి అంగీకరించారని గుర్తుచేశారు. దానికి సమ్మతి తెల్పిన ఫారెస్టు, ప్రత్యామ్నాయంగా మిగతావారి దగ్గర నుండి కొంత భూమిని సేకరించి బాధితులకు అప్పగిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్లాంటేషన్‌లో పోడు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయం చూపకపోవటంతోనే ప్లాంటేషన్ వద్ద అధికారులు, బాధితులకు మధ్య ఉద్రిక్తత పరిస్థితి తలెత్తుతుందన్నారు. ఇప్పటికైన ఫారెస్టు ఉన్నతాధికారులు జోక్యం చేసుకోని ప్లాంటేషన్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పోడు భూముల కోసం చేసిన పోరాట సందర్బంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్బంగా ఫారెస్టు రేంజర్ సిద్దార్ధరెడ్డి, ఎస్సై పుష్పాల రామారావులకు వినతి పత్రం అందజేశారు.

ఉద్రిక్తతలు సృష్టించవద్దు - ఎఫ్ఆర్వో

పోడు ప్రాంతంలో వేసిన ఫారెస్టు ప్లాంటేషన్ వద్ద ఉద్రిక్తతలు సృష్టించవద్దని బాధితులను ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సిద్దార్ధరెడ్డి కోరారు. వినతిపత్రం తీసుకున్న అయన మాట్లాడుతూ బాధితుల సమస్యపై ఆలోచిస్తామని ఆవేశంతో ప్లాంటేషన్ ధ్వంసం, అధికారులను బెదిరించటం వంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. బాధితుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్ళి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, కరపటి సీతారాములు, పోడు సాగుదారులు సరిత, కళావతి, అరుణ, సుగుణ, కౌసల్య, జాటోత్ హరికిషన్, బానోత్ రమేష్, కాంపాటి రమేష్, బిక్షం పాల్గొన్నారు.




డాక్టర్స్ అకాడమీ చరిత్రాత్మక విజయం

100కి పైగా గవర్నమెంట్ ఎంబీబీఎస్ సీట్లు

నవతెలంగాణ- ఖమ్మం

నీట్ ఫలితాలలో ఎవరికీ అందనంత విజయాన్ని నగరంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ స్వంతం చేసుకుందని డైరెక్టర్లు రాయల సతీష్ బాబు, భరణి కుమార్‌లు తెలిపారు. ఆల్ ఇండియా 100వ ర్యాంకు అరవింద్, అలేఖ్య 209, శ్రీ విద్య 371, జాస్మితత 490వ, శ్రీకీర్తి 512వ, కళ్యాణ్ 618 ర్యాంకు ఆలిండియా లెవల్లో తెచ్చుకోవడమే కాక 600 మార్కుల పైన ముగ్గురు విద్యార్థులు అరవింద్, రోహన్, అయూబ్ , జయంత్ రెడ్డి 594 మార్కులు. సహస్రస్వాతి 594 మార్కులు, అలేఖ్య 574, సంజన 557, మేఘనరావు 554, అజయ్ రున్ 550, స్నేహిత 548, శ్రీ విద్య 547, కావ్యసుధ 542, తనస్విని రాజ్ 539, ఉజ్వల 539, హస్మిన్ 534, జాస్మిత 532, శ్రీ కీర్తి 530, పవిత్ర 529, భావన 527, షణ్ముఖ 523, కళ్యాణ్ 521, లహరి 510, తేజస్విని 509, సాయి శ్రీ 509, నితిన్ 508, జుహిత 504, భరణి 503, త్రివేణి 501, మీనాక్షి 500 మార్కులు తెచ్చుకొని మొత్తం 500 మార్కుల పైన 30 మంది , 400 మార్కుల పైన 105 మంది విద్యార్థులు సాధించడమే కాకుండా గత సంవత్సరం మార్కుల కటాఫ్ ఆధారంగా దాదాపు 120 మంది విద్యార్థులకు గవర్నమెంట్ కోటాలో సీట్లు సాధించే అవకాశమున్నట్లు తెలిపారు. అలానే 2021లో 49 మందికి, 2022 లో 75 మందికి గవర్నమెంట్ మెడికల్ సీట్ల సాధింపచేసిన విషయం విదితమే. ఈ విజయానికి సహకరించిన అధ్యాపక బృందానికి, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. అహర్నిశలు శ్రమించి విజయాన్ని కైవసం చేసుకోన్న విద్యార్థులను అభినందించారు.

కృష్ణవేణి కళాశాల విద్యార్థుల విజయకేతనం



నవతెలంగాణ-ఖమ్మం

నీట్ ఫలితాలలో కృష్ణవేణి కళాశాల విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారని కృష్ణవేణి విద్య సంస్థల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వర్‌రావు, యార్లగడ్డ వెంకటేశ్వర రావు అన్నారు. జాతీయ కోర్స్ అయన నీట్ ఫలితాలలో మా కళాశాల విద్యార్థులు 720 మార్కుల గాను కె. శ్రేష్ఠ- 534, ఈ. శ్రీశాంత్- 494, బి.వాసు 457, బి. రాకేష్- 441, కె.చందాన 437, ఆర్.బృందావని 404 మార్కులు సాధించారని తెలిపారు. జాతీయ స్థాయి నీట్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ గుర్రం రామచందర్, నిరంజన్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

నీట్ పరీక్షా ఫలితాలలో 'హార్వెస్ట్' కు అద్భుత ఫలితాలు

నవతెలంగాణ-ఖమ్మం



దేశవ్యాప్తంగా వివిధ వైద్య కళాశాలలలో వైద్య విద్యను అభ్యసించడానికి ఎన్.టి.ఏ వారు నిర్వహించిన ప్రవేశ పరీక్ష 'నీట్'లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి, మంచి ఫలితాలు సాధించినట్లు 'హార్వెస్ట్' గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ పార్వతిరెడ్డి తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను, వైద్య విద్యను అభ్యసించడానికి దేశవ్యాప్తంగా వివిధ మెడికల్ కళాశాలలో ప్రవేశాల కొరకు నిర్వహించిన నీట్ పరీక్షకు తమ కళాశాల నుండి విద్యార్థినీ విద్యార్థులు హాజరవగా ప్రకటించిన పరీక్షా ఫలితాలలో, తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. తమ విద్యార్థిని జె.శారోన్ జాకులిన్ 541 మార్కులతో 32,476 ఓ.బి.సి. క్యాటగిరి ర్యాంకు సాధించి కళాశాలలో అగ్రస్థానంలో నిలిచారన్నారు. అదేవిధంగా ఎ.త్రినాథ్ 524 మార్కులతో 39,295వ ఓ.బి.సి. క్యాటగిరి ర్యాంకు సాధించారన్నారు. కె.గీతిక 475 మార్కులతో 6863వ ఎస్.సి క్యాటగిరి ర్యాంకు, ఎస్.జెని అక్షయ రెడ్డి 473 మార్కులతో 47,445వ జనరల్ క్యాటగిరి ర్యాంకు, పి. యజ్ఞశ్రీ 463 మార్కులతో 1612వ ఎస్.టి క్యాటగిరి ర్యాంకు, ఎ. వరుణ్ రాజ్ 458 మార్కులతో 8803వ ఎస్.సి క్యాటగిరి ర్యాంకులు సాధించడం హర్షణీయమన్నారు. అదేవిధంగా మిగతా కొందరు విద్యార్థినీ, విద్యార్థులు కూడా వివిధ విభాగాలలో సీట్లు సాధించే అవకాశముందని వారు తెలిపారు. బుధవారం తమ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలషించారు.

నీట్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థుల విజయకేతనం



నవతెలంగాణ- ఖమ్మంకార్పొరేషన్

నీట్-2023 పరీక్షా ఫలితాలలో శ్రీచైతన్య ఖమ్మం విద్యార్థులు జాతీయ స్థాయిలో ఖమ్మంలోనే అత్యధికంగా సాధించారని తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు.

ఇంటర్మీడియట్తో పాటే 62, 213, 239, 495, 511, 646, 653 వంటి అలిండియా 100లోపు, 1000లోపు అత్యుత్తమ ర్యాంకులతో కె. లిలా శ్రీధర్ 690/720, బి. జస్వంత్ కుమార్ 670/720, కె. జన్విత దేవ్ 657/720 వంటి జాతీయ స్థాయి అత్యుత్తమ మార్కులతో పాటు 631, 628, 618, 608, 574, 562, 537, 529, 519, 519, 519, 516, 502, 501 వంటి అత్యధిక మార్కులతో రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలలో అత్యధిక సీట్లు పొందే ఫలితాలను సాధించి విజయ కేతనం ఎగురవేశారని తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులతో తెలంగాణ ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారని తెలిపారు. మారుతున్న పరీక్షా విదానలకు అనుగుణంగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసె తులనాత్మక విద్యాప్రణాళికతో పాటు రాష్ట్రంలోనే బెస్ట్ అనదగ్గ లెక్చరర్ల్ చే విద్యాబోధనను అందిస్తూ, నిరంతరం విద్యార్థులకు అందుబాటులో ఉంచుతూ వారి నైపుణ్యతను ఎప్పటికప్పుడు సమిక్షించడం వల్లనే తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సునాయాసంగా సాధించగలిగారని తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టస్ శ్రీ విద్య మాట్లాడుతూ మారుతున్న విధానాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికను తయారు చేసి దానికి తగిన అత్యుత్తమ స్థాయి బోధన సిబ్బందిని విద్యార్థులకు కల్పించడం వలన తమ విద్యార్థులకు జాతీయ స్థాయి ప్రతిష్టాత్మకమైన పోటీ పరీక్షలలో సునాయాసంగా ఆలిండియా అత్యుత్తమ ర్యాంకులను సాధించగలుగుతున్నారని అన్నారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, అకడమిక్ డైరెక్టర్ బి.సాయిగీతిక, డి.జి.యమ్ సి.హెచ్. చేతన్ మాథుర్, అకడమిక్ డీన్ ఎస్.ఆర్.యస్.డి వర్మ, ఎ.జి.యం.లు సి. హెచ్. బ్రహ్మం,. జి. ప్రకాష్, శ్రీ జి. గోపాలక్రిష్ణ, ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

శ్రీ చైతన్య విద్యార్థుల అద్భుత ప్రతిభ

ఖమ్మం : ఏపీ ఈఏపీసెట్-2023 పరీక్షా ఫలితాలలో శ్రీచైతన్య ఖమ్మం విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్ తదితర విభాగాలలో 1000లోపు అత్యుత్తమ ర్యాంకులతో విజయ కేతనం ఎగురవేశారని తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ అన్నారు. కళాశాలకు చెందిన బి.వివేక్ వర్ధ వర్మ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో 109 ర్యాంకు, ఏ.ఇందు స్టేట్ 2014వ ర్యాంకు, ఆర్. హర్షిత స్టేట్ 3314వ ర్యాంకు, వి.నక్షత్ర స్టేట్ 6223వ ర్యాంకు, ఆర్.శ్రీ నిత్య, స్టేట్ 7121వ ర్యాంకు, జె.సవర్ణిక స్టేట్ 8890 ర్యాంకు, డి.సింధు 11935 స్టేట్‌ను సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారని పేర్కొన్నారు. మారుతున్న పరీక్షా విదానలకు అనుగుణంగా విద్యార్థుల ప్రతిభను వెలికి తీసెతులనాత్మక విద్యాప్రణాళికతో పాటు రాష్ట్రంలోనే బెస్ట్ అనదగ్గ లెక్చరర్ల్ చే విద్యాబోధనను అందిస్తూ, నిరంతరం విద్యార్థులకు అందుబాటులో ఉంచుతూ వారి నైపుణ్యతను ఎప్పటికప్పుడు సమీక్షించడం వల్లనే తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులను సూనాయాసంగా సాధించగలిగారని తెలిపారు.విద్యాసంస్థల డైరెక్టస్ శ్రీ విద్య మాట్లాడుతూ మారుతున్న విధానాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికను తయారు చేసి దానికి తగిన అత్యుత్తమ స్థాయి బోధన సిబ్బందిని విద్యార్థులకు కల్పించడం వలన తమ విద్యార్థులకు రాష్ట్ర మరియు జాతీయ స్థాయి ప్రతిష్టాత్మకమైన పోటీ పరీక్షలలో సునాయాసంగా టాప్ ర్యాంకులను సాధించగలుగుతున్నారని అన్నారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టస్ మల్లెంపాటి శ్రీవిద్య, అకడమిక్ డైరెక్టస్ బి.సాయిగీతిక, డి.జి.యమ్ సి.హెచ్. చేతన్ మాథుర్, అకడమిక్ డీన్ ఎస్.ఆర్.యస్.డి వర్మ, ఎ.జి.యం.లు సి.హెచ్, బ్రహ్మం, జి.ప్రకాష్, జి.గోపాలక్రిష్ణ, ప్రిన్సిపాల్స్ అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.



పేదల పక్షపాతి రాంప్రసాద్ పాసికి సీపీఎం నివాళి

నవతెలంగాణ-ఇల్లందు

పేద ప్రజలకు సేవ చేయడమే తనకు ఇష్టమని నాడు రాంప్రసాద్ పాసి అనేవారని తన కుటుంబం కన్నా పేదలకు సేవ చేయడమే తనకు ముఖ్యమని భావించి పని చేసిన సీపీఎం పార్టీ సీనియర్ నేత రామ్ ప్రసాద్ పాసి అని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ నబి అన్నారు. రాంప్రసాద్ 8వ వర్ధంతి సందర్భంగా ఏలూరి భవన్ లో బుధవారం ఆయన చిత్ర పటానికి సిపిఎం సీనియర్ నాయకులు కూకట్ల శంకర్, ముత్తాబత్తుల వీరయ్య లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో అబ్దుల్ నబి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ పాత్రికేయులు సంగెం వేణుగోపాల్,ఇర్ఫాన్, రాంప్రసాద్ కుమారుడు రాంభరోస్, రవి, తేజ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు మరి కొన్నిరోజులు అందించాలి

నవతెలంగాణ-ఇల్లందు

షెడ్యూల్ ప్రకారం కార్మికులకు ఇస్తున్న మజ్జిగ ప్యాకెట్ల సప్లై నేటితో ముగియనుంది. ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్న కారణంగా కార్మికులకు మరో 15 రోజులు మజ్జిగ ప్యాకెట్లు అందించాల్సిందిగా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ ఎస్. రంగనాథ్ జీఎంకు విజ్ఞప్తి చేసారు. ఆఫీసులలో మైన్స్ లో ఏర్పాటు చేసిన కూలర్లను కూడా ఈ నెలాఖరు వరకు కొనసాగించాలని కోరారు. స్పందించిన జీఎం కార్మికుల సమస్యలను విని కార్మికుల ఇబ్బంది దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని రంగనాథ్ తెలిపారు.

తల్లిదండ్రుల ఆశయాలను సాకారం చేయాలి

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి



అమరజీవి జర్పుల భద్రు జ్ఞాపకార్థం రేగళ్ళ ప్రాథమిక విద్యార్థులకు పలకలను అందించారు. భద్రూ కుమారుడు హరి ఆధ్వర్యంలో చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఉబ్బనపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లి దండ్రులు కన్న కలలు సాకారం చేయాలని అన్నారు. భవిష్యత్తులో సేవదృక్పథంలో మరిన్ని అభ్యుదయ కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు భూక్య రమేష్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు ధరావత్ వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకన్న, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రామకోటి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు డ్రైవింగ్ శిక్షణ

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి, ఆర్టీసీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు లైట్ మోటార్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు జియం షాలేమురాజు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జియం మాట్లాడుతూ ఈ శిక్షణ కోల్ బెల్ట్ పరిసర ప్రాంతల యువకులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తెలంగాణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ ద్వారా సిరిసిల్ల నందు 90 రోజుల పాటు డి.డి.యు.జి.కె.వై. ఆధ్వర్యంలో నిర్వహించబడును. ఆసక్తి గల అభ్యర్థులు జియం ఆఫీస్ సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, కనీస అర్హతలు 10వ తరగతి ఉత్తీర్ణులై 20నుండి 30సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని మరియు ఎత్తు 160 సే.మీ. ఉండాలని అన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు విద్యార్హత, వయసు నిర్ధారణ, చిరునామా, లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ పత్రాలు జతపరచాలని అన్నారు. ఎంపికైన వారికి హకీంపేట హైదరాబాద్ లో 90రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు శిక్షణ కాలంలో హాస్టల్ వసతి ఉంటుందని అన్నారు.

గ్రీన్ భద్రాద్రి అధ్యక్షునిగా బెల్లంకొండ రాంబాబు ఏకగ్రీవ ఎంపిక

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గ్రీన్ భద్రాద్రి అధ్యక్షునిగా బెల్లంకొండ రాంబాబు ఏకగ్రీవ ఎంపికయ్యారు. గ్రీన్ భద్రాద్రి సర్వసభ్య సమావేశం, 2023-24 సంవత్సరానికి నూతన పాలకవర్గ సభ్యులను ఎంపిక, ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలు స్థానిక లయన్స్ క్లబ్ బిల్డింగ్ నందు బుధవారం జరిగింది. నూతన అధ్యక్షులుగా బెల్లంకొండ రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా శ్రీరంగం సంపత్, కోశాధికారిగా విష్ణుమొలకల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా ఏ. ఉమాశంకర్ నాయుడు, పూసం రవికుమారి, లీగల్ అడ్వైజర్ గా పామరాజు తిరుమల రావు, పిఆర్ఓగా లకావత్ వెంకటేశ్వర్లు తదితరులను గ్రీన్ భద్రాద్రి ట్రస్ట్ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేసి, ట్రస్ట్ అధ్యక్షులు యేగి సూర్య నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను గ్రీన్ భద్రాద్రి సభ్యులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సభా అధ్యక్షులు కామిశెట్టి కృష్ణార్జునరావు, గ్రీన్ భద్రాద్రి ఫౌండర్ జి.రాజారెడ్డి, ట్రస్ట్ అధ్యక్షులు, ముఖ్య అతిది యేగి సూర్యనారాయణ, తెలంగాణ సైనిక్ డైరెక్టర్ తిప్పన సిద్దులు, విశిష్ట అతిదులు అడుసుమిల్లి జగదీష్, చావా లక్ష్మీనారాయణ, హరిశ్చంద్ర నాయక్, గ్రీన్ భద్రాద్రి గౌవాధ్యక్షులు డా. గోళ్ళ భూపతిరావు, బోగాల శ్రీనివాస రెడ్డి, లయన్స్ క్లబ్ ఎలక్టెడ్ ప్రెసిడెంట్ భీమవరపు వెంకటరెడ్డి, కట్టా నాగేంద్రబాబు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో ఒకేషనల్ అవార్డ్స్ ప్రదానం

నవతెలంగాణ-బూర్గంపాడు

ఐటీసీ అనుబంధ సంస్థ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో ఒకేషనల్ అవార్డ్సను ఐటీసీ ప్రాంగణంలోని ఆడిటోరియంలో బుధవారం ప్రధానం చేశారు. తమ తమ విధులలో సక్రమంగా పనిచేస్తూ అందరి మెప్పులను పొందిన వివిధ డిపార్ట్మెంట్స్‌కు చెందిన 11 మంది సర్వీస్ ప్రొవైడర్ ఎంప్లాయిలను గుర్తించి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు టి.సూర్య భాస్కర రావు పాల్గొని, కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి డా. టి విజయ్ కుమార్, జేకే దాస్, ఏవీఎస్ గోవిందరావు, మరదన శ్రీనివాస్, చాంద్ బాషా, రవికుమార్, కే వెంకటేశ్వర్లు, ఎం సత్యనారాయణ, రోటరీ పూర్వ కార్యదర్శి షేక్ బాషా, గుత్తేదారులు యువి రావు, సుధాకర్ రెడ్డి, ప్రసాద్, మురళి, శ్రీకాంత్ రెడ్డి, యసోబు, మహేష్ రెడ్డి, పి సత్యనారాయణ, రోట్రాక్ట్ సభ్యులు ఖాదర్ వలీ, వెస్లేస్, పురస్కార గ్రహీతలు, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుడి ఇంటిపై దాడి

- కార్మికుడికి గాయాలు... ఇంట్లో వస్తువులు ధ్వంసం

- నష్టపరిహారం చెల్లించాలి...దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి కార్మికుడి ఇంటిపై దాడిచేసి, ఇంటో వస్తువులు, పలు ఖరీదైన పరికరాలు ధ్వంసం చేసి కార్మికున్ని గాయపరిచిన సంఘటన కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని రైటర్ బస్తి గొల్లగూడెం ఏరియాలో బుధవారం చోటు చేసుకుంది. ఒక కార్మికుడి ఇంటిపై గుర్తు తెలియని పలువురు 40 మంది వరకు వచ్చి దాడి చేయడం జరిగింది. ఈ దాడిలో కార్మికుడు తీవ్రంగా గాయపడడంతో పాటు ఇంట్లో వస్తువులను సైతం ధ్వంసం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సింగరేణి సెంట్రల్ వర్క్ షాప్ పెద్దమ్మ టెంపుల్ పక్కనున్న సింగరేణి టీ-2 క్వాటర్స్ సముదాయంలోని టి-2టైప్-192 క్వార్టర్‌లో నివాసముంటున్న వేణు అనే కార్మికుడిపై ములుగు జిల్లా రామచంద్రపురం ప్రాంతానికి చెందిన సుమారు 45 మంది ముకుమ్మడిగా దాడి చేసి ఇంట్లో ఉన్న వస్తువులను ధ్వంసం చేశారని సమాచారం. దాడి జరుగుతున్న సమయంలో చుట్టుపక్క ప్రాంతాలవారు వారిని అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నప్పటికీ బీభత్సం సృష్టించారు. కార్మికుడు వేణు భయాందోళనతో పరుగులు తీసి, వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నీట్ ఫలితాలలో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కొత్తగూడెం

నీట్ ఫలితాలలో కొత్తగూడెం కృష్ణవేణి కళాశాలకు చెందిన కె.శ్రేష్ఠ మెడిసిన్ ఆల్ ఇండియా 2456 ర్యాంక్ సాధించి మెడిసిన్‌లో అడ్మిషన్ పొందినట్లు కళాశాల యాజమాన్యం ప్రకటనలో తెలిపారు. బుధవారం నీట్ ఫలితాల్లో విద్యార్థిని అర్హత సాధించింది. అదే విధంగా ఇదే కళాశాలకు చెందిన విద్యార్థులు హెప్సిబా, షేక్ షాహీనా, సందీప్ లు వివిధ కేటగిరీలలో అడ్మిషన్ పొందుటకు అర్హత సాధించారు. విద్యార్థులు మెడిసిన్ చదువుటకు అర్హత పొందేటట్లు విద్యను బోధించిన అధ్యాపకులను డైరెక్టర్లు మాచవరపు కోటేశ్వరరావు, గొల్లపూడి జగదీశ్, యార్లగడ్డ వెంకటేశ్వరరావు అభినందించారు.

బూర్గంపాడులో ఘోర ప్రమాదం

- టెంపో ఆటో బోల్తా... నలుగురు మృతి

- మృతుల్లో ఇరువురు చిన్నారులు

- ప్రమాదంలో తండ్రి ..కొడుకులు మృతి

- రాముని దర్శనం అనంతరం తిరిగి వెళుతుండగా ప్రమాదం

నవతెలంగాణ -బూర్గంపాడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల శివారు సరిహద్దులో బుధవారం సాయంత్రం అదుపు తప్పి కిన్నెరసాని-బూర్గంపాడు బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పైనుండి టెంపో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఇద్దరు చిన్నారులు భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద సంఘటన. అలాగే ఈ ప్రమాదంలో పలువురు పరిస్థితి విషమంగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఏపీలోని ఏలూరు జిల్లా టి-నర్సాపురం మండల పరిధిలోని తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన 12 మంది భక్తులు భద్రాచలంలో రామయ్యన్ని దర్శించుకుని తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను బూర్గంపాడు, భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రుల కు తరలించారు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన జట్ల దుర్గారావు(40), పచ్చిపాల శ్రీనివాసరా వు(35) దుర్మరణం చెందారు. అలాగే భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సందీప్ (12), ప్రదీప్ (10)లు మతి చెందారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడిన నరసింహా రావు, తిరుమల రావు, నిర్మల, అనూషలు చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న బూర్గంపాడు ఎస్ఐ పి.సంతోష్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.







ప్రమాదంలో తండ్రి.. కొడుకులు మృతి

జరిగిన ఈ ప్రమాదంలో తండ్రి, ఇరువురు కుమారులు మృతి చెందిన విషాదం సంఘటన చూపరులను కంటతడి పెట్టిస్తుంది. ప్రమాదంలో మృతి చెందిన దుర్గారావుకు చెందిన ఇరువురు కుమారులైన సందీప్, ప్రదీప్ లు తీవ్ర గాయాలై మృతి చెందారు. అదేవిధంగా ఈ ప్రమాదంలో మృతి చెందిన దుర్గారావు, శ్రీనివాసరావు వరసకు తోడల్లుళ్ల కావటం విశేషం. ఒకే కుటుంబానికి చెందిన వారు ఈ ప్రమాదంలో మృతి చెందటం.. తీవ్ర గాయాలు కావడంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

విద్యతోనే బాలల భవిష్యత్తు

సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఎమ్మెల్యే హరిప్రియ

నవతెలంగాణ-ఇల్లందు



రాష్ట్రంలో విద్య బాగుంటేనే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. సంజయ్ నగర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పిల్లలకు సంపూర్ణ పోషక ఆహారం అందిస్తే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని విద్య వైద్యం మీద ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. గతంలో ఈ స్కూలు ఎలా ఉండేదో ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మనబడి ద్వారా ఎలా ఉందో చూస్తే మీకే అర్థమవుతుందన్నారు. పిల్లలకు కావాల్సిన మౌలిక అన్ని వసతులు ఏర్పడ్డాయి మన ఊరు మనబడిలో భాగంగా నియోజకవర్గంలో సంజయ్ నగర్ లో అన్ని మౌలిక వసతులతోని ఎలా ఉందో నియోజకవర్గంలో అన్ని పాఠశాలను అలానే అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సంవత్సరంలో పిల్లల కావలసిన నోటుబుక్కులను కూడా ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి పులిగండ్ల మాదారావు, వైస్ ఎంపీపీ, ప్రమోద్ కుమార్ మండలం కో ఆప్షన్ గాజీ బాలాజీ నగర్ ఉపసర్పంచ్ యాకుబీ, డిసిసిబి డైరెక్టర్ జనగాం కోటేశ్వరరావు, మండల ఇంచార్జ్ యలమద్ది రవి పాల్గొన్నారు.

భద్రాచలం ఇన్‌చార్జి తహసీల్దారుగా పి.వి.రామకృష్ణ

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం ఇన్‌చార్జి తహసీల్దారుగా పీవీ రామకృష్ణకు కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుత తహసీల్దార్ వేరే జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనవలసి వస్తున్నందున భద్రాచలం తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో సిపిఎం పార్టీ ఈ విషయాన్ని గమనించి... తాసిల్దార్ కార్యాలయం సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ క్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిఏఓగా పనిచేస్తున్న పివి రామకృష్ణకు ఇన్చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. గతంలో పీవీ రామకృష్ణ భద్రాచలంలో తహసీల్దార్‌గా పని చేశారు. చక్కని సమర్థవంతమైన తాసిల్దారుగా ఆయన పేరు సంపాదించారు.

ఎమ్మెల్యేచే అవార్డు అందుకున్న మంగపేట పీహెచ్‌సీ ఉత్తమ ఉద్యోగులు

నవతెలంగాణ-ములకలపల్లి

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం అశ్వారావుపేటలో సీహెచ్సీలో వైద్య ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతుల మీదుగా మంగపేట పీహెచ్సీకి చెందిన స్టాఫ్ నర్సు సరళకుమారి ఉత్తమ స్టాఫ్ నర్సుగా, ఆరోగ్యమిత్ర ఎం.చిరుమప్ప ఉత్తమ ఆరోగ్యమిత్రగా అవార్డులు అందుకున్నారు. వీరిరువురికి కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌తో పాటు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

గిరిజన పిల్లల ప్రగతికై అందరూ కష్టపడాలి

ఐటీడీఏ ఏపీవో జనరల్

నవతెలంగాణ - భద్రాచలం

గిరిజన విద్యార్థిని, విద్యార్థుల సంక్షేమానికి ఆశ్రమ పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పడం జరిగిందని, పిల్లల తల్లిదండ్రులతో కలిసి పిల్లలతో మమేకమై మీరందరూ విధులు నిర్వహిస్తే తప్పకుండా మీకు గుర్తింపు రావడమే కాక, గిరిజన పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్), ఇన్‌చార్జి ఆర్‌సిఓ (గురుకులం), డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డేవిడ్ రాజ్ అన్నారు. బుధవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో జిపిఎస్ పాఠశాలలు నిర్వహణ తీరుపై కాంప్లెక్స్‌ల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సిఆర్పీల పరిధిలోని జీపీఎస్ పాఠశాలలో చదువుతున్న పిల్లల వ్యక్తిగత శుభ్రతతో పాటు, పాఠశాలల్లోని పరిసరాల పరిశుభ్రతలు, అన్ని రకాల సౌకర్యాలు ఉన్నవి, లేనివి ఎస్‌సిఆర్‌పిలు చూసుకోవాలని, సోమవారం నాటికి ప్రతి పాఠశాలలో 100% పిల్లలు హాజరుకావాలని, పిల్లలు రాకపోతే వారి తల్లిదండ్రులతో మాట్లాడి మన శాఖ తరపున పాఠశాలలకు అందుతున్న యూనిఫామ్, నోట్ బుక్, పెన్సిల్ ,పెన్నులు, ఇతర వస్తువులు అన్ని సమకూరుస్తున్నట్లు వారికి తెలియజేయాలని అన్నారు.

కాంప్లెక్స్‌ల పరిధిలోని గ్రామాల్లో ట్రైబ్ గానీ, నాన్ ట్రైబ్ గానీ, చెవిటి, మూగ, వికలాంగుల పిల్లలు ఎవరైన ఉంటే భద్రాచలంలోని వికాసం స్కూల్లో జాయిన్ అయ్యేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీఎం ఓ.రమణయ్య, జిసిడిఓ అలివేలు మంగతాయారు, భద్రాచలం, దమ్మపేట, ఏటీడీవోలు నరసింగరావు, చంద్రమోహన్, స్కూల్ కాంప్లెక్స్‌ల ఎస్‌సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

మణుగూరు: విద్యారంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి విడనాడాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.మురళీమోహన్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షులు షేక్ మీరా హుస్సేన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సత్వరమే టీచర్ల అంశాన్ని పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. విద్య రంగంలో ఖాళీలు ఉండటం వలన సరైన పర్యవేక్షణ లేక విద్యాభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. మండల అధ్యక్షులు షేక్ మీరా హుస్సేన్ మాట్లాడుతూ బడిబాటలో అందరూ పాల్గొని ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలన్నారు. సకాలంలో ఉచిత టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కారం సీతారాములు, పినపాక మండల ప్రధాన కార్యదర్శి బానోతు భాస్కర్, ట్రెజరర్ మేరెడ్డి ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యక్షులు తోట విజయలక్ష్మి, సీనియర్ నాయకులు నిట్ట రాంబాబు, రత్న ప్రసాద్ కుమారస్వామి, అన్నపూర్ణ, కాంతారావు, కట్టా రాజకుమార్, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ రక్తదాన కార్యక్రమంలో పాల్గొనాలి

ఎమ్మెల్యే పోదెం వీరయ్య

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

నేడు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పొదెం వీరయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రజలందరూ రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధితో భాదపడుతున్న 60 మందికి పౌష్టిక ఆహార కిట్స్‌ను డా.ఎ మోహన్ రావు ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేయగా వాటిని రోగులకు ఎమ్మెల్యే అందించినారు. ఈ సందర్భంగా .డా.యస్.ఎల్ కాంతారావు మాట్లాడుతూ భద్రాచలం డివిజన్‌లో ఎక్కువ మంది రక్త హీనతతో బాధపడుతున్నారని సికెల్ సెల్ అనీమియా, తలసీమియా రక్త హీనత వ్యాధి ఎక్కువగా ఉన్నాదని, వారికీ సరిపడిన రక్తపు నిలువలు తక్కువగా ఉన్నవని తెలుపుతూ గడిచిన 2 రోజులలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా 46 మంది వివిధ రక్తదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళ్ సాయి సౌందర్యరాజన్ ద్వారా పురస్కారం అందుకున్న కొప్పుల మురళి పలు సార్లు రక్తదానం చేసిన మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ భద్రాచలం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఆర్‌సిఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఎల్ఎన్ వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, ఎల్.ఎన్.వై.భాను ప్రసాద్, టి.సిద్దులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సేవలే కాదు

వారి బాధలు కూడా వర్ణనాతీతం

- అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు

-అమలు చేయండి

కలెక్టర్‌కు సీఐటియు విజ్ఞప్తి

నవతెలంగాణ - భద్రాచలం

అంగన్వాడీలు చేస్తున్న సేవలు గొప్పవని వారి సేవలను ఎంత చెప్పినా వర్ణనాతీతం అని తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సభలో జిల్లా కలెక్టర్, అధికార పార్టీ కొత్తగూడెం ఎమ్మెల్యే ప్రశంసించడాన్ని సిఐటియు స్వాగతిస్తుందని, అదే సందర్భంలో అంగన్వాడీ సేవలు మాత్రమే కాదని వారు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా వర్ణనాతీతంగాని ఉన్నాయని సిఐటియు పేర్కొన్నది. అంగన్వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్, అధికార పార్టీ ఎమ్మెల్యేలు కృషి చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.బ్రహ్మాచారి, ఏజే రమేష్, జిల్లా కోశాధికారి జి పద్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వాట్సప్, ఈమెయిల్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం పంపించారు. అంగన్వాడీ టీచర్లు ప్రభుత్వం అమలు జరిపే సంక్షేమ పథకాలకు నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రూ.13 వేల రూపాయలతో జీవనం సాగిస్తున్న అంగన్వాడీ టీచర్ల పిల్లలకు ఉన్నత చదువులు చదువుకునేందుకు అవసరమైన ఆదాయం సర్టిఫికెట్లను రెవిన్యూ అధికారులు ఇవ్వటం లేదని ఈ సమస్యను జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ టీచర్ల ఆడపిల్లలకు వివాహం అయితే కళ్యాణ లక్ష్మి పథకాన్ని అమలు చేయాలని సిఐటియు విజ్ఞప్తి చేసింది. పోషకాహార లోపం నివారించడంలోనూ, ప్రీ స్కూల్ విద్యను ప్రాథమిక విద్యను బలోపేతం చేయటంలో అంగన్వాడీ టీచర్లు కీలకమైన పాత్ర పోషిస్తున్నారని సిఐటియు పేర్కొన్నది. ప్రభుత్వం అమలు చేసే అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయటంలో అంగన్వాడీలు ముఖ్య భూమిక పోషిస్తున్న విషయాన్ని కలెక్టర్ ప్రభుత్వ పెద్దలు అంగీకరిస్తున్నారని ఇదే సందర్భంలో అంగన్వాడీ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంలో కనీస వేతనం రూ. 26,000 ఇవ్వడంలో, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించడంలోనూ గ్రాట్యుటీ చట్టం అమలు చేయడంలోనూ ప్రభుత్వం ముందుకు రావటం లేదని సిఐటియు విమర్శించింది. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకుంటున్న ప్రభుత్వం ఆ సేవలు అందించటానికి తమ శ్రమను ధారపోస్తున్న మహిళా కార్మికులకు హక్కులు సౌకర్యాలు ఎందుకు కల్పించడం లేదని సిఐటియు ప్రశ్నించింది. ఐసిడిఎస్ నిర్దేశించిన విధులతో పాటు ప్రభుత్వం అనేక అధికారిక అనధికారిక కార్యక్రమాలను అంగన్వాడీ టీచర్ల తోటి ప్రభుత్వం నిర్వహిస్తుందని వారి శ్రమను బహుళ రూపాలలో వినియోగించుకుంటుందని సిఐటియు పేర్కొన్నది. అంగన్వాడీల శ్రమను తీసుకోవటానికి ఉన్న శ్రద్ధ వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చూపటం లేదని సిఐటియు పేర్కొన్నది. అంగన్వాడీ టీచర్లలో సొంత ఇల్లు లేని వారు ఇంటి జాగా లేనివారు వేల సంఖ్యలో ఉన్నారని వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లులు ఇవ్వాలని చేసింది. అనేక ఇబ్బందులను ఎదుర్కొని అంగన్వాడీ టీచర్లు సామాజిక బాధ్యతను కూడా నిర్వహిస్తున్నారని కాబట్టి ప్రభుత్వం రాష్ట్రంలో అమలు జరిపే అన్ని రకాల సంక్షేమ పథకాలను అంగన్వాడీ టీచర్లకు హెల్పర్లకు మినీ టీచర్లకు వర్తింపజేయాలని చేసింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆయన అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వటంతో పాటు గ్రాటిటీ చట్టాన్ని అమలు చేయాలని సిఐటియు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

పోలవరం ఎత్తు తగ్గించాలి



- గోదావరి వైపు కరకట్ట నిర్మించాలి

- సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు

నవతెలంగాణ -బూర్గంపాడు

పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల బూర్గంపాడు, భద్రాచల ప్రాంతాలు ముంపు గురవుతున్నాయని పోలవరం ఎత్తు తగ్గించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని సారపాకలో గల సుందరయ్య నగర్ లో సిపిఎం శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూర్గంపాడు మండలం వరదలకు ముంపు కాకుండా ఉండాలంటే కర కట్ట నిర్మించాలని ఆయన అన్నారు. భద్రాచల ప్రాంత పర్యటనకు వస్తున్న కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ఈ ప్రాంత ప్రజలకు స్పష్టమైన హామీని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. భద్రాచల రామాలయాన్ని, భద్రాచల ప్రాంతాలను ఎన్నడూ పట్టించుకోని బిజెపి ప్రభుత్వం ఎన్నికలు వస్తున్న తరుణంలో రాముడిపై ప్రేమ ఉన్నట్లుగా నటిస్తూ మరో మారు ప్రజలను మోసపరిచేందుకు వస్తున్నారని ఆయన అన్నారు. 9 సంవ త్సరాల కాలంలో భద్రాద్రి రాముల వారిపై ఎటువంటి శ్రద్ధ లేని హెూంశాఖ మంత్రి అమిత్ షాకు ఇప్పుడు గుర్తొచ్చిందా అని ఆయన ప్రశ్నించారు. రాముడిపై ప్రేమ ఉండటం మంచిదే గాని రామాలయం మునిగిపోతుంటే కాపాడే విధంగా చర్యలు తీసుకుని కరకట్ట ఎత్తును పెంచాలని ఆయన అన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిం చాలని ఆయన అన్నారు. మండలంలో నాగినేని ప్రోలు రెడ్డి పాలెం, బూర్గంపాడు, సారపాక, సుందరయ్య నగర్, మోతే, ఇరవెండి ఈ గ్రామాలు మొత్తం గోదావరి వరదలో మునిగి పోతున్నాయని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు రైతులు పొలాలు వ్యవసాయం చేసుకోవడానికి లేకుండా గోదావరిలోనే మునిగిపోతున్నాయని ఆయన అన్నారు. పశువులు కూడా మేతలేక ఇబ్బందులకు గురవుతున్నాయని, వ్యవసాయ కార్మికులకి పని దొరికే పరిస్థితి లేదని వెల్లడించారు. అందుకోసం భద్రాచలం ప్రాంతంలో కరకట్ట ఏరకంగా నిర్మాణం చేశారో అదే రకంగా సారపాక ప్రాంతం బూర్గంపాడు మండలంలో కూడా చేయాలని ఆయన అన్నారు. పాండు రంగాపురం నుండి సారపాక మీదుగా భద్రాచలం కొవ్వూరు వెళ్లే మార్గం రైలును నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతం ప్రజలకు అన్ని విధాలుగా రైలు ఉపయోగపడుతుందని, ఐటిసి పిఎస్పీడీ ఫ్యాక్టరీ ఉండటం వల్ల రైలు అవసరమని ఇది కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. హెూం శాఖ మంత్రి అమిత్ షా భద్రాచలం వచ్చినందుకు వీటిపైన ప్రణాళిక తయారుచేసి, ఇది అమలు అయ్యే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన, ఎస్కే అబిదా, కొలూరి నాగమణి, విలా సాగర్ రజిని, మీనా, ఎంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాహం...దాహం అంటున్న ప్రజలు

- పట్టించుకోని అధికారులు

- అంబేద్కర్ విగ్రహం వద్ద ఖాళీ బిందేలతో నిరసన

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం మున్సిపాలిటీలో తీవ్ర ఎండాకాలంలో మంచినీళ్ల రాక ప్రజలు దాహం... దాహం అని గొంతు లెండుతున్న ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు ఖాళీ బిందెలు నెత్తికెత్తుకుని పలకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వై. శ్రీనివాసరెడ్డి, సిపిఐ నాయకులు కౌన్సిలర్ బోయిన విజయ్ కుమార్, కౌన్సిలర్ నేరేళ్ల సమైక్య, ఏఐటీయూసీ కొత్తగూడెం పట్టణ కన్వీనర్ నేరేళ్ల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

'భద్రాద్రి రక్తదాత'కు గవర్నర్ పురస్కారం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలానికి చెందిన యువకుడు, 50కు పైగా రకదానం చేసి పలువురిని అపత్కాల పరిస్థితుల్లో ఆదుకున్న కొప్పుల మురళి విశిష్ట పురస్కారం అందుకున్నాడు. బుధవారం హైద్రాబాద్‌లోని రాజ్ భవన్‌లో సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ప్రపంచ రక్తదాన దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అత్యధిక సార్లు రక్తదానం చేసినందుకు, అలాగే ఏజెన్సీలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరికో రక్తదానం చేసి విశిష్ట సేవలు అందించినందుకు గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ చేతులు మీదుగా మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల. మురళికి పురస్కారం అందజేసి సేవలను కొనియాడారు. అనంతరం భవిష్యత్తులో కూడా ఇలాగే మరిన్ని సేవలు అందించాలని కోరారు.

చంద్రుగొండ వైద్యులకు అవార్డులు

నవతెలంగాణ-చంద్రుగొండ

అశ్వారావుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో జరిగిన దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అశ్వారావుపేట శాసన సభ్యులు మెచ్చా నాగేశ్వర రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ చేతుల మీదుగా డాక్టర్ కనకం తనుజ, డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఫార్మాసిస్ట్ ఎం.లక్ష్మి కె.రాజేశ్వరి, ఆశాలు అవార్డులు అందుకున్నారు. ఇది నిర్వహణలో అంకి అంకితభావంతో పని చేసిన వారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుందన్నారు. వీరిని వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు మండల ప్రజలు అభినందించారు.

చేగువేరా స్ఫూర్తి తో యువత పోరాడాలి..

నవతెలంగాణ-కొత్తగూడెం

చేగువేరా స్ఫూర్తితో యువత పోరాడాలని భారత ప్రజాతంత్రదిన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరికృష్ణ పిలుపు నిచ్చారు. ప్రపంచ విప్లవకారుడు చేగువేరా 95వ జయంతి కార్యక్రమాన్ని రామవరం సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలంగి హరికృష్ణ మాట్లాడుతూ ప్రాపంచిక దృక్పథంతో అసమానతలు లేని సమాజం కోసం పరితపించిన గొప్ప ప్రపంచ విప్లవకారుడు చేగువేరా అన్నారు. సామ్రాజ్యవాద అమెరికా అనేకరకాలుగా ఇబ్బందులకు గురిచేసినా, ప్రాణ హాని తలపెట్టినా మొక్కవోని ధైర్యంతో సోషలిస్టు సమాజం కోసం తపించిన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.నవీన్, కళ్యాణ, ఎస్.రాహుల్ తేజ, యుగేందర్, జి.ధర్మతేజ, శ్రీనివాస్, ఆదిత్య శ్యామ్, రాకేష్, శ్రీనివాస్, బాలకృష్ణ, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ -దుమ్ముగూడెం

గిరిజన విద్యార్థుల కోసం భద్రాచలం ఐటిడిఏ వారు అందిస్తున్న ప్రతి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చింతగుప్ప సర్పంచ్ కట్టం కృష్ణ విద్యార్థులకు ంంసూచించారు. బుధవారం తోగ్గుడేం గిరిజన పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు బ్యాగ్స్, నోట్స్ షాట్స్ ,స్కూల్ డ్రెస్, స్పోర్ట్స్ డ్రెస్ ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ కట్టం కృష్ణ మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందజేయడంతో పాటు వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ సెక్రెటరీ వెంకట్, ప్రధానోపాధ్యాయుడు బి రవి, నరేందర్ ఎస్ఎంసి చైర్మన్ గంగరాజు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తకోట దయాకర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి ఆకస్మిక మరణం దురదృష్టకరం అని ఆయన మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని టిడిపి మండల అధ్యక్షులు కొమరం దామోదర్ రావు అన్నారు. దయాకర్ రెడ్డి టిడిపి పార్టీకి ఎనలేని సేవలు అందించారని ప్రజాప్రతినిధిగా, ప్రజలు మన్నలను పొందారన్నారు. ఆయన మృతికి టిడిపి మండల కమిటీ సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేస్తూ, ధైర్యంతో ముందుకు సాగాలని, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఉన్నారు.

ప్రగల్లపల్లి లిఫ్ట్‌కు నిధులు కేటాయించండి

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అన్నే సత్యనారాయణ మూర్తి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల రైతాంగానికి సాగునీటి అవసరాల దృశ్య సున్నం బట్టి వద్ద ప్రజల ప్రగల్లపల్లి లిఫ్ట్ ఏర్పాటు కోసం నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అన్నే సత్యనారాయణమూర్తి కోరారు. బుధవారం అశ్వాపురంలో జరిగిన సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పర్యావరణ పరిరక్షణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ప్రగల్లపల్లి లిఫ్ట్ ఏర్పాటుపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దుమ్ముగూడెం మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు సాగునీరు అందించే ప్రగళ్లపల్లి లిఫ్ట్ ప్రాజెక్టు త్వరిగతిన చేపట్టి పూర్తి చేయాలని ప్రభుత్వ అధికారులకు దుమ్ముగూడెం మండల రైతాంగం తరుపున విన్నవించారు.

నర్సాపురం వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బుధవారం నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు యాపిల్, అరటి పండ్లు పంపిణీ చేశారు. వీటిని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుభాష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ భారతితో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన బీసీ వృత్తిదారులందరికీ ప్రభుత్వ రుణాలు ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్

నవతెలంగాణ-ఇల్లందు

ప్రభుత్వం ప్రకటించిన విధంగా అర్హులైన వెనుక బడిన తరగతికి చెందిన వృత్తి దారులకు లక్ష రూపాయల రుణాలు ఇవ్వాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం గడువును జూన్ 20 వరకే ఇవ్వడంతో వృత్తిదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేసినా ధృవ పత్రాల పని కాక హైరానా పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకునే గడువు పెంచాలని అన్నారు. స్థానిక కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆలేటి కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, శంకర్, ఖాదర్, సర్వన్ కుమార్,అబ్బాస్,వేంకటేశ్వర్లు,సంధ్య,సుల్తానా, మరియ, వాసం రాము, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

సులానగర్ ప్రాథమిక వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా పత్రాలు

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని సులానగర్ ప్రాథమిక ప్రభుత్వ వైద్యశాల సిబ్బందికి ఉత్తమ సేవా పత్రాలు ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ బుధవారం అందజేసినట్లు తెలిపారు. ఇల్లందు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు జరిగిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం వేడుక కార్యక్రమంలో ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఉత్తమ సేవలు, అత్యుత్తమ ప్రతిభ పనితీరు కనబరిచినందుకు అభినందించినట్లు తెలిపారు. ఏఎన్ఎంలు గంగారం ఆరోగ్యం ఉప కేంద్రం ఇర్ప నాగలక్ష్మి , కోయగూడెం రమాకుమారి, బోడు సుజాత, స్టాఫ్ నర్స్ టి.సునీత కుమారి, పల్లె దవాఖాన వైద్యులు బద్దు తండా ధరణి, బోడు భార్గవి, బేతంపూడి ఆశా కార్యకర్త కోరం స్వరూపకు ఇల్లందు శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందుకోవడం జరిగిందన్నారు.

హీరో ఫ్యాషన్ ఫ్లస్ మోటార్ సైకిల్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మణుగూరు



హీరో ఫ్యాషన్ ఫ్లస్ మోటార్ సైకిల్ ను మణుగూరు ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ భూక్య రాములు బుధవారం ఆవిష్కరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు లోని శ్రీ భార్గవ ఆటో మొబైల్స్ హీరో షోరూం నందు నూతన హీరో ఫ్యాషన్ ఫ్లేస్ బైక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హీరో కంపెనీ ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీతో నూతన మోడల్స్ తో ప్రజల అవసరాలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇందులో సైడ్ స్టాండ్ ఇండికేటర్ మొబైల్ ఛార్జింగ్ పోర్ట్ కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి హీరో కంపెనీ టీ ఎస్ ఒ శ్రీనివాస్ ముఖ్య అతిథి గా సాయి ఆటో కన్సల్టెన్సీ కొండయ్య ఏజెంట్ నవీన్ ఆటో షోరూం అశోక్ రెడ్డి విజయలక్ష్మి ఆటో కన్సుల్టెన్సీ పున్నం కుమార్, రత్నాకర్, రమేష్, కోటేశ్వరి, క్రాంతి ఎస్‌బిఐ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

2023 కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, జగదీష్ కాలనీ భద్రాచలం నందు నేటి బడిబాట కార్యక్రమంలో భాగంగా "సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం" పాఠశాలలో జేడీ ఫౌండేషన్ భద్రాచలం నిర్వాహకులు "అంబికా మొబైల్స్ "అధినేత సురేష్ ఆర్థిక సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజా శ్రీనివాస్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు జ్యోతి కుమార్, లక్ష్మి, రామకృష్ణ, రమేష్, జె. శ్రీను, టి. శ్రీనివాసరావు, విజయ్ కుమార్ మరియు శ్రీలత పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన జెడి ఫౌండేషన్ నిర్వాహకులు సురేష్ గారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం ధన్యవాదాలు తెలియజేశారు.

సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంచిన డాక్టర్స్

నవతెలంగాణ-ఇల్లందు

వైద్య విభాగం ఆధ్వర్యంలో దశాబ్ది వేడుకలలో భాగంగా బుధవారం డాక్టర్స్ సాయి చరిష్మా, తేజాశ్రీ, విజయ, సింధు, లాస్యలు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్స్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో పండ్లను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్స్ లు జగ దాంభ, పర్వీన్ సిబ్బంది పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద దేశాలను గడగడలాడించిన ధీరు దత్తుడు చేగువేరా

నవతెలంగాణ-చంద్రుగొండ

సామ్రాజ్యవాద దేశాలను గడగడలాడించిన ధీరుడు చేగువేరా అని సిపిఎం మండల కమిటీ సభ్యులు రాయి రాజా అన్నారు. బుధవారం సిపిఎం పార్టీ కార్యాలయంలో విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రపంచ విప్లవ వీరుడు చేగువేరా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు రాయి రాజా మాట్లాడుతూ ప్రపంచంలో చేగువేరా తెలియని వారు లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు దాసరి సీతారాములు, బత్తుల నాగేశ్వరరావు, రామడుగు వెంకటాచారి, కొండ. నరసింహారావు, చంటి, ఎస్డి బడే సాబ్, మాలోత్.బాలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజనలో భద్రాచలానికి జరిగిన అన్యాయంపై అమిత్ షా స్పందించాలి

-భద్రాచలం గోదావరి ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టాలి

-దక్షిణ అయోధ్య భద్రాద్రి రాముని పట్ల బిజెపి వివక్షత విడనాడాలి

-సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్



నవతెలంగాణ - భద్రాచలం

రాష్ట్ర విభజనలో భద్రాచలం ప్రాంతానికి జరిగిన అన్యాయంపై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా స్పందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పోలవరం పేరుతో భద్రాచలం నియోజకవర్గంను ముక్కలు చేస్తూ ముంపు మండలాలను ఆంధ్రాలో కలుపుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధాని మోడీ స్పెషల్ ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వమే తప్పును సరిదిద్దాలనీ రెండు తెలుగు రాష్ట్రాలను సమన్వయం చేసి పోలవరం ముంపు నుండి భద్రాచలం పట్టణ రక్షణకు, ఐదు గ్రామపంచాయతీలను భద్రాచలం కలిపేందుకు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. దక్షిణ అయోధ్య భద్రాద్రి రాముని పట్ల బిజెపి వివక్షత విడనాడాలని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని రామాలయం సర్క్యూట్లో చేర్చాలని, భద్రాచలానికి రైల్వే లైన్ వేయాలని, భద్రాచలం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, విభజన హామీలు భాగంగా భద్రాచలంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు

కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు

వైద్య ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు రావు



నవతెలంగాణ-మణుగూరు

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో వైద్య రంగానికి పెద్ద పీట వేశారని ప్రభుత్వ దవాఖానాలపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని స్నేహ గార్డెన్స్‌లో తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్య ఆరోగ్యశాఖ సాధించిన విజయాలను ఎల్ఈడి స్క్రీన్‌పైన వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వరాష్ట్రంలో సర్కార్ వైద్యంపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఏర్పడిందన్నారు. ఏ రోగమొచ్చినా ఆధునాతక చికిత్స దొరుకుతుందనే భరోసా కలిగిందన్నారు. సకల సౌకర్యాలు కల్పించి కార్పొరేట్ స్థాయిలో ఆధునాతక వైద్య చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చారు. పేదల సంక్షేమం కోసం వినూత్న పథకాలను ప్రవేశపెట్టారు అన్నారు. డయాలసిస్, డయాగ్నస్టిక్స్, సెంటర్లో కెసిఆర్ కిట్టు అమ్మ ఒడి లాంటి కార్యక్రమాలను ప్రారంభించారు. ఫలితంగా ప్రభుత్వ దావఖానాలపై ప్రజలకు నమ్మకం కలిగిందన్నారు. ఏరియా సూపరెంటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్, ఆర్ఎంఓ సునీల్, డాక్టర్ సరేష్, ఆసుపత్రి సర్జన్ డాక్టర్ విజయకుమార్, డాక్టర్ ఆనంద్ రావు, డాక్టర్ సునీల్, జెడ్పిటిసి పోశం నరసింహారావు, పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు అధిక సంఖ్యలో వైద్య సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.

కేసీఆర్ కృషితో ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం

మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఇచ్చినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కి రుణపడి ఉంటా

కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు

నవతెలంగాణ-కొత్తగూడెం



తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ కృషితో తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందుతున్నాయని, కొత్తగూడెంలో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఇచ్చినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కి రుణపడి ఉంటానని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆరోగ్య తెలంగాణ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగూడెం మెడికల్ కాలేజిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్ల దేశంలో పేదలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించడంలో తెలంగాణ రాష్ట్రం మూడో స్థానంలో ఉందన్నారు. మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజి విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. గ్రామీణ ప్రాంత పేదలకు వైద్యసేవలు అందించాలని సూచించారు. బస్తీ దాకానాలతో పేదలకు వైద్యాన్ని అందుబాటులో తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేఅన్నారు. అనంతరం ఆశాలకు చీరలు, కెసిఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ఎల్.లక్ష్మణ్‌రావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు,చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, కొత్తగూడెం సర్వజన పాల్వంచ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు, కొత్తగూడెం సూపర్డెంట్ గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బోడా కుమార్ స్వామి, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుకృత, జిల్లా సంక్షేమ అధికారి సంజీవరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, కళాశాల సిబ్బంది, అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో బలోపేతమైన ఆసుపత్రులు

- సర్కార్ వైద్యంపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం
- ఉచితంగానే కార్పొరేట్ స్థాయి సేవలు
- ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల రూ. 85 లక్షలతో ఆధునీకరణ : డయాలసిస్ సేవలు
- కరోనా సమయంలో ఆశాల సేవలు అమోఘం
- వైద్య ఆరోగ్య దినోత్సవ సభలో ఎమ్మెల్యే హరిప్రియ

నవతెలంగాణ-ఇల్లందు



గత తొమ్మిది ఏండ్ల సీఎం కేసీఆర్ పాలనలో ప్రభుత్వాసుపత్రులు బలోపేతమయ్యాయని ఎంఎల్ఏ హరిప్రియ అన్నారు. అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉండటంతో సర్కార్ వైద్యంపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం కలిగిందన్నారు. పట్టణాలలోని ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవ సంబరాలు సభ ఘనంగా నిర్వహించారు. అధికారులు, వైద్య బందం వారికి పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. బతుకమ్మలతో ఆడి పాడారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు, వైద్య ఆరోగ్యశాఖ సాధించిన విజయాలను ఎల్ఈడి స్క్రీన్ పైన వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో వైద్య రంగానికి పెద్ద పీట వేశారని అన్నారు. 70 సంవత్సరాలుగా కానటువంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నెరవేర్చి చూపించడం జరిగింది అన్నారు. ఎవరికైనా ఏదైనా అనారోగ్యంగా ఇబ్బంది ఉందంటే ఆర్ఎంపి డాక్టర్ల దగ్గరికి వెళ్లేవారం, కానీ ఈ రోజు నిమ్స్, ఉస్మానియా, గాంధీ హాస్పటల్స్ మాత్రమే సిటీలో గుర్తుకొచ్చేది. ఇప్పుడున్నటువంటి పరిస్థితుల్లో అవి సరిపోవు అనేసి స్వయంగా ముఖ్యమంత్రి వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ లో దాదాపు 1000 పడకలతో పెంచుతూ అక్కడ ఉండేటటువంటి జైలును సైతం వేరే దగ్గరకు తరలించి ప్రజల ఆరోగ్యమే ముఖ్యము అనేసి అత్యంత దగ్గరగా చేరువ చేయడం జరిగిందన్నారు. ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల రూ. 85 లక్షలతో ఆధునీకరణ : డయాలసిస్ సేవలు

కరోన సమయంలో ఆశాల సేవలు అమోఘం

ఒకప్పుడు ఇల్లందు వైద్యశాలలో వైద్యం నామమాత్రంగానే ఉండేదని నేడు రూ. 85లక్షలతో ఆధునీకరణ, డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గైనకాలజిస్ట్, పిల్లల వైద్యులతో పాటు 16 మంది స్పెషలిస్ట్ లు పనిచేస్తున్నారని అన్నారు. 60 క్యూబెక్టమి ఆపరేషన్లు, 303 డెలివరీలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు 98, జనరల్ ఆపరేషన్‌లు 172 జరిగాయన్నారు. 1675 ఈసీజీలు, 2050 ఎక్సరేలు తీసి వైద్యం నిర్వహించామన్నారు. హైదరాబాదులో బస్తి దవాఖానలు ఉన్నట్టుగానే ఇల్లెందులో సైతం రెండు బస్తీ దవాఖానాలను గ్రామాలలో ఉప కేంద్రాలను ప్రారంభోత్సవం చేసుకున్నామన్నారు. సమైక్య పాలనలో నేను రాను బిడ్డ సర్కారు దావఖానాలలో అని పాడుకున్న జనం ఇప్పుడే దావకానకు జై కొడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరావు,వైస చైర్మన్ జానీ ,కమిషనర్ అంకుశవాలి, కౌన్సిలర్లు, సి హెచ్ సి సూపర్డెంట్ డాక్టర్ శిరీష్ కుమార్,డియంఓ డాక్టర్ హర్షవర్ధన్,డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలి

నవతెలంగాణ-భద్రాచలం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 17న తెలంగాణ రాష్ట్ర అవతరణ గిరిజన ఉత్సవాలు నిర్వహిస్తున్నందున, ఉత్సవాలు విజయవంతం అవ్వడానికి తమ వంతు కృషి చేయాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. బుధవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో ప్రాజెక్ట్ అధికారి గౌతమ్ పోట్రూ ఆదేశానుసారం ఐటీడీఏ పరిపాలన అధికారి భీమ్, ఇతర అధికారులతో కలిసి గిరిజన ఉత్సవాలు ఏర్పాట్లపై ఎస్‌సిఆర్‌పిలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని మండలాలు, గ్రామాల్లో ఉన్న ఎంపీపీలు, జడ్పిటిసిలు, ఎంపీటిసిలు, తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది గిరిజన ఉత్సవాలలో పాల్గొనేలా వారికి తప్పకుండా ఆహ్వాన పత్రాలు అందేలా, సంబంధిత ఎస్సిఆర్పీలు వారి ఇంటికి వెళ్లి ఆహ్వాన పత్రాలు అందజేయాలని, ఈ కార్యక్రమానికి భద్రాచలానికి వచ్చేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, డీఎస్ఓ ప్రభాకర్ రావు, ఐటిడిఏ మేనేజర్ ఆదినారాయణ, జిసిడిఓ అలివేలు మంగతాయారు, ఏటిడిఓ నరసింహారావు, ఏటీడీవో చంద్రమోహన్, చలపతి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రపతిని కలిసిన కొండారెడ్లు

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐటీడీఏ భద్రాచలం ఏజెన్సీ ఏరియా పరిధిలోని కొండ రెడ్ల గిరిజనులు రాష్ట్రపతిని కలవడానికి 15 మందిని పంపించామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 250 మంది ఆదిమ జాతి తెగలకు చెందిన గిరిజనులతో సోమవారం సాయంత్రం రాష్ట్రపతి సమావేశం అయ్యారని, మంగళవారం సాయంత్రం వివిధ రాష్ట్రాలకు చెందిన వారిని కలిసిన రాష్ట్రపతి వారితో మాట్లాడారని తెలిపారు. ఈ క్రమంలో భద్రాచలం ఐటిడిఏ పరిధిలోని దమ్మపేట మండలానికి చెందిన ఇద్దరు కొండరెడ్ల గిరిజనులు, అశ్వరావుపేటకు చెందిన 13 మంది, వారి వెంట ఉన్న ప్రత్యేక అధికారి అశోక్ కుమార్‌తో కలిసి రాష్ట్రపతిని కలిశారని పేర్కొన్నారు. రాష్ట్రపతిని కలవడానికి వచ్చిన ఆదిమ గిరిజనులకు అధికారులకు చీరలు, శాలువాలతో సత్కరించిన అనంతరం ఢిల్లీలో ఇండియా గేట్, నూతన పార్లమెంటు భవనం, రాష్ట్రపతి భవనంను, సందర్శించి ఆయా ప్రదేశాల ప్రత్యేకత గురించి ఐటీడీఏ అధికారులకు ఆదిమ గిరిజనులకు తెలపడానికి ప్రత్యేకంగా గైడును ఏర్పాటు చేసి వాటి విశిష్టత గురించి తెలపాలని సూచించినట్లు వెల్లడించారు.

మాంటిస్సోరి శ్రీ సత్య భాస్కరలో ప్రారంభోత్సవ వేడుకలు

నవతెలంగాణ-మణుగూరు

మాంటిస్సోరి శ్రీ సత్య భాస్కర పాఠశాలలో ఘనంగా పాఠశాల ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఐసక్ థామస్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులపై పుష్పాలు జల్లుతూ ప్రేమతో స్వాగతం పలికారు. తదనంతరం అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినామన్నారు. పిల్లలు ప్రతిరోజు పాఠశాలకు వచ్చి, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అదేవిధంగా ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా అనవసరంగా బయట తిరగకూడదని సూచించారు. పాఠశాల చైర్మన్ జోస్ నెడుం తుండం, పాఠశాల ప్రెసిడెంట్ ముల్లంగి శివారెడ్డి పిల్లలను అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

విప్ రేగా కాంతారావు

నవతెలంగాణ-మణుగూరు

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు రేగ కాంతారావు అన్నారు. బుధవారం స్నేహ గార్డెన్స్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రజాప్రతినిధులు వైద్య అధికారులతో కలిసి గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆరోగ్యం అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్నారని అన్నారు. గర్భిణీల సంక్షేమం గురించి ఆలోచించి సీఎం కెసిఆర్ కిట్ స్కీమ్‌ను ప్రారంభించారని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ న్యూట్రిషన్ ఆహార పదార్థాలను స్వీకరిస్తూ గర్భిణీలు మంచి ఆరోగ్యాన్ని పొందాలిన్నారు.

ఐసీడీఎస్ రక్షణ కోసం

రాష్ట్ర జీపు జాతాను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్

నవతెలంగాణ-పాల్వంచ



ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్వాడి ఉద్యోగులకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని, సమస్యల పరిష్కారం కోసం టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతాను జయప్రదం చేయాలని, జూన్ 25న పాల్వంచ ఆర్డీవో ఆఫీస్ రోడ్డులో జరిగే సభకు సీఐటియు ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు అవుతుందనీ, ఈ కాలంలో అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్కటి పరిష్కారం చేయలేదన్నారు. ఈ కాలంలో పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలు అనేక రేట్లు పెరిగాయని, పెరిగిన ధరల అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచడం లేదనీ, దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు చేస్తే 2018లో టీచర్లకు రూ.1500, హెల్పర్లకు 750 రూపాయలు మినీ వర్కర్లకు 1250 రూపాయలు కేంద్ర ప్రభుత్వం పెంచింది. కానీ కేంద్రం వాటా తన బడ్జెట్ 40% తగ్గించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని చెల్లించటం సాధ్యం కాదని చెప్పన్నారన్నారు. వేతనాలే కాదు బడ్జెట్ తగ్గింపు వల్ల మొత్తం ఐసిడిఎస్ సేవలకు అంతరాయం కలుగుతుందనీ, పక్కా భవనాలు, పోషక ఆహారం సెంటర్ అద్దెలు, మెనూ చార్జీలు ఖాళీ పోస్టులు తదితర అన్ని సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్లో ఉంటున్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెంచటానికి మాత్రం సిద్ధపడటం లేదన్నారు. 2013లో 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ స్కీం వర్కర్లు కార్మికులకు గుర్తించాలని, కనీస వేతనం పెన్షన్స్ ఈఎస్‌ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని సమావేశం తీర్మానం చేసినా.. ఈ తీర్మానానికి 9 సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదనీ విమర్శించారు. ఐసిడిఎస్ కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలన్నారు. ఐసిడిఎస్ కు ప్రమాదకరమైన 2020 నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రద్దు చేయాలనీ, నూతన విద్యా విధానం ఐఎల్సి సిఫార్సు అమలు చేయాలనీ, అంగన్వాడి ఉద్యోగులకు కనీస వేతనం 26000/- వేలు , పెన్షన్స్ ఈఎస్‌ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటి చెల్లించాలని, రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ కే సత్య పట్టణ కమిటీ సభ్యులు పండగ వెంకటరమణ, రాజ్యలక్ష్మి, రమ్య, చుక్కమ, సురేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ దవాఖానలో మెరుగైన వైద్య సౌకర్యాలు

50 లక్షలతో ఆస్పత్రిలో సిసి రోడ్లకు శంకుస్థాపన



మణుగూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానలలో ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేసిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. బుధవారం మణుగూరు మండలంలోని లంక మల్లారంలో గల 100 ఆసుపత్రిలో 50 లక్షల రూపాయల అంచనాతో డీఎంఎఫ్‌టి నిధులతో అంతర్గత సిసి రోడ్లకు శంకుస్థాపన నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి కోట్లాది రూపాయలు నిధులు కేటాయించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులతో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బస్తీ దవఖానాలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో 100 పడకల ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ రాంప్రసాద్, ఆర్ఎంఓ సునీల్, ఆసుపత్రి సర్జన్ విజయ్ కుమార్, ఆనందరావు, డాక్టర్ నరేష్, జెడ్పిటిసి పోస్టల్ నరసింహారావు, మండలాభివృద్ధి అధికారి చంద్రమౌళి, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

పరశురామ్ దర్శకత్వంలో మరో సినిమా

'గీత గోవిందం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత విజయ్ దేవరకొండ, పరశు రామ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాను నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తుండగా, క్రియేటివ్ ప్రొడ్యూసర్ గా వాసు వర్మ వ్యవహరించ నున్నారు. ఈ కాంబినేషన్ పై ఇప్పటికే అంచనాలు పెరిగాయి.



మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ, శ్యామ్ ప్రసాద్ రెడ్డి

బుధవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ఘనంగా ప్రారంభమైంది. హీరో, హీరోయిన్లు విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్‌పై నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టగా, ఫస్ట్ షాట్‌ను గోవర్ధన్‌రావు దేవరకొండ డైరెక్ట్ చేశారు. ఫైనాన్షియర్ సత్తి రంగయ్య కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలు కానుంది. 'సీతారామం' సినిమాలోని తన పర్ఫార్మెన్స్‌తో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో విజయ్ సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మితమవుతున్న 54వ చిత్రమిది.



అపర్ణ జనార్ధనన్, రోహిత్ బెహల్

మనసు మాట వినదే

క్లాసిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లతో ఆకట్టుకున్న దర్శకుడు కె దశరథ్ అందిస్తున్న కథతో తెరకెక్కుతున్న చిత్రం 'లవ్ యూ రామ్'. ఈ చిత్రానికి డివై చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. డివై చౌదరి, కె దశరథ్ కలిసి మన ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ చక్ర ఫీలింస్ బ్యానర్ లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రోహిత్ బెహల్, అపర్ణ జనార్ధనన్ జంటగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, పాటకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.తాజాగా ఈ చిత్రం నుంచి 'మనసు మాట వినదే' పాటని అగ్ర కథానాయకుడు నాగార్జున లాంచ్ చేశారు. కె వేద ఈ పాటని లవ్లీ మెలోడీగా కంపోజ్ చేయగా, దివ్య మాలిక శ్రావ్యంగా అలపించారు. వరికుప్పల యాదగిరి సాహిత్యం అందించిన ఈ పాటలో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ అందంగా ఉంది. సుధాకర్ బొర్రా (టేనస్సీ), డి నాగేశ్వరరావు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ గోపు, శివ మొక్క స్క్రీన్ ప్లే అందించారు. ప్రవీణ్ వర్మ మాటలు రాశారు. బెనర్జీ, ప్రదీప్, కాదంబరి కిరణ్, కార్టూనిస్ట్ మల్లిక్, మీర్, కె దశరథ్, డివై చౌదరి, ప్రభావతి వర్మ, శాంతి దేవగుడి తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి డీవోపీ: సాయి సంతోష్, సంగీతం: కె వేద, ఎడిటింగ్: ఎస్.బి ఉద్ధవ్, ఆర్ట్: గురు మురళీకృష్ణ.

దసరా కానుక

బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'భగవంత్ కేసరి'. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. టీజర్ గత రికార్డులను బద్దలు కొట్టింది. ఈ సినిమాలో శ్రీలీల కీలక పాత్రలో నటిస్తోంది. ఆమె పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ ఈ సినిమాలోని శ్రీలీల ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందమైన చిరునవ్వుతో శ్రీలీల పోస్టర్ అందర్నీ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, అర్జున్ రాంపాల్ పవర్‌ఫుల్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తు న్నారు. విజయదశమి (దసరా) కానుకగా ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, సంగీతం: ఎస్ థమన్.



శ్రీ లీల



జై క్రిష్, ఇంద్రసేన

ఇంద్రజాలం మొదలైంది

ఇంద్రసేన హీరోగా, జై క్రిష్ మరో ప్రధాన పాత్రలో పూర్ణాస్ మీడియా సమర్పణలో నిఖిల్ కె. బాల స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఇంద్రజాలం'. బుధవారం ఈ చిత్ర ప్రారంభ కార్యక్రమాలు రామానాయుడు స్టూడియోలో ఘనంగా జరిగాయి. ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ కోర్టులో న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న ఆర్. మాధవరావు కెమెరా స్విచ్చాన్ చేయడంతో ఈ సినిమా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మీడియాతో హీరో ఇంద్రసేన మాట్లాడుతూ, 'నేను నటించిన 'శాసనసభ' మూవీ నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. అమెజాన్ ప్రైమ్‌లో ఆ సినిమా చూసిన నిఖిల్ ఈ చిత్రంలో నాకు అవకాశం కల్పించారు' అని తెలిపారు.
'ఇది నాకు తొలి ప్రాజెక్ట్. ఇదొక క్రైమ్ థ్రిల్లర్‌తో కూడిన ప్రేమకథ. ఆద్యంతం ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా స్క్రీన్‌ప్లే ఉంటుంది. ఫస్ట్ నుంచీ ఫుల్ కామెడీ ఉంటుంది. ఇందులో ఇద్దరు హీరోయిన్స్ ఉంటారు. ఒకరిని మాత్రం 10 రోజుల్లో రివీల్ చేస్తాం. మరొక హీరోయిన్‌ను చివరి వరకూ సస్పెన్స్‌గానే ఉంచుతాం. రెండు షెడ్యూల్స్‌లో సినిమా పూర్తవుతుంది. ఒక షెడ్యూల్ బొంబాయిలో చేస్తాం. మరొకటి హైదరాబాద్‌లో చేస్తాం. .జూలై మూడో వారం నుంచి షూటింగ్‌కి వెళ్తాం' అని దర్శక, నిర్మాత నిఖిల్ చెప్పారు.

మెప్పించే సరికొత్త కాన్సెప్ట్

వరల్డ్ ఫోకస్ పిక్చర్ పతాకంపై ఆర్.కె బ్రోస్ సమర్పణలో బాసి దర్శకత్వంలో బి.సతీష్ నిర్మిస్తున్న చిత్రం 'ప్రేమ అనే నేను'. ఈ చిత్రం ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్మాత బి.సతీష్ మాట్లాడుతూ, 'కొత్త ఆర్టిస్టులతో ఈ సినిమా చేశాం. కాకినాడ, ఉప్పాడ, మచిలీపట్నం, వైజాగ్ సముద్ర ప్రాంతాల్లో షూట్ చేశాం. మెప్పించే సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ సినిమా చేస్తున్నాం. తప్పకుండా అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు.
'అందరి సపోర్ట్‌తో సినిమా చాలా బాగా వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే చిత్రం ఇది' అని దర్శకుడు బాసి అన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉండే కుర్రాడిగా మంచి పాత్ర చేశానని, నటనకు స్కోప్ ఉన్న పాత్ర అని హీరో ఆర్‌కె బ్రోస్ చెప్పారు.



బాసి, ఆర్‌కె బ్రోస్, బి.సతీష్

మాతృత్వం గొప్పతనం తెలిపే చిత్రం

నాని మూవీ వర్క్స్ అండ్ రామా క్రియేషన్స్ పతాకంపై విశ్వ కార్తికేయ, ఆయుషి పటేల్ హీరో, హీరోయిన్లుగా రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి, జి మహేశ్వరరెడ్డి, కాటం రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం.1 చిత్ర పూజా కార్యక్రమాలు అన్నపూర్ణ స్టూడియోలో ఘనంగా ప్రారంభమయ్యాయి. నటులు సుమన్ స్క్రిప్ట్ అందించగా, హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి షాట్‌కు నిర్మాత కె.ఎస్ రామారావు క్లాప్ కొట్టారు. దర్శకుల సంఘం అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ కెమెరా స్విచ్ ఆన్ చేసారు. దర్శకులు నీలకంఠ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాతలు మాట్లాడుతూ,' స్త్రీ తల్లి అవ్వడం ఒక అదృష్టం. ఆ అదృష్టాన్ని సరిగ్గా వినియోగించుకోకపోతే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది ఈ చిత్ర కథాంశం. జూలై మొదటి వారంలో షూటింగ్ ప్రారంభించి, సెప్టెంబర్‌లో మూవీ రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు. దర్శకుడు రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ,'ఫుల్ థ్రిల్లర్ సెంటిమెంట్‌తో వస్తున్న ఈ సినిమా అన్ని వర్గాల వారికీ కచ్చితంగా నచ్చుతుంది' అని చెప్పారు. 'ఇలాంటి మంచి సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు' అని హీరో విశ్వ కార్తికేయ తెలిపారు. హీరోయిన్ పాత్రకు చాలా ఇంపార్టెన్స్ ఉందని ఆయుషి పటేల్ చెప్పారు.



విశ్వ కార్తికేయ, ఆయుషి పటేల్

అద్భుతమైన గ్రామీణ నేపథ్య కథ

విగ్నేష్ రెడ్డి గవి, శ్రీ ఆశ్రిత కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం 'రాజా రమ్యం'. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ బుధవారం రిలీజ్ చేశారు. ప్రనిల్ గౌరీ పాగ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాకు ఆర్యన్ గండికోట కథ, స్క్రీన్ ప్లే అందించారు. కోకొండ జయచందర్ రెడ్డి, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని గావి ఫిలిమ్స్, సిల్లీ మాంక్స్ స్టూడియోస్ పై తెరకెక్కిస్తున్నారు
ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ ఒక విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో ఇద్దరు విద్యార్థులు సైకిల్ మీద కలిసి వెళ్తున్న సన్నివేశాన్ని మనం చూడొచ్చు. రొటీన్‌కు భిన్నంగా ఉన్న ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా మనం ఒక అద్భుతమైన విలేజ్ డ్రామాను చూడబోతున్నాం అనే విషయం క్లియర్‌గా అర్థమవుతుంది. ఒక అద్భుతమైన కథను ప్రేక్షకులకు ఈ సినిమా అందించనుంది.
ఈ మధ్యకాలంలో వచ్చిన ఎన్నో సినిమాలు రూరల్ డ్రామాలు కాగా, అదే కోవకు చెందిన ఈ సినిమా కూడా ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటోంది అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం : చరణ్ అర్జున్, ఎడిటర్ : ప్రదీప్ ఆర్ మోరం, డీ ఓ పి : ప్రవీణ్ కె బంగారి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : కిరణ్ రామానుజం, ఆర్ట్ : వెంకటేష్, లైన్ ప్రొడ్యూసర్ : ప్రసాద్ బిల్లకుర్తి, కొరియోగ్రాఫర్ : మోహన్ కృష్ణ, డైలాగ్స్ : అనిల్ మల్లెల, వి.సూర్య, సాహిత్యం : చరణ్ అర్జున్, లక్ష్మీ ప్రియాంక.



శ్రీ ఆశ్రిత, విగ్నేష్‌రెడ్డి గవి

నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

ఆలిండియా టాపర్‌గా వరుణ్ చక్రవర్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్-2023) ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు సత్తాచాటారు. ఆలిండియా టాపర్‌గా శ్రీచైతన్య విద్యార్థి బోర వరుణ్ చక్రవర్తి 720కి 720 మార్కులను సాధించి ఓపెన్ కేటగిరీలో ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండర్ సుష్మ మాట్లాడుతూ ఎస్ వరుణ్ 715 మార్కులతో తొమ్మిదో ర్యాంకును సాధించారన్నారు. శశాంక్ కుమార్ 14వ ర్యాంకును, రఘురామ్ రెడ్డి 15వ ర్యాంకును పొందారని వివరించారు.

ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాప్ 15లోపు నాలుగు, టాప్ 50లోపు తొమ్మిది, టాప్ 100లోపు 15 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారని చెప్పారు. వివిధ కేటగిరీల్లోనూ టాప్ 10లోపు 11, టాప్ 100లోపు 79 ర్యాంకులు ఒక్క శ్రీచైతన్య విద్యార్థులు ఈ ఘనత పొందారని అన్నారు. 700 మార్కులు ఆపైన 54 మంది విద్యార్థులు పొందారని అన్నారు. ఇది శ్రీ చైతన్య ఆధిపత్యానికి నిదర్శనమన్నారు. అందువల్లే దేశ వ్యాప్తంగా నీట్ ప్రవేశాల కోసం విద్యార్థులు శ్రీచైతన్యను కోరుకుంటున్నారన్నారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత బిఎస్ రావు అభినందించారని వివరించారు.



టాప్ ర్యాంకర్స్‌తో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్స్ శ్రీమతి సుష్మ & శ్రీమతి సీమ

నేడు లాసెట్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్ రాతపరీక్షల ఫలితాలు గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాద్‌లో విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేస్తారని లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ డి రవీందర్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు. లాసెట్‌కు 43,692 మంది దరఖాస్తు చేస్తే 36,218 (83 శాతం) మంది అభ్యర్థులు హాజరైన విషయం తెలిసిందే.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు 77.27 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం మొదటిరోజు ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్-ఏ), ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-1 (కాంపొజిట్ కోర్సు), ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-2 (కాంపొజిట్ కోర్సు) పరీక్షకు 11,489 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 8,878 (77.27 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. 2,611 (22.73 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వివరించారు. మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు.

భువనగిరి ఎమ్మెల్యే ఇంటిపై ఐటీ దాడులు

బీఆర్‌ఎస్ నాయకులు కొండపల్లి మాధవ్ ఇంట్లోనూ..



నవతెలంగాణ- చైతన్యపురి/ అడిక్ మెట్

హైదరాబాద్‌లోని ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలో భువనగిరి శాసనసభ్యులు పైళ్ళ శేఖర్ రెడ్డి ఇంట్లో బుధవారం ఐటీ సోదాలు జరిగాయి. అంతేకాదు, అడిక్‌మెట్ డివిజన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు కొండపల్లి మాధవ్ ఇంట్లోనూ ఐటీ దాడులు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐటీ అధికారులు మాధవ్ ఇంట్లో కొన్ని పత్రాలను పరిశీలించినట్టు తెలిసింది. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నాయకుల ఇండ్లల్లో ఐటీ దాడుల నేపథ్యంలో ఈ అంశం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే సోదాలు జరుగుతున్న విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున భువనగిరి నుంచి శేఖర్ రెడ్డి నివాసానికి చేరుకొన్నారు. కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి, మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. తెలంగాణా నాయకులపై మోడీ సర్కారు కుట్ర చేస్తుందని మండిపడ్డారు.

ఒక్కసారైనా రక్తదానం చేయండి : గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక్కసారైనా రక్తదానం చేయాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. దాతలను అభినందించి సర్టిఫికెట్లను అందజేసారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886